


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 140

గురువారం 10-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 10-8-2023

ఇందుది కృష్ణా జిల్లా పెనమలూరు.
సాధారణ మధ్యతరగతి కుటుంబం.
తండ్రి గెస్ట్ లెక్చరర్. తల్లి గృహిణి.
ఎం.ఎస్. చేయడం కోసం యూఎస్ వెళ్లింది.
ప్రపంచ బ్యాంకు ఉద్యోగం తెచ్చుకుంది.


ఇందు

ప్రపంచ బ్యాంక్‌లో తెలుగమ్మాయి

చిన్నప్పటి నుంచి కష్టపడి చదివే మనస్తత్వం... స్పష్టమైన గమ్యం... లక్ష్యంపై ఏకాగ్రత... నిండైన ఆత్మవిశ్వాసం ఇందు సొంతం. తల్లిదండ్రులు మాధవి, సత్యనారాయణ. విజయవాడలో బీటెక్ పూర్తి చేసి, అమెరికాలో ఎం.ఎస్. పబ్లిక్ పాలసీ చేసింది. ప్రపంచ బ్యాంకులో ఉద్యోగం సాధించిన వైనాన్ని ఆమె 'సాక్షి'తో వివరించింది.

పర్యావరణ పరిరక్షణ

''అమెరికాలో ఎం.ఎస్. చదివి అక్కడే ఉద్యోగం చేయాలని ఉండేది. కోవిడ్ క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా వెళ్లాను. అక్కడికి వెళ్లిన తరువాత నా దృక్కోణం విస్తరించింది. ప్రపంచ స్థాయిలో మానవజాతిని ప్రభావితం చేయగల ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ సంస్థల్లో పని చేయాలని నిర్ణయించుకున్నా. 'యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్- మేసన్'లో ఎంఎస్, పబ్లిక్ పాలసీ కోర్సులో చేరాను. యూనివర్సిటీ స్థాయిలో అనేక అంశాలపై అధ్యయనం చేసి అమెరికాలోనే ప్రఖ్యాతి గాంచిన ప్రొఫెసర్ టిమ్ స్మీడింగ్ వద్ద నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాను. యూనివర్సిటీ స్థాయిలో నేను ఇచ్చిన ప్రజెంటేషన్‌లు, పరిశోధనల ఆధారంగా ప్రపంచ బ్యాంకు ఉద్యోగం ఇచ్చింది.



దక్షిణ ఆసియా వాతావరణం

నాకు ఉద్యోగంలో దక్షిణ ఆసియా దేశాలకు చెందిన వాతావరణ విభాగం బాధ్యతలను కేటాయించారు. వాతావరణ మార్పును అధ్యయనం చేసే నిపుణురాలిగా, జాయింట్ మల్టీ బ్యాంకు డెవలప్‌మెంట్ మధ్య సమన్వయకర్తగా, విధానాల రూపకల్పనలు, వాటికి సాంకేతికతను అన్వయించడం, అమలు చేయటం, వివిధ దేశాలలో ఉండవలసిన కచ్చితమైన వాతావరణ కాలుష్యం ప్రామాణికతల నిర్ణయం, సంబంధిత దేశాల వాతావరణ కాలుష్య కార్యక్రమాల్లో అమలు తేడాలను విశ్లేషించడం నా విధులు. వీటికి సంబంధించిన నివేదికల తయారీ, ఒప్పందాల అమలు పర్యవేక్షణ, సమావేశాల్లో చర్చించటం మా విభాగం నిర్వర్తించాల్సిన ప్రత్యేక విధులు. అమెరికా ప్రభుత్వం నాకు ప్రత్యేకంగా జీ4 వీసా జారీ చేసింది. విధులకు హాజరుకావాలని ప్రపంచ బ్యాంకు నుంచి ఆదేశాలు వచ్చాయి. త్వరలోనే అమెరికాకు వెళ్లి విధుల్లో చేరాలి'' అని చెప్పారు ఇందు కిలారు.

– పోలవరపు వాసుదేవ్,
సాక్షి, పెనమలూరు, కృష్ణా జిల్లా.

గ్లోబల్ వార్మింగ్‌పై అధ్యయనం

ప్రపంచ బ్యాంకు టీమ్‌తో కలిసి దక్షిణ ఆసియా దేశాలలో గ్లోబల్ వార్మింగ్ తగ్గింపుపై ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించాలి. ప్రధానంగా భారత్-పాకిస్థాన్ దేశాలలో వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేస్తాను. ఇండియన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రౌండ్ లెవల్‌లో కూలింగ్ సొల్యూషన్స్‌పై సాంకేతికంగా పాలసీని రూపొందించి దాని అమలుకు కృషి చేస్తాను. ఉష్ణోగ్రతలు 1.5-2 డిగ్రీల వరకు తగ్గించగలిగితే వ్యవసాయం, ఆరోగ్యం, కార్మికులకు అనువైన వాతావరణం నెలకొంటుంది.
– ఇందు కిలారు

సాధించిన విజయాలివి

- కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో జాతీయ స్థాయి క్యాంపస్ ఇంజనీరు పరీక్షకు హాజరైై రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరిలో ఇందు ఒకరు.
- యూఎస్ యూనివర్సిటీలో ఏకగ్రీవంగా యూనిటీ అండ్ డైవర్సిటీ సంఘానికి ఏకగ్రీవంగా కోఆర్డినేటర్‌గా ఎన్నిక. ఆ బాధ్యతల్లో విదేశీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి. విద్యార్థులు, యూనివర్సిటీ అధికారులకు మధ్య వారధిగా పని చేసి మల్టీ టాస్కింగ్ విజర్డ్‌గా గుర్తింపు.
- క్రిసాలిస్ అనే ఎన్‌జీఓ సంస్థలో మేనేజ్‌మెంట్ బోర్డు అడ్వయిజర్‌గా సేవలు అందించడం.
- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, టీచ్ ఫర్ చేంజ్ సంస్థలకు సేవలు అందించడం.
- ఎం.ఎస్.లో అత్యుత్తమ గ్రేడ్స్ సాధించి మూడు సెమిస్టర్లలో రూ 65 లక్షల రూపాయల ఉపకార వేతనం పొందడం.
- విదేశీ విద్యార్థినిగా స్నాతకోత్సవ సభలో యూనివర్సిటీ ఫ్లాగ్ బేరర్‌గా ఎన్నిక. ఔట్‌స్టాండింగ్ స్టూడెంట్ అవార్డు, బెస్ట్ స్టూడెంట్ ఎంప్లాయ్‌గా గోల్డెన్ బ్రిక్ అవార్డు, బెస్ట్ ఫైరో ప్రైజ్ విన్నర్, బెస్ట్ పేపర్ ఇన్ సైన్స్ అండ్ పబ్లిక్ పాలిసీ పురస్కారం.
- ప్రతిష్ఠాత్మకమైన యూరోపియన్ యూనియన్ ప్రాజెక్టు.

న్యూస్‌మేకర్

రాయ్‌పూర్‌లో ఒక టీచర్ పిల్లల్ని వినూత్నంగా ఆకట్టుకుంటోంది.
వారానికి ఒకసారి వారిలాగే యూనిఫామ్ ధరించి స్కూల్‌కు వస్తోంది.
'నేనూ మీలో ఒకదాన్నే' అనే భావన కలిగించడమే కాదు...
టీచర్ అంటే కొట్టే తిట్టే మనిషి కాదనే భరోసా ఇస్తోంది.
దీంతో పిల్లలు ఫుల్లుగా స్కూల్‌కు అటెండ్ అవుతున్నారు.
పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి ఆమె చేస్తున్న ఈ చిన్న ప్రయత్నం
అందరి ప్రశంసలు పొందుతోంది.


పిల్లలతోపాటే యూనిఫామ్ ధరించి వచ్చిన జాహ్నవి

గుడ్ మార్నింగ్ పిల్లలూ...

రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లోని గోకుల్‌రామ్ వర్మ ప్రైమరీ స్కూల్ అనే ప్రభుత్వబడిలో వారమంతా పిల్లలు ఉత్సాహంగా ఉంటారు. శనివారం ఇంకా ఉత్సాహంగా ఉంటారు. దానికి కారణం ఆ రోజు ఆ స్కూల్ టీచర్ జాహ్నవి యదు వారిలాగే తయారయ్యి వారిలాగే యూనిఫామ్ వేసుకుని వస్తుంది. ఆ రోజు కుర్చీలో కూచోదు. వారి మధ్య కూచుని పాఠాలు, కబుర్లు చెబుతుంది. వారితో సంభాషిస్తుంది. అందుకే పిల్లలందరికీ జాహ్నవి యదు టీచర్ అంటే ఇష్టం.

కొత్త ఆలోచన

గోకుల్ రామ్ వర్మ ప్రైమరీ స్కూల్‌లో 1 నుంచి 5 వరకూ చదివే 350 మంది పిల్లలు ఉన్నారు. వారంతా ఆ చుట్టుపక్కల బస్తీవాసుల పిల్లలు. వారి తల్లిదండ్రులకు పెద్దగా చదువు లేదు. పిల్లలకు క్రమశిక్షణ అంటే తెలియదు. స్కూల్‌కు రోజూ రావడం ఇష్టం ఉండదు. యూనిఫామ్ వేసుకోరు. గత సంవత్సరం ఇదే బడిలో టీచర్‌గా చేరిన 30 ఏళ్ల జాహ్నవి యదు ఇదంతా గమనించింది. వారితో తిప్పలు పడింది. దారిలో పెట్టలేక సతమతమయ్యింది. ఈ సంవత్సరం అంటే 2023 జూన్‌లో స్కూల్ రీ ఓపెన్ అయినప్పుడు జాహ్నవి యదు కొత్త ఆలోచన చేసింది. హఠాత్తుగా ఒకరోజు వారిలాగా యూనిఫామ్ వేసుకుని వచ్చింది. పిల్లలు ఆశ్చర్యపోయారు. గుమిగూడారు. నవ్వారు. ఆనందించారు. 'ఎందుకు టీచర్ ఇలా వేసుకొచ్చావ్' అనంటే 'స్కూల్‌కి మీరు ఇలాగే రావాలి. అందుకని వేసుకొచ్చా. మనందరం ఒక టీమ్. మనందరం సూపర్‌గా చదువుకోవాలి' అని వారిని 'మనం' చేశాక వాళ్లు సంతోషించారు. టీచర్‌లా యూనిఫామ్ వేసుకురావాలని వారికీ అనిపించింది. టీచర్ కోసం రోజూ స్కూల్‌కి రావాలని కూడా.

అన్నీ ప్రశంసలే

జాహ్నవి యదు వారానికి ఒకరోజు అంటే ప్రతి శనివారం స్కూల్ యూనిఫామ్‌లో రావడం రాయ్‌పూర్ అంతా పెద్ద వార్త అయ్యింది. జాహ్నవి యదు చర్య వల్ల పిల్లలు బెరుకు లేకుండా తమ మనసుల్లో ఉన్నది చెప్పుకుంటున్నారని స్కూల్ అనేది టీచర్లు చావబాదే స్థలం కాదని తెలుసుకుని క్లాసులకు హాజరవుతున్నారని ఊరు మొత్తం తెలిసింది. అందరూ జాహ్నవి యదును అభినందిస్తున్నారు. 'టీచర్లూ పిల్లలూ బడిలో సమానమే అనే భావన వ్యాప్తి చేయడమే నా ఉద్దేశం' అని జాహ్నవి యదు చెప్పింది. అయితే ఇలాంటి బట్టల్లో రావడానికి ఆమె కొంచెం ఆలోచించింది– అత్తామామలు ఏమంటారోనని. కాని వారు అంగీకరించి దూసుకుపో కోడలు పిల్లా అని ఉత్సాహపరిచారు. దాంతో జాహ్నవి యదు పిల్లలతో ఆడిపాడుతున్నట్టుగా కనిపిస్తూ వారికి పాఠాలు చెబుతూ దారిలో పెడుతోంది.

టీచర్లూ, పిల్లలూ బడిలో సమానమే అనే భావన వ్యాప్తి చేయడమే నా ఉద్దేశం.
– జాహ్నవి యదు

ఫేవరెట్ టీచర్

కొందరు టీచర్లు తమ కెరీర్ మొత్తం ఏ క్లాస్‌కీ ఫేవరెట్ టీచర్ కాకుండానే రిటైర్ అయిపోతారు. కొందరు టీచర్లు ప్రతి సంవత్సరం ఎంతోమంది పిల్లలకు ఫేవరెట్ టీచర్ అవుతారు. పిల్లలతో బంధం వేసుకోవడం టీచర్‌కు చాలా ముఖ్యం. అందులో ఎంతో ఆత్మతృప్తి ఉంటుంది. ఇప్పుడు స్కూల్ మొత్తానికి ఫేవరెట్ టీచర్ అయిన జాహ్నవి యదుని చూసి తాము కూడా పిల్లల కోసం ఏదైనా చేద్దామా అనుకుంటున్నారు మిగిలిన టీచర్లు. అది చాలదూ?

● మల్టీ టాలెంట్

అనన్య సామాన్య స్వతంత్రం


అనన్య బిర్లా

అనన్య బిర్లాకు చెందిన సూక్ష్మరుణ కంపెనీ (ఎంఎఫ్‌ఐ) స్వతంత్ర మైక్రోఫిన్ ప్రైవేట్ లిమిటెడ్ దేశంలో రెండో అతి పెద్ద 'ఎంఎఫ్‌ఐ'గా గుర్తింపు పొందనుంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా గెలుపు జెండా ఎగరేసిన అనన్య బిర్లా సింగర్, రైటర్, యాక్టర్, సోషల్ యాక్టివిస్ట్...

ఏకంగా అయిదు సింగిల్స్‌లో డబుల్ ప్లాటినమ్ స్టేటస్‌ను సొంతం చేసుకుంది. అనన్య గానప్రతిభ గురించి చెప్పుకోవడానికి ఇదొక మచ్చుతునక మాత్రమే. 'లెట్ దేర్ బి లవ్' 'ఎవ్రీ బడీ లాస్ట్' పాటలతో అమెరికన్ నేషనల్ టాప్ 40 పాప్ రేడియో షో జాబితాలో చోటు సాధించిన ఫస్ట్ ఇండియన్ ఆర్టిస్ట్‌గా ఘనత సాధించింది.

అనన్యకు చిన్నవయసు నుంచే సంగీతం అంటే ఇష్టం. పదకొండు సంవత్సరాల వయసులో సంతూర్ ప్లే చేయడం నేర్చుకుంది. ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్ కోసం 'యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్'లో చేరిన అనన్య డిగ్రీ పూర్తి కాకుండానే చదువు మానేసింది.

యూనివర్శిటీలో చదువు సంగతి ఎలా ఉన్నా సంగీతంలో మాత్రం ఎటు చూసినా అనన్య పేరు వినిపించేది. పాడడంతో పాటు కవితలు, పాటలు కూడా రాసేది. గిటార్ ప్లే చేయడం నేర్చుకుంది. 'లివిన్ ది లైఫ్' తన డెబ్యూ సింగిల్. యూట్యూబ్‌లో 14 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్‌లో నిలిచింది.

కునాల్ కోహ్లీ స్పై థ్రిల్లర్ 'శ్లోక్'లో నటిగా ఆకట్టుకుంది.

ఇంగ్లాండ్‌లో ఉన్నప్పుడు సంగీత, సాహిత్య కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేది అనన్య. ఆందోళన, కుంగుబాటుతో సతమతం అవుతున్న యువత కోసం స్టూడెంట్ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఇంగ్లాండ్ నుంచి ఇండియాకు వచ్చిన తరువాత మానసిక సమస్యలతో బాధపడే వారికి సహాయం అందించడానికి 'ఎంపవర్' అనే సంస్థను ఏర్పాటు చేసింది. కోవిడ్ సమయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో కలిసి 24×7 ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. ఈ హెల్ప్‌లైన్ ద్వారా వేలాది మంది ప్రజలకు మేలు జరిగింది. అమెరికాకు చెందిన ప్రసిద్ధ మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ 'నేషనల్ అలయెన్స్ ఆన్ మెంటల్ ఇల్‌నెస్' అంబాసిడర్‌గా నియమితురాలైంది.

'అనన్య బిర్లా ఫౌండేషన్'తో సేవాకార్యక్రమాలను విస్తృతం చేసింది.

సంగీతం అంటే అపారమైన అనురక్తి ఉన్న అనన్య వ్యాపారరంగంలో తొలి అడుగు వేసినప్పుడు...

'అనన్య లోకం వేరు. ఆమె ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించడం కష్టం' అనే గుసగుసలు వినిపించాయి.

అప్పటి వరకు అనన్య పేరు పక్కన సంగీతానికి సంబంధించిన విశేషణాలు కనిపించేవి. తరువాత స్వతంత్ర మైక్రోఫిన్, ఫౌండర్ అనేది ఆమె పేరు పక్కన కనిపించడం మొదలైంది. గ్రామీణ ప్రాంతాలలో మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి 'స్వతంత్ర'ను ఏర్పాటు చేశారు.

తన నాయకత్వ లక్షణాలతో 'స్వతంత్ర'ను అగ్రగామిగా నిలిపింది అనన్య. బెస్ట్ స్టార్టప్‌లకు ఇచ్చే 'గోల్డ్ అవార్డ్'ను గెలుచుకుంది. 2016లో గ్లోబల్ లగ్జరీ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఇక్షై ఏషియాకు సీయీవోగా బాధ్యతలు చేపట్టింది. ఫోర్బ్స్ ఆసియాస్ ఉమెన్ జాబితాలో అనన్య పేరు చోటు చేసుకుంది.

'స్వతంత్ర' వ్యవస్థాపకురాలిగా అనన్య ఆఫీస్ గదికే పరిమితం కాలేదు. క్షేత్రస్థాయిలో పర్యటించేది. ఇండోర్‌లో ఒక పేదింటి మహిళ 'స్వతంత్ర' సహకారంతో ఇల్లు కట్టుకోగలిగింది. ఆమెతో మాట్లాడినప్పుడు అనన్యకు ఎంతో సంతోషంగా అనిపించింది.

అనన్య అపురూప విజయాలు చూసినప్పుడు 'ఏ పని చేసే వాళ్లు ఆ పని చేస్తే మంచిది' 'రెండు పడవల మీద కాలు వద్దు' లాంటి మాటలు, సామెతలు బిత్తర పోతాయి. పనిమీద అనురక్తి, అంకితభావం ఉంటే ఒక రంగానికి చెందిన వారు మరో రంగంలో విజయం సాధించవచ్చు అని చెప్పడానికి అనన్య బిర్లాలాంటి వాళ్లు పెద్ద ఉదాహరణ.

పెద్దింటి అమ్మాయి



పారిశ్రామిక దిగ్గజం కుమార మంగళం బిర్లా కూతురు అయిన అనన్య బిర్లా బాల్యం నియమ నిబంధనలు, రక్షణ వలయాల మధ్య గడిచింది. చిన్నప్పుడే అనన్యకు బాడీగార్డ్ ఉండేవాడు. మిగతా అమ్మాయిల్లాగా ఎక్కడ పడితే అక్కడ ఆడుకోవడానికి లేదు. ఈ రూల్స్‌తో తనకు ఊపిరి ఆడేది కాదు. ఒత్తిడికి గురయ్యేది. ఇంత ఒత్తిడిలోనూ తనదైన కలలు కనేది. 'అసలు నేనేమిటి?' అనే ప్రశ్నకు ఆమెకు సంగీతంలో జవాబు దొరికింది. సంగీతం తనలోని ఒంటరితనాన్ని పోగొట్టడమే కాదు ఆత్మబలాన్ని ఇచ్చింది. 'పెద్దింటి అమ్మాయి' అనే పేరు కంటే స్వేచ్ఛాప్రపంచాన్నే అనన్య ఇష్టపడేది.

పెద్ద యూనివర్శిటీలో పెద్ద చదువు చదవాలి. పెద్దింటి కుటుంబానికి చెందిన అబ్బాయిని పెళ్లి చేసుకోవాలి... ఇలా నా గురించి అనుకునేవారు. అయితే నా ఆలోచనలు దీనికి భిన్నంగా ఉండేవి. ఇది చాలామందిని ఆశ్చర్యపరిచేది. అయితే తల్లిదండ్రులు మాత్రం నాకు ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉన్నారు. నా అభిప్రాయాలకు విలువ ఇచ్చారు' అంటుంది అనన్య.

హెయిర్ కేర్



ఉసిరి పొడిలో నిమ్మరసం వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి క్యాప్ పెట్టుకోవాలి. గంట తరువాత మైల్డ్ షాంపూతో తల స్నానం చేయాలి. ఈ ప్యాక్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉండి కురులను దృఢంగా మారుస్తుంది. జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. త్వరగా తెల్లబడదు.



బ్యూటిప్స్

చూడచక్కని కనుబొమల కోసం...

కొంతమందికి కనుబొమలు బాగా పలుచగా, ఉండీ లేనట్టుగా కనిపిస్తాయి. కనుబొమలు తీరైన ఆకృతితో, దట్టంగా ఉంటేనే ముఖారవిందం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. పలుచని కనుబొమ్మలను ఒత్తుగా... నల్లగా మార్చుకోవడానికి ఇలా ప్రయత్నించి చూడండి...





ఆముదం: జుట్టు పెరుగుదలకు దోహదపడే వాటిలో ఆముదం ముందు వరుసలో ఉంటుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు, విటమిన్ ఇ, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. దూదిని ఆముదంలో ముంచి పలుచని ఐబ్రోస్ మీద అద్దుకుని ఐదు నిమిషాలు మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల వెంట్రుకలు ఒత్తుగా పెరుగుతాయి.

ఉల్లిపాయ రసం: ఉల్లిపాయలో ఉండే సల్ఫర్ జుట్టు ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. ఉల్లిపాయ రసాన్ని రోజూ కనుబొమలకు రాసుకోవాలి. రెండు మూడు వారాల్లోనే చక్కని ఫలితం కనిపిస్తుంది.

ఆలివ్ ఆయిల్ : ఫీనాలిక్ కాంపౌండ్స్ ఉండే ఆలివ్ నూనెను కనుబొమ్మలకు రాస్తే .. వెంట్రుకలు నల్లగా పెరుగుతాయి.

సబ్బులతో సాంత్వన

మాట్లాడే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని పెద్దలు చెబుతుంటారు. ఆదుకోవాలని మనసు ఉండాలే గానీ, సరికొత్త దారులు అనేకం కనిపిస్తాయని చేసి చూపెడుతోంది పదిహేడేళ్ల సీమర్ సంగ్లా. యాసిడ్ దాడి బాధితులు తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు సబ్బుల తయారీలో శిక్షణ ఇస్తూ ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తోంది.


సీమర్ సంగ్లా



యాసిడ్ బాధితులకు సబ్బుల తయారీలో శిక్షణ ఇస్తున్న సీమర్ సంగ్లా

ఢిల్లీకి చెందిన సీమర్ ఇంటర్మీడియట్ చదువుతోంది. ఒకసారి పూనమ్ అనే అమ్మాయి మీద యాసిడ్ దాడి జరిగింది. దీంతో ఆమె ముఖం మొత్తం కాలిపోయింది. అయితే ఆమె మామూలు సబ్బులతో స్నానం చేస్తే యాసిడ్ దాడి జరిగిన ప్రదేశంలో బాగా మంట పుట్టేది. ఈ విషయం తెలిసిన యాసిడ్ దాడి బాధితులకు సాయం చేసే సీమర్ తల్లి... పూనమ్‌ను ఆదుకునే క్రమంలో ... మంట రాని సబ్బు తయారు చేయాలనుకుంది. ఈ క్రమంలోనే సీమర్ అమ్మ, అమ్మమ్మలు కలిసి, సబ్బు తయారు చేశారు. యాసిడ్ దాడికి కాలిపోయిన పూనంకు ఈ సబ్బు స్వాంతన కలిగించింది. వాడుకోవడానికి చాలా అనువుగా అనిపించింది. ఇదంతా దగ్గర నుంచి చూసిన సీమర్ యాసిడ్ బాధితుల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం మొదలు పెట్టింది. పూనమ్‌లా ఎంతోమంది యాసిడ్ దాడికి గురైనట్లు తెలుసుకుని, వాళ్లందరికి తాను ఏదోరకంగా సాయపడాలనుకుంది. గతేడాది యాసిడి బాధితుల అవసరాలకు తగినట్లుగా 'సేఫ్ కేవ్' పేరిట సబ్బులు తయారు చేయడం ప్రారంభించింది.

అలోవెర, తేనెలతో సబ్బులు తయారు చేసి యాసిడ్ బాధితులకు ఇచ్చేది. ఈ సబ్బులు బాధితులకు సాంత్వననిచ్చేవి. వారి ఆసక్తిని గమనించిన సీమర్... సబ్బుల తయారీలో శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టింది. శిక్షణ తీసుకున్న వారంతా సబ్బులు తయారు చేసి మార్కెట్లో విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు. దీంతో వాళ్లకంటూ ఒక గుర్తింపుతోపాటు, సాధారణ అమ్మాయిల్లా జీవించగలుగుతున్నారు.

సీమర్.. ఇప్పటిదాక ఇరవైమందికిపైగా సబ్బుల తయారీలో శిక్షణ ఇచ్చింది. యాసిడ్ బాధితుల గురించి తన స్నేహితులు, ఇతర పిల్లలకు చెబుతూ వారికి సాయం చేయాలని కోరుతోంది. ఇది చిన్నపనే అయినప్పటికీ వారి జీవితాల్లో పెద్ద మార్పుని తీసుకొస్తుంది సీమర్. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన బాధితులంతా సీమర్ శిక్షణతో ధైర్యాన్ని కూడగట్టుకొంటూ జీవితంపై కొత్త ఆశలతో ముందుకు సాగుతున్నారు.

గురువారం 10-8-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 140



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



అక్టోబర్ 14న భారత్, పాక్ మ్యాచ్
ప్రపంచకప్ టోర్నీలో ఒకరోజు ముందుకు జరిగిన కీలక సమరం. -12లో




ఆదుకున్న ఆఖర్లో కొనుగోళ్లు
కనిష్ట స్థాయిల నుంచి రికవరీ 19,600 పాయింట్లపైకి నిఫ్టీ -13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆ రాజకీయాలను తరిమికొట్టాలి
అవినీతి నిర్మూలన, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలను భారత్ నుంచి తరిమి కొట్టాలని ప్రధాని మోదీ అన్నారు.
- వివరాలు 6లో



ఇక మాది కేరళం రాష్ట్రం !
రాష్ట్రం పేరును కేరళంగా మార్చుకోవాలని కేరళ శాసనసభ తీర్మానించింది. దీనిపై కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది.
- వివరాలు 6లో



జీఎస్టీ మార్పులకు కేబినెట్ ఓకే
ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోల్లో ప్రవేశస్థాయి పూర్తి ముఖ విలువపై 28% జీఎస్టీ విధించేలా చేసిన మార్పులకు కేబినెట్ ఆమోదం.
- వివరాలు 13లో



అంకాపూర్ @ మక్కవడలు
అంకాపూర్ చికెన్.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని ఆ దేశీ చికెన్ అంటే తెలియనివాళ్లు ఉండరు.
- వివరాలు 2లో

న్యూస్‌రీల్

వివాదాలొద్దు.. ఎన్నికలపై దృష్టి పెట్టండి



కొత్తగూడెం ఎమ్మెల్యేగా అనర్హత కేసులో సుప్రీంలో ఊరట పొందిన బీఆర్‌ఎస్ శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు సీఎం కేసీఆర్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయ స్థితిగతులను వనమా వివరించినట్లు సమాచారం.
- వివరాలు 3లో

కోటి ఎకరాల మాగాణి



తెలంగాణలో మాగాణి కోటి ఎకరాలకు చేరువలో ఉంది. భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అధిక వర్షాలతో ఓవైపు పంటనష్టం జరిగినా, మరోవైపు ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సమయానికి ఆయా పంటల వారీగా అధికంగానే సాగైందని చెప్పవచ్చు.
- వివరాలు 14లో

'పాలమూరు'పై కాగ్ ఆడిట్



ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై రెండేళ్లుగా విస్తృత స్థాయిలో సుదీర్ఘ ఆడిట్ నిర్వహిస్తోన్న కాగ్.. తాజాగా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై దృష్టి సారించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న ఆడిట్‌లో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును చేర్చినట్టు వెల్లడించింది.
- వివరాలు 2లో

మాటల తూటాలు

మణిపూర్ అంశంపై అధికార, విపక్షాల వ్యాఖ్యలతో అట్టుడికిన లోక్‌సభ



లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్

మణిపూర్‌లో భరతమాతను హత్య చేశారు: రాహుల్ గాంధీ

అక్కడికి ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకెళ్లడం లేదని నిలదీత

ఈ అంశాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటు: అమిత్ షా

దీనిపై రాహుల్ గాంధీ డ్రామా నడిపించారని మండిపాటు

లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై రెండోరోజు చర్చ

మణిపూర్‌లో శాంతిని కోరుతూ లోక్‌సభలో తీర్మానం ఆమోదం

- మణిపూర్‌లో భరతమాతను హత్య చేశారంటూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు లోక్‌సభలో పెను దుమారం సృష్టించాయి. లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ తర్వాత తొలిసారిగా సభలో మాట్లాడిన ఆయన ఘాటు వ్యాఖ్యలతో బీజేపీపై, ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ రెండోరోజు బుధవారం కూడా కొనసాగింది. అధికార, విపక్షాల మధ్య మాటల మంటలు చెలరేగాయి. మణిపూర్‌లో హింసాకాండను అరికట్టడంలో నరేంద్ర మోదీ సర్కారు దారుణంగా విఫలమైందని రాహుల్ నిప్పులు చెరిగారు. మణిపూర్ ప్రజలను హత్య చేయడం ద్వారా భారత దేశాన్ని హత్యచేశారని, అందుకే ప్రధాని అక్కడికి వెళ్లడం లేదని విమర్శించారు. బీజేపీ నాయకులు దేశ భక్తులు కాదు, ముమ్మాటికీ దేశ ద్రోహులేనని మండిపడ్డారు. విపక్షాల ఆరోపణలను లోక్‌సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తిప్పికొట్టారు. మణిపూర్ అంశాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటని విపక్షాలపై ధ్వజమెత్తారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

అగ్నికి ఆజ్యం పోయవద్దని సూచించారు. పొరుగు దేశం మయన్మార్ నుంచి కుకీ తెగ గిరిజనులు మణిపూర్‌కు వలస రావడం వల్లే అక్కడ సమస్య మొదలైందని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో ఘర్షణలు తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. హింసకు ఇక స్వస్తి పలికి శాంతియుతంగా కలిసిమెలసి ఉండాలని మణిపూర్ తెగలకు ఆయన విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో శాంతిని కోరుకుంటూ అమిత్ షా ప్రతిపాదించిన తీర్మానాన్ని లోక్‌సభలో ఆమోదించారు. - పూర్తి వివరాలు 6లో

మహిళా మంత్రికి ముద్దులా..?

- మహిళా ఎంపీలను అవమానించాడు
- కేంద్ర మహిళా మంత్రులు, ఎంపీల ధ్వజం
- కఠినాతి కఠిన చర్యలు తీసుకోండి
- లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు
- బీజేపీకి రాహుల్ ఫోబియా: కాంగ్రెస్

- వివరాలు 6లో



బుధవారం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా వంగవీడులో 'రాత్రి బస' చేశారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులు, స్థానికులతో మాట్లాడారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేసి అక్కడే నిద్రించారు. - మధిర

'లోకల్ టచ్' స్క్రీనింగ్?

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో కొత్త విధానం
- గతంలో గాంధీభవన్, ఢిల్లీ వేదికగా స్క్రీనింగ్ కమిటీ భేటీలు
- ఈసారి జిల్లాలకు వెళ్లే యోచనలో చైర్మన్ మురళీధరన్
- అక్కడే ఆశావహులతో భేటీలు.. ముఖ్యనేతల అభిప్రాయ సేకరణ

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ పార్టీ గతానికి భిన్నంగా వ్యవహరించనున్నట్టు తెలుస్తోంది. అభ్యర్థులుగా ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై ఏఐసీసీ నియమించిన స్క్రీనింగ్ కమిటీ ఈసారి క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ జరపనున్నట్టు సమాచారం. టికెట్ ఆశిస్తున్న నేతలతో ఆయా జిల్లాల్లోనే సమావేశం కావడంతో పాటు నియోజకవర్గాల వారీగా ముఖ్య నాయకుల అభిప్రాయాలు కూడా తీసుకోనుందనే చర్చ జరుగుతోంది. తనను ఇటీవల కలిసిన టీపీసీసీ నాయకుడు ఒకరితో, ఏఐసీసీ నియమించిన రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ ఈ మేరకు వెల్లడించడం గమనార్హం.

గతంలో గాంధీభవన్‌లో..

టికెట్ల కేటాయింపునకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ చాలా కాలంగా ఓ సాంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. తమకు టికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరి పేర్లను టీపీసీసీ గాంధీభవన్‌లో షార్ట్‌లిస్ట్ (వడపోత) చేసి ఢిల్లీకి పంపడం, వారితో ఏఐసీసీ నియమించిన స్క్రీనింగ్ కమిటీ ఢిల్లీలో సమావేశమై మాట్లాడిన తర్వాత మళ్లీ షార్ట్‌లిస్ట్ చేయడం, ఆ తర్వాత ఏఐసీసీ ఎన్నికల కమిటీ తుదిగా అభ్యర్థులను ఖరారు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే 2018 ఎన్నికల సందర్భంగా ఏఐసీసీ నియమించిన స్క్రీనింగ్ కమిటీ హైదరాబాద్‌కు వచ్చింది. పీసీసీ షార్ట్‌లిస్ట్ చేసిన
మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణవాది కాదు.. వ్యాధి



పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి కేటీఆర్

రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజం
- హిందూ, ముస్లింల మధ్య గొడవలు పెడుతున్న బీజేపీ
- ఢిల్లీ బానిసలకు, తెలంగాణ ఆత్మగౌరవానికి మధ్యే ఎన్నికలు

నిజామాబాద్ అర్బన్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నికార్సైన తెలంగాణ వాది కాదని, తెలంగాణకు పట్టిన వ్యాధి అని మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులపై రైఫిల్ తీసుకొని దాడికి దిగిన రైఫిల్‌రెడ్డి అని దుయ్యబట్టారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి డబ్బు సంచులతో దొరికిన థర్డ్ డిగ్రీ దొంగ అని ఆరోపించారు. తెలంగాణ ప్రాంత రైతులకు మూడు గంటల కరెంటు ఇస్తే చాలు, కేసీఆర్ మూడు పంటలకు సరిపోయే కరెంటు ఎందుకు ఇస్తున్నారని అన్న వ్యక్తి అని విమర్శించారు. 'మూడు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా?
మిగతా 3వ పేజీలో ▶

అంగళ్లు దాడుల కేసులో ఎ1గా చంద్రబాబు



- హత్యాయత్నం, నేరపూరిత కుట్ర సహా పలు సెక్షన్ల కింద కేసు
- నిందితుల్లో మాజీ మంత్రులు దేవినేని, అమర్‌నాథ్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్, రమేష్‌పైనా కేసు.. మొత్తం 20 మందిపై కేసు నమోదు
- బాబు యాత్రలో ఉద్దేశపూర్వకంగానే టీడీపీ దాడులు.. కుట్ర ప్రకారమే మారణాయుధాలు, బాటిళ్లు ముందుగా సిద్ధం
- ఫిర్యాదు చేసిన అంగళ్లు మార్కెట్ కమిటీ చైర్మన్.. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

10లో

రామోజీ, శైలజకు సీఐడీ నోటీసులు

- 16, 17 తేదీల్లో విజయవాడలో విచారణ
- ఈసారి హాజరుకాకపోతే న్యాయపరంగా కఠిన చర్యలకు యోచన.. కోర్టు ద్వారా నోటీసులు ఇప్పించాలని నిర్ణయం
- జూలై 5న ఏపీలో విచారణకు రాని రామోజీ.. ఇప్పటికే ఇద్దరిని హైదరాబాద్‌లో పలుమార్లు విచారించిన సీఐడీ

10లో



వట్టిపోతున్న నాగార్జున సాగర్

- నాగార్జునసాగర్ ప్రాజెక్టు వెలవెలపోతోంది. సాగునీరు లేక.. దుక్కులు సిద్ధం చేసిన సాగర్ ఆయకట్టు రైతులు ఆందోళనలో పడ్డారు. బోరుబావుల సౌకర్యం ఉన్న రైతులు వరినార్లు పోసి కాల్వలకు నీటిని విడుదల చేయకపోతారా అని ఎదురుచూస్తుండగా, మిగతా వారు సాగర్ నీటి కోసం ఎదురుచూస్తూ అలాగే ఉండిపోయారు.

- వివరాలు 2లో

ఎంఐఎం చేతిలో కారు స్టీరింగ్

- ఆ పార్టీ విధానాలనే కేసీఆర్ అమలు చేస్తున్నారు
- బీఆర్‌ఎస్ బీ టీమ్ కాంగ్రెస్
- రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోంది
- కేంద్ర నిధులతోనే హైదరాబాద్‌లో అభివృద్ధి పనులు
- బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్



మన్సూరాబాద్/ దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణలో బీఆర్‌ఎస్ కారు స్టీరింగ్ మజ్లిస్ పార్టీ చేతిలో ఉందని, మజ్లిస్ పార్టీ విధానాలనే సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ విమర్శించారు. ఎల్‌బీనగర్‌లోని రంగారెడ్డి అర్బన్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తరుణ్‌చుగ్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, అందుకే ప్రజలు రాష్ట్రంలో మార్పును కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీ బీ టీమ్‌గా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, పేద ప్రజల ఆరోగ్య బీమా కోసం కేంద్రం ప్రభుత్వం అందజేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం తెలంగాణలో అమలు కావటం లేదని మండిపడ్డారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన
మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మనం హామీలు నెరవేర్చనందుకు ఎన్నికల అధికారులతో ఇబ్బంది ఏదన్నా ఉంటుందా సార్!

మజ్లిస్ సెక్యులర్ ఎలాగో కేసీఆర్ చెప్పాలి?



- పచ్చి మతోన్మాద మజ్లిస్ పార్టీతో స్నేహం చేస్తూ ఏ రకంగా తమది సెక్యులర్ పక్షమో సీఎం కేసీఆర్ చెప్పాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

- వివరాలు 2లో

కీలక పరీక్షలకు ఖరారు కాని తేదీలు

డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ, గ్రూప్–3 పరీక్షల కోసం అభ్యర్థుల ఎదురుచూపులు

- ఈ మూడు కేటగిరీల్లో 10 లక్షలకు పైగా దరఖాస్తులు
- హెచ్‌డబ్ల్యూఓ, గ్రూప్–3 పోస్టులకు దరఖాస్తులు ముగిసి ఆర్నెల్లు
- నవంబర్ తర్వాత ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల్లో అయోమయం

14లో

క్లుప్తంగా...

తెలంగాణపై ఎందుకీ వివక్ష: నామా



సాక్షి, న్యూఢిల్లీ: వ్యవసాయం, విద్యుత్, సాగు, తాగునీరు తదితర రంగాల్లో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ కేంద్రం నయాపైసా సాయం చేయడం లేదని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత నామా నాగేశ్వర్ రావు విమర్శించారు. లోక్‌సభలో బుధవారం కేంద్రంపై అవిశ్వాస చర్చ సందర్భంగా నామా మాట్లాడుతూ ప్రధాని స్థానంలో ఉన్నవారికి చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, మద్దతిచ్చే రాష్ట్రం, మద్దతివ్వని రాష్ట్రం అన్న వ్యత్యాసం ఉండరాదని హితవు పలికారు. కానీ తెలంగాణను కేంద్రం విస్మరిస్తోందని.. తొమ్మిదేళ్లుగా అన్యాయం చేస్తూనే ఉందని దుయ్యబట్టారు. ఏపీ విభజన చట్టం ప్రకారం తెలంగాణకు స్టీల్ ప్లాంట్, ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, ట్రైబల్ యూనివర్సిటీలు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదని వివరించారు. వైద్య కళాశాలలు, నవోదయ విద్యాలయాలు ఒక్కటైనా మంజూరు చేయకుండా తెలంగాణను విస్మరించిందని పేర్కొన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు మంజూరైనా రద్దు చేశారని, దీనిపై కేంద్రం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మణిపూర్ లాంటి సంఘటనల వల్ల దేశ ప్రతిష్ట అంతర్జాతీయంగా దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నిటి దృష్ట్యా అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నట్లు స్పష్టం చేశారు.

పార్లమెంటులో రాహుల్ తీరు శోచనీయం: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ వ్యవహరించిన తీరు శోచనీయమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. మహిళల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న చిన్న చూపుకు ఈ ఘటన నిదర్శనమని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి పార్లమెంటులో రాహుల్ గాంధీ అసభ్య సంజ్ఞలతో మహిళా పార్లమెంటు సభ్యుల పట్ల చిల్లరగా ప్రవర్తించడం ఆయన సంస్కారాన్ని బహిర్గతం చేస్తోందని, ఈ వ్యవహారం చూసి సభ్యసమాజం తల దించుకుంటుందని మండిపడ్డారు. పార్లమెంటులో ఇష్టం వచ్చినట్లుగా ఆరోపణలు చేయడం, సంస్కారం లేకుండా ప్రవర్తించడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ, దేశ ప్రజలకు, మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

సార్వభౌమత్వానికి భంగం

- డబ్ల్యూహెచ్‌వోపై సామాజిక కార్యకర్తల ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ పేరుతో దేశాలన్నింటిపై పెత్తనం చెలాయించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రయత్నిస్తోందని సామాజిక కార్యకర్తలు ఆరోపించారు. కోవిడ్ మహమ్మారా? కాదా? అన్న విషయంలోనూ సందేహాలున్నాయని వారు పేర్కొన్నారు. 'డబ్ల్యూహెచ్‌ఓ పాండమిక్ ట్రీటీ: దేశ సార్వభౌమత్వానికి, పౌరుల హక్కులకు పొంచి ఉన్న విపత్తు' అన్న అంశంపై బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో సామాజిక కార్యకర్త, డాక్యుమెంటరీ జర్నలిస్టు సరస్వతి కవుల మాట్లాడారు. డబ్ల్యూహెచ్‌ఓ తీసుకొస్తున్న పాండమిక్ ట్రీటీ (మహమ్మారి ఒప్పందం) వల్ల భవిష్యత్తులో కోవిడ్ తరహా వ్యాధులు ప్రబలినప్పుడు దేశాలు మొత్తం డబ్ల్యూహెచ్‌ఓ చెప్పినట్లు నడుచుకోవాల్సి వస్తుందని, ఇది ఆయా దేశాల సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, సామాజిక కార్యకర్త పద్మజ షా పాల్గొన్నారు.

నిర్మల్, భువనగిరి, జనగాంలకు కొత్త డీసీసీ అధ్యక్షులు

సాక్షి, న్యూఢిల్లీ: నిర్మల్, భువనగిరి, జనగాం జిల్లాలకు నూతన డీసీసీ అధ్యక్షులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. నిర్మల్‌కు కూచడి శ్రీహరి రావ్, భువనగిరికి అందెం సంజీవరెడ్డి, జనగాంకు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిలను డీసీసీ అధ్యక్షులుగా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.





అంకాపూర్ @ మక్క వడలు

- దేశీ చికెన్‌తో పాటు ఇప్పుడు మక్క వడలకూ ఫేమస్
- ఆ చికెన్‌తో నంజుకుని తింటే.. ఆ టేస్టే వేరు
- ఏడాదిలో ఆరున్నొక్క నెలలే లభ్యం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అంకాపూర్ చికెన్.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని ఆ దేశీ చికెన్ అంటే తెలియనివాళ్లు ఉండరు. దీన్ని తినేందుకు హైదరాబాద్ సహా వివిధ జిల్లాల నుంచి ప్రతిరోజూ పలువురు వస్తుంటారు. దేశవిదేశాలకు సైతం అంకాపూర్ దేశీ చికెన్ పార్శిళ్లుగా వెళుతున్న విషయం తెలిసిందే. చికెన్‌తో పాటు పశువుల గడ్డిని పెంచేందుకు వినియోగించే ఎర్రజొన్న విత్తనానికి కూడా ఇటీవల ఈ ప్రాంతం ఫేమస్ అయింది. అంకాపూర్‌లో ఎర్రజొన్న విత్తనాన్ని బైబ్యాక్ ఒప్పందం ద్వారా కొనుగోలు చేసి, ప్రాసెస్ చేసి మన దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాలకు సైతం ఎగుమతి చేసే కంపెనీలు 40 వరకు ఇక్కడ ఉన్నాయి. ఇప్పుడు చికెన్, ఎర్రజొన్న విత్తనంతో పాటు మరో విషయంలోనూ అంకాపూర్ ప్రత్యేకతను సాధిస్తోంది. అదే అంకాపూర్ 'మక్క వడలు'. ఈ ఒక్క ప్రాంతంలోనే ఆ మక్క వడలు లభ్యమవుతాయి. ప్రతి ఏటా జూన్ నెల నుంచి జనవరి నెల లోపు ఈ వడలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. దేశీ చికెన్‌తో మక్క వడలను నంజుకుని తింటే.. ఆ రుచే అద్భుతం అంటూ భోజన ప్రియులు ఆసక్తి చూపిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్నారు. మక్క వడల పార్శిళ్లు సైతం భారీగా తీసుకెళుతున్నారు. ఈ రహదారిలో వెళ్లేవారు కచ్చితంగా మక్క వడల రుచి చూడడం ఆనవాయితీగా మారింది.

రోహిణి కార్తెలోనే...

అంకాపూర్ గ్రామ రైతులు రోహిణి కార్తెలోనే మొక్కజొన్న విత్తడమనేది ప్రత్యేకం. బోర్లలో నీరు సమృద్ధిగా ఉన్న రైతులు మే నెల మొదటి వారంలోనే మొక్కజొన్న వేస్తారు. సుమారు 500 ఎకరాల్లో పంట వేస్తారు. జూలైలో పంట వస్తుంది. ఈ రైతులు నేరుగా పచ్చి కంకులను అమ్ముతారు. దీంతో ప్రతి ఏటా జూలై నుంచి మక్క వడలు ఇక్కడ తయారు చేస్తారు.

➤ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న వానాకాలం పంటను జూన్‌లో నాటడం ప్రారంభిస్తారు. అదేవిధంగా పసుపులో అంతరపంటగానూ మొక్కజొన్న వేస్తారు. ఇలా వేసే పంట ప్రతి ఏటా మొత్తం కలిపి జిల్లాలో 30,800 ఎకరాలు ఉంటోంది. అంకాపూర్ మక్క మార్కెట్ నుంచి మహారాష్ట్ర, హైదరాబాద్ వరకు మొక్కజొన్న ఎగుమతి చేస్తున్నారు. మధ్యవర్తులు ఎకరం లెక్కన పంట కొనుగోలు చేస్తారు. లేనిపక్షంలో ట్రాలీ ఆటోల లెక్కన కొనుగోలు చేస్తారు. మొక్కజొన్న సీజన్ జనవరి వరకు ఉంటుంది. దీంతో అంకాపూర్‌లో 7 కుటుంబాల వారు ప్రత్యేకంగా మక్క వడలను ఈ సీజన్‌లో తయారు చేస్తున్నారు.



సీజన్‌లో మక్క వడలు మాత్రమే..

15 ఏళ్ల క్రితం నుంచే మా ఊళ్లో మక్క వడలు చేసి అమ్మడం ప్రారంభమైంది. గతంలో మేము టిఫిన్ సెంటర్ నడిపేవాళ్లం. మక్క వడలు చేయడం ప్రారంభించాక వీటికి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. దీంతో సీజన్‌లో 7 నెలల (జూన్ నుంచి జనవరి వరకు) పాటు పూర్తిగా మక్క వడలు మాత్రమే చేసి అమ్ముతున్నాం.
-రెగుల్వార్ సిద్ధు, కపిల దంపతులు

డెడ్ స్టోరేజీకి 'సాగర్'!

సాక్షిప్రతినిధి, నల్లగొండ

నాగార్జునసాగర్ ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. బోరుబావుల వసతి ఉన్నవారు నార్లు పోసి నీటివిడుదల కోసం ఎదురుచూస్తుండగా, మిగతావారు ఎగువ కృష్ణానది నుంచి వరద వస్తుందా ? లేదా ? అన్న ఆందోళనలో ఉన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమకాల్వ ద్వారా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో స్థిరీకరించిన ఆయకట్టు 6.57 లక్షల ఎకరాలు. గతేడాది జూలై 28వ తేదీన ఎడమ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాలకు సాగునీటిని విడుదల చేశారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

శ్రీశైలం ప్రాజెక్టు వరకే...

గత నెల చివరలో కురిసిన వర్షాలతో కృష్ణానదికి ఎగువ నుంచి వరద రాక మొదలైంది. అది కూడా శ్రీశైలం ప్రాజెక్టు వరకే వస్తోంది. దిగువకు అంటే నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి నీరు రాలేదు. ఈ ఆగస్టులోనూ ఇంతవరకు వర్షాలు పడలేదు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.81 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 864.57 అడుగుల (120.92 టీఎంసీలు) మేర మాత్రమే నీటినిల్వ ఉంది. ప్రస్తుతం ఎగువ నుంచి 65 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. కృష్ణానదికి ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద వస్తే మరో వారంలో ఈ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు అవకాశం ఉంటుంది. లేదంటే 15 రోజులకుపైగా సమయం పట్టవచ్చని, ఆ ప్రభావం నాగార్జునసాగర్ ఆయకట్టుపైనా తీవ్రంగా ఉంటుందని చెబుతున్నారు. వ్యవసాయశాఖ కూడా అప్పుడే ముమ్మరంగా వరి నాట్లు వద్దని, పంటలు ఎండిపోయే పరిస్థితి రావొచ్చని పేర్కొంటోంది.

సాగర్ 570 అడుగులకు చేరితేనే....

నాగార్జునసాగర్ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 590 అడుగులు. కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల చేయాలంటే సాగర్ జలాశయంలో కనీసం 570 అడుగుల మేర నీటినిల్వ ఉండాలి. అయితే ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి దగ్గరలో ఉంది. డెడ్ స్టోరేజ్ 510 అడుగులు కాగా, ప్రస్తుతం 515.4 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. నల్లగొండ, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు మాత్రమే ఈ నీటిని వినియోగించుకునే పరిస్థితి నెలకొంది. వ్యవసాయానికి ఇచ్చే పరిస్థితి లేదు. సాగర్ రిజర్వాయర్‌లోని బ్యాక్‌వాటర్ నుంచే నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ కింద 597 గ్రామాలకు రోజుకు 25 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేయాల్సి వస్తోంది. హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటి అవసరాల కోసం రోజుకు 595 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఆందోళనలో ఆయకట్టు రైతులు

- ఎగువ నుంచి కృష్ణమ్మ రాకకోసం ఎదురుచూపులు
- శ్రీశైలం ప్రాజెక్టుకే ఇన్‌ఫ్లో

ప్రాజెక్టుల నీటిమట్టం ఇలా... (అడుగుల్లో)

	గరిష్టం	ప్రస్తుతం
శ్రీశైలం	885	864.57
నాగార్జున సాగర్	590	515.4



ప్రస్తుతం సాగర్ జలాశయంలో నీరు

సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల ఇలా...

2019	ఆగస్టు 12
2020	ఆగస్టు 8
2021	ఆగస్టు 2
2022	జూలై 28



నారు ఎండిపోతోంది

పదిహేను రోజుల క్రితం వరినారు పోశాను. ఎడమకాల్వ నీటికోసం ఎదురుచూస్తున్నా. బోరుబావుల కింద ఐదు ఎకరాలు నాట్లు వేశా. ఎడమకాల్వ నుంచి నీరు విడుదల కాకపోవడంతో బోర్లలో కూడా నీరు తగ్గిపోయింది. నారుమడి, నాట్లు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. సకాలంలో సాగునీరు అందించకుంటే నష్టపోయే ప్రమాదం ఉంది.
- పసునూరి హనుమంతరెడ్డి, రైతు, యాద్గార్‌పల్లి, మిర్యాలగూడ


'పాలమూరు'పై కాగ్ ఆడిట్!

సాక్షి, హైదరాబాద్

- ఆడిట్ నివేదిక 2022–23 జాబితాలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు
- ఎత్తిపోతల సమాచారం కోసం నీటి పారుదల శాఖకు లేఖ
- అంచనాలు, వ్యయం, పురోగతి, రాష్ట్ర బడ్జెట్ నిధులు, రుణాల వివరాలివ్వాలి
- ప్రాజెక్టులో పనిచేసే ఇంజనీర్ల పేర్లు, చిరునామాలు సైతం కావాలి
- నీటిపారుదల శాఖకు సూచించిన ఏజీ కార్యాలయం

ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై గత రెండేళ్లుగా విస్తృత స్థాయిలో సుదీర్ఘ ఆడిట్ నిర్వహిస్తోన్న కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) ..తాజాగా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై దృష్టి సారించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న ఆడిట్‌లో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును చేర్చినట్టు వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించిన పలు కీలక సమాచారాన్ని నిర్దేశిత నమూనాలో అందజేయాలని తాజాగా రాష్ట్ర నీటి పారుదల శాఖకు హైదరాబాద్‌లోని అకౌంటెంట్ జనరల్(ఆడిట్) కార్యాలయం లేఖ రాసింది.

పక్కాగా పట్టికరూపంలో ఇవ్వండి



ప్రాజెక్టులో అంతర్భాగంగా చేపట్టిన జలాశయాలు, కాల్వలు, పంప్‌హౌజ్‌లు, భూసేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపు, సబ్ స్టేషన్లు, డిస్ట్రిబ్యూటరీ కాల్వల వివరాలు, వీటి నిర్మాణంలో నెల వారీగా సాధించిన పురోగతి, జరిగిన వ్యయం తదితర వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఏజీ కార్యాలయం కోరింది. పనులు, సేకరించాల్సిన భూములు, సేకరించిన భూములు, పూర్తయిన పనుల వ్యయం, పురోగతి శాతం వంటి వివరాలను ప్యాకేజీల వారీగా అందజేయాలని సూచించింది. ప్రాజెక్టు ప్రారంభం నాటి నుంచి 2023 మార్చి నాటికి రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించిన నిధులు, చేసిన వ్యయం, మంజూరైన రుణాలు, చేసిన రుణ వ్యయాలు, జరిగిన మొత్తం వ్యయం వివరాలను పట్టిక రూపంలో అందజేయాలని స్పష్టం చేసింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు విభాగంలో పనిచేస్తున్న చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పేర్లు, చిరునామాల వివరాలు, వారి పరిధిలోకి వచ్చే ప్యాకేజీలు, ప్యాకేజీల కాంట్రాక్టు ఒప్పందం విలువలు, చేసిన వ్యయం వివరాలను సైతం ఏజీ కార్యాలయం కోరడం గమనార్హం. ప్రాజెక్టు నిర్మాణం ఎప్పటిలోగా పూర్తి కానుందని, నిర్మాణంలో ప్రధాన అడ్డంకుల వివరాలను తెలియజేయాలని సూచించింది.

నీటిపారుదలశాఖ కసరత్తు

ఏజీ కార్యాలయం కోరిన సమాచారాన్ని అందజేసేందుకు నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తోంది. త్వరలో కాగ్ నుంచి ప్రత్యేక బృందాలు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై మరింత సమాచారం కోరే అవకాశాలున్నాయి. అనంతరం క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించి నివేదికను సిద్ధం చేయనున్నారు. 2024–25 లో ఈ నివేదికను కాగ్ సమర్పించే అవకాశాలున్నాయి.



నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మాటూర్ గ్రామ పంచాయతీలో పల్లె నిద్రకు ముందు గిరిజనులతో ముచ్చటిస్తున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి -త్రిపురారం

తండాల్లో కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాష్ట్రంలోని లంబాడీ తండాలు, ఆదివాసీ గూడేలకు తరలి వెళ్లారు. దాదాపు 500 మంది నాయకులు తండాలలో, గూడేలలో మధ్యాహ్నం నుంచి ప్రదర్శనలు నిర్వహించారని, గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసి రాత్రి అక్కడే బస చేసినట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా వంగవీడులో, మాజీ మంత్రి జానారెడ్డి నల్లగొండ జిల్లా మాటూరులో, టీపీసీసీ గిరిజన విభాగం అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ మహబూబాబాద్ జిల్లా తారసింఘ్ బావి తండాలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లోని జిల్లేలపాడు తండాలో, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండలంలోని సింగమ్మ గడ్డ తండాలో 'గిరిజన సంరక్షణ హస్తం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా గతంలో తారసింఘ్ బావి తండాలో బస చేశారని, అయినా అక్కడ ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని బెల్లయ్యనాయక్ విమర్శించారు.

రాత్రి బస చేసిన నేతలు

'లోకల్ టచ్' స్క్రీనింగ్?

▶ మొదటి పేజీ తరువాయి

ఆశావహులతో గాంధీభవన్‌లో భేటీ అయి వారికి టికెట్ ఎందుకు ఇవ్వాలన్న దానిపై ఇంటర్వ్యూలు చేసింది. కానీ ఈసారి స్క్రీనింగ్ కమిటీ క్షేత్రస్థాయికి వెళ్లనున్నట్టు, జిల్లా, నియోజకవర్గ భేటీలు జరపనున్నట్టు మురళీధరన్ వెల్లడించిన దాని ప్రకారం స్పష్టమవుతోంది. మురళీధరన్‌తో పాటు ఈ కమిటీలో ఏఐసీసీ నుంచి బాబా సిద్ధిఖీ, జిగ్నేశ్ మేవానీలు సభ్యులుగా ఉన్నారు. తెలంగాణ నుంచి పీసీసీ చీఫ్ రేవంత్, సీఎల్పీ నేత భట్టి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌లు కూడా ఈ కమిటీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అందరూ క్షేత్రస్థాయికి వెళ్లి ఆశావహులతో సమావేశమవుతారా? రాష్ట్ర నేతలు లేకుండా ఢిల్లీ పెద్దలే జిల్లాలకు వెళ్లి అభిప్రాయ సేకరణ జరుపుతారా? అన్న దానిపై త్వరలో స్పష్టత రానుంది.

లోక్‌సభ ఎన్నికల కసరత్తు కూడా షురూ!

ఏఐసీసీ స్థాయిలో జరుగుతున్న సమావేశాల ప్రకారం చూస్తే.. వచ్చే ఏడాది మార్చి తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికలకు కూడా కాంగ్రెస్ సిద్ధమవుతోందని తెలుస్తోంది. ఇప్పటికే 17 రాష్ట్రాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికతో పాటు లోక్‌సభ ఎన్నికల తర్వాత వెంటనే ఎన్నికలు జరిగే రాష్ట్రాల అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కూడా ప్రారంభమైందని ఢిల్లీలోనే మకాం వేసిన టీపీసీసీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల కంటే ముందే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున ప్రస్తుతానికి రాష్ట్రంలో అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపైనే ఏఐసీసీ దృష్టి ఉందని, ఆ తర్వాత లోక్‌సభ అభ్యర్థుల కసరత్తు కోసం ఏ క్షణమైనా తెలంగాణ నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు వస్తుందని ఆయన వెల్లడించడం గమనార్హం.

అచ్చంపేట ఎత్తిపోతలకు టెండర్లు

- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర నీటి పారుదల శాఖ.. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1061.39 కోట్లు..
- గతంలో రూ.1534.5 కోట్లతో పరిపాలన అనుమతి

సాక్షి, హైదరాబాద్: అచ్చంపేట ఎత్తిపోతల పథకం తొలిదశ పనులను రూ.1061.39 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ బుధవారం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రాజెక్టులో భాగంగా అప్రోచ్ కాల్వ..లైనింగ్, పంపుహౌస్‌లు, ప్రెషర్ మెయిన్స్, రిజర్వాయర్లు, కెనాల్ నెట్‌వర్క్ నిర్మాణ పనులు చేపడతారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఎదుల రిజర్వాయర్ నుంచి ఉమామహేశ్వర రిజర్వాయర్‌లోకి తరలించనున్న జలాల్లో 5 టీఎంసీలను అచ్చంపేట ఎత్తిపోతల పథకం కింద కొత్తగా నిర్మించనున్న రిజర్వాయర్లలోకి ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల ద్వారా అచ్చంపేట నియోజకవర్గానికి సరఫరా చేయనున్నారు. రూ.1534.5 కోట్ల అంచనా వ్యయంతో అచ్చంపేట ఎత్తిపోతల తొలిదశ పనులు చేపట్టేందుకు పరిపాలనాపరమైన అనుమతులిస్తూ గత మే 3న రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఇందులోనే ప్రాజెక్టు నిర్మాణవ్యయంతో పాటు భూసేకరణ వ్యయం కూడా ఉంది. రెండుమూడేళ్ల కిందటే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు సమర్పించింది. త్వరలో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాజెక్టు పనులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా అచ్చంపేట నియోజకవర్గపరిధిలో 57,200 ఎకరాల ఆయకట్టుతో పాటు పరిసర గ్రామాలకు తాగునీరు అందిస్తారు.

రామోజీ ఫిల్మ్‌సిటీ అక్రమ నిర్మాణమే

- ఆ భూములన్నీ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ఉల్లంఘించి సేకరించినవే
- ఫిల్మ్ సిటీ ఆస్తుల విలువ రూ.2 లక్షల కోట్లు
- రామోజీ తలచుకుంటే ఎవరికైనా శిక్షలు వేయించగలరు.. కోర్టుల్లో చాలా పలుకుబడి ఉంది
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ విమర్శలు



సాక్షి, రాజమహేంద్రవరం: రామోజీ ఫిల్మ్ సిటీ అక్రమ నిర్మాణమేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఫిల్మ్ సిటీ కోసం ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను ఉల్లంఘించి భూములు సేకరించారని విమర్శించారు. ఫిల్మ్‌సిటీ రెండు వేల ఎకరాల భూముల విలువ ఇప్పుడు రూ.2 లక్షల కోట్లన్నారు. వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. రాజమండ్రిలో ఉండవల్లి అరుణ్ కుమార్ బుధవారం మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో జమీందార్లు, పెద్దలు కూడా భూములు కోల్పోయారన్నారు. కానీ రామోజీ మాత్రం అందుకు భిన్నమన్నారు. ఇందుకు మార్గదర్శి కేసులో జరుగుతున్న విచారణే నిదర్శనమని తెలిపారు. రామోజీకి కోర్టుల్లో చాలా పలుకుబడి ఉందని, ఆయన అడ్వొకేట్లు ఎవరికి కావాలనుకుంటే వారికి శిక్షలు వేయించగలరని చెప్పారు. మార్గదర్శి చిట్‌ఫండ్ కేసులో రామోజీ రావు, శైలజా కిరణ్‌లను అధికారులు ప్రశ్నించిన వీడియో బయటపెట్టాలని ఉండవల్లి కోరారు. మార్గదర్శిలో నిబంధనల ఉల్లంఘన ఆంధ్రాలో జరిగితే తెలంగాణ కోర్టులో విచారించాలని పట్టుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. దీన్నిబట్టి ఏపీ ప్రభుత్వం కన్నా రామోజీరావుకు పలుకుబడి ఉందని అర్థం అవుతోందన్నారు.

'ఈనాడు'తో వ్యవస్థలను భయపెడుతున్నారు..

రామోజీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఈనాడు పేపర్‌ను అడ్డం పెట్టుకుని వ్యవస్థలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ ఆరోపించారు. అందుకే ప్రతి కేసులో 'ఈనాడు పత్రిక అధిపతి' అని ప్రస్తావన తీసుకువస్తారన్నారు. ఒక కేసులో రామోజీరావు మార్గదర్శి ఎండీ అని, మరో కేసులో మార్గదర్శితో రామోజీరావుకు సంబంధం లేదని అఫిడవిట్ వేశారన్నారు. అలాంటి వ్యక్తిపై కంటెంప్ట్ ఆఫ్ కోర్టు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. ఏపీలో ప్రజలు కట్టిన సొమ్ముకు, మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ వద్ద ఉన్న సొమ్ముకు వ్యత్యాసం ఉందన్నారు. ఆదిరెడ్డి అప్పారావుని అరెస్టు చేసినప్పుడు రామోజీని ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఆదిరెడ్డిని పరామర్శించిన చంద్రబాబు రామోజీ గురించి మాట్లాడలేదన్నారు. తన రాజగురువుకు కోపం వస్తే పునాదులు కదులుతాయని ఆయన భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. మార్గదర్శి వ్యవహారంలో రామోజీ తప్పు చేయలేదని బాబు చెప్పగలరా? అని సవాల్ విసిరారు.

ప్రభుత్వం నాకు సహకరించాలి..

మార్గదర్శి అక్రమాలపై జరుగుతున్న విచారణ చూస్తుంటే చట్టం ముందు అందరూ సమానం కాదన్న భావన కలుగుతోందన్నారు. న్యాయ వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. మార్గదర్శి కేసులో నిజాలు బయటపెట్టాలంటే ప్రభుత్వం తనకు సహకరించాలని కోరారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ప్రభుత్వంపై ఇంకా వ్యతిరేక కథనాలు కోకొల్లలుగా వస్తాయన్నారు. చిరంజీవి పిచ్చుక కాదని.. సొంత పార్టీ పెట్టి 18 శాతం ఓట్లు సాధించారని గుర్తు చేశారు.

మజ్లిస్ సెక్యులర్ ఎలానో కేసీఆర్ చెప్పాలి

కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ఎంఐఎం సమన్వయం చేస్తోంది.. 3 పార్టీల డ్రామాలను తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలి



సాక్షి, న్యూఢిల్లీ: పచ్చి మతోన్మాద మజ్లిస్ పార్టీతో స్నేహం చేస్తూ ఏ రకంగా తమది సెక్యులర్ పక్షమో సీఎం కేసీఆర్ చెప్పాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ జీ.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ మజ్లిస్ తమ మిత్రపక్షం అని, తమది సెక్యులర్ పక్షం అన్నారని గుర్తు చేశారు. తమకు 15 నిమిషాలు సమయం ఇస్తే దేశంలో 100 కోట్ల హిందువుల సంగతి చూస్తామని ప్రకటించిన మజ్లిస్ పార్టీ ఎలా సెక్యులర్ పార్టీ అయ్యిందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పాత బస్తీలో అల్లర్లకు కారణమైన మజ్లిస్‌తో కేసీఆర్ ఎలా అంటకాగుతున్నారని నిలదీశారు. బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కు ఓటేసినట్లేనని, కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు ఓటేసినట్లేనన్నారు. ఈ రెండు పార్టీలకు ఓటేయడం అంటే మజ్లిస్‌కు జై కొట్టినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. పైకి తిట్టుకుంటూ కనిపిస్తున్నా.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య లోపాయకారి అవగాహన ఉందన్నారు. రెండు పార్టీల మధ్య మజ్లిస్ సమన్వయం చేస్తోందని, అనుసంధానకర్తగా పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణలో ఈ మూడు పార్టీల నాటకాలను ప్రజలు అర్థం చేసుకోవాలని, వారి మాటలకు మోసపోవద్దని సూచించారు.

ఆ మూడు పార్టీలు ఒకే లైన్‌లోనే..

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ ఒకే లైన్‌లో మాట్లాడుతున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ వ్యతిరేక ఓటు చీలిపోవాలని, తద్వారా కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలన్న కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మొన్న కేటీఆర్ మాట్లాడుతూ కేంద్రంలో సంకీర్ణం వస్తుందని... అందులో బీఆర్‌ఎస్ చేరుతుందని అనడం ద్వారా ఆ రెండు పార్టీలు ఒకటే అని చెప్పకనే చెప్పారని అన్నారు. వచ్చేది తమ ప్రభుత్వమే అని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి చేస్తున్న ధర్నాలు, ఒకరికి ఒకరు చేసుకుంటున్న సహాయం తెలంగాణ ప్రజలు చూస్తున్నారని, అన్ని విషయాలను గమనిస్తున్నారని తెలిపారు.

గాంధీ భవన్‌కు, తెలంగాణ భవన్‌కు దగ్గరి సంబంధాలు

కాంగ్రెస్ పార్టీ తరఫున 2014లో 22 మంది గెలిస్తే 15 మంది, 2019లో 19 గెలిస్తే 12 మంది వెళ్లి బీఆర్‌ఎస్‌లో కలిశారని.. కనీసం రాజీనామా కూడా చేయకుండా మంత్రులుగా కొనసాగుతున్నారని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకే తాను ముక్కలని.. గాంధీ భవన్‌కు, తెలంగాణ భవన్‌కు దగ్గరి సంబంధాలు ఉన్నాయని స్పష్టమైందని కేంద్రమంత్రి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు, పథకాల కోసం సీఎం కేసీఆర్‌కు 40కి పైగా లేఖలు రాస్తే, ఏ ఒక్కదానిపై కూడా స్పందించలేదని, అలాంటి వ్యక్తి కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం సిగ్గు చేటని కిషన్‌రెడ్డి అన్నారు.

రాహుల్‌వి దుందుడుకు మాటలు

మణిపూర్‌లో భారతమాతను హత్య చేశారంటూ రాహుల్‌గాంధీ అవగాహన లేని దుందుడుకు మాటలు మాట్లాడారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంగ్రెస్ భారత్‌ను అగౌరవపరిచే విధంగా, అస్థిరపరిచే విధంగా మాట్లాడటాన్ని దేశ ప్రజలు క్షమించరన్నారు. సూర్య చంద్రులు ఉన్నంత వరకు భారతమాతను ఎవరూ హత్య చేయలేరని.. రాహుల్ మాటలను దేశ ప్రజలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. విమర్శ రాజకీయంగా ఉండాలే తప్ప ఇలా దేశాన్ని అగౌరవ పరిచేలా మాట్లాడడం తగదని రాహుల్ గాంధీకి కిషన్‌రెడ్డి సూచించారు.

క్లుప్తంగా...

కేసీఆర్ కుటుంబాన్ని తరిమి కొడితేనే రాష్ట్రానికి స్వేచ్ఛ

క్విట్ ఇండియా దినోత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును ఆయన కుటుంబాన్ని రాష్ట్రం నుంచి తరిమి కొట్టినప్పుడే రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చినట్టని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా బుధవారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం ద్వారానే 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిందని గుర్తుచేశారు. నాడు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ప్రజలంతా ఐక్యంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువస్తే నేడు బీజేపీ పాలకులు ప్రజలను విడదీసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. మతం పేరిట దేశంలో మంటలు రేపాలని బీజేపీ చూస్తోందని, దేశం ఏమైపోయినా ఓట్లు వస్తే ఆ పార్టీ చాలనుకుంటోందని చెప్పారు. బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనేందుకు ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి, నిరంజన్, ఎం.ఆర్.జి.వినోద్‌రెడ్డి, చామల కిరణ్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ యువజన కాంగ్రెస్


యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంలో శివసేనారెడ్డి



సాక్షి, హైదరాబాద్: యూత్ కాంగ్రెస్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 20 రోజుల పాటు 'గడప గడపకూ యువజన కాంగ్రెస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి తెలిపారు. యూత్‌కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.జి.వినోద్‌రెడ్డి, మాజీ ఎంపీ మల్లు రవి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో పాటు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ గడప గడపకూ యూత్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ దిమ్మె ఏర్పాటు చేసి జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు.

పంట పరిహారం నేరుగా రైతుల ఖాతాల్లోకి..

వ్యవసాయ కమిషనర్‌కు టీపీసీసీ కిసాన్ సెల్ వినతి



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో వచ్చిన వడగళ్ల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి అందిస్తున్న పరిహారాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు సుంకేట అన్వేశ్‌రెడ్డి బుధవారం లేఖ రాశారు. అప్పటి పంట నష్టానికి సంబంధించిన పరిహారాన్ని కొన్ని జిల్లాల్లోని కొందరు రైతులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని, వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు ఒక్కరికి కూడా పరిహారం ఇవ్వలేదని, అధికారులను అడిగితే చెక్కులు ఇస్తామని చెప్తున్నారని ఆ లేఖలో తెలిపారు. వరంగల్ జిల్లాలో కూడా చెక్కుల రూపంలో కాకుండా రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని, అన్ని జిల్లాల్లో పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని అన్వేశ్‌రెడ్డి కోరారు.

వివాదాలు వద్దు.. | ఎన్నికలపై దృష్టి పెట్టండి

- నియోజకవర్గంలో క్యాడర్‌ను సన్నద్ధం చేయండి
- సర్వేలు, పనితీరు ఆధారంగానే టికెట్లు
- ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే వనమా 'లంచ్'మీటింగ్
- ఎన్నికల కోణంలో పని చేసుకోవాల్సిందిగా సీఎం స్పష్టీకరణ



సీఎం కేసీఆర్‌తో వనమా (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం ఎమ్మెల్యేగా అనర్హత కేసులో సుప్రీంకోర్టులో ఊరట పొందిన బీఆర్ఎస్ శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు బుధవారం సీఎం, పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావును కలుసుకున్నారు. తొలుత మంగళవారం సాయంత్రమే ప్రగతిభవన్‌లో కేసీఆర్‌ను తన కుమారుడు రామకృష్ణతో పాటు వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎం సూచన మేరకు తిరిగి బుధవారం మధ్యాహ్నం ప్రగతి భవన్‌కు వెళ్లిన వనమా వెంకటేశ్వరరావు కేసీఆర్‌తో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయ స్థితిగతులను వనమా వివరించినట్లు సమాచారం. ఇటీవల వనమాను హైకోర్టు ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించగా ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రెండు రోజుల క్రితం సుప్రీంకోర్టులో ఆయనకు తాత్కాలిక ఊరట లభించింది. కేసు విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలు వాయిదా వేయడంతో పాటు కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రతి వాదులకు రెండు వారాలు గడువిచ్చింది. కేసీఆర్‌తో జరిగిన భేటీలో హైకోర్టు, సుప్రీంకోర్టులో జరిగిన పరిణామాలను, నియోజకవర్గ విషయాలను వనమా వివరించినట్లు సమాచారం.

నేడు కొత్తగూడెంకు రానున్న వనమా.. భారీ స్వాగతానికి సన్నాహాలు

వనమాకు ఊరటనిస్తూ సుప్రీం తీర్పు నేపథ్యంలో బుధవారం కొత్తగూడెం నియోజకవర్గంలో ఆయన అనుచరులు సంబురాలు చేసుకున్నారు. హైకోర్టు తీర్పు, ఇతర అంశాల నేపథ్యంలో నియోజకవర్గానికి కొంతకాలంగా దూరంగా ఉన్న వనమా గురువారం కొత్తగూడెం వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు భారీగా స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. సుజాతనగర్ మండలం నాయకులు గూడెం వద్ద భారీ ఊరేగింపుతో వనమాకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇటు వనమా, అటు జలగం.. అధినేత ఎటో?

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొంది ఆ తరువాత బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనపై ఓటమి పొందిన బీఆర్ఎస్ అభ్యర్థి జలగం వెంకట్రావు వనమాపై 2019లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన హైకోర్టు వనమాను 2018 నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో తనను ఎమ్మెల్యేగా గుర్తించాలంటూ జలగం వెంకట్రావు అటు ఎన్నికల సంఘాన్ని, ఇటు అసెంబ్లీ స్పీకర్‌ను కూడా కలిశారు. అయితే వనమా సుప్రీంకోర్టు నుంచి నాలుగు వారాల పాటు స్టే పొందడంతో కొత్తగూడెం రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఇటు ఎమ్మెల్యే వనమా, అటు జలగం వెంకట్రావు ఇద్దరూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ ఉండడంతో అధినేత కేసీఆర్ అనుసరించే వైఖరిపై ఉత్కంఠ నెలకొంది.

సర్వేలు, పనితీరు ఆధారంగానే టికెట్లు

సుమారు అరగంట పాటు జరిగిన ఈ భేటీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొత్తగూడెం నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని సీఎం ఆదేశించినట్టు తెలిసింది. టికెట్ల కేటాయింపు అంశం పూర్తిగా సర్వేలు, ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా చేస్తున్నట్టు సీఎం స్పష్టం చేసినట్టు సమాచారం. నియోజకవర్గంలో వివాదాల జోలికి వెళ్లకుండా ఎన్నికలపై దృష్టి పెట్టి కేడర్‌ను సన్నద్ధం చేసుకోవాల్సిందిగా కేసీఆర్ ఆదేశించినట్టు చెబుతున్నారు.

తెలంగాణవాది కాదు.. వ్యాధి

▶ మొదటి పేజీ తరువాయి

మూడు పంటలకు కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా? మతం పేరిట మంటలు పెడుతున్న బీజేపీ కావాలా? ఢిల్లీ నాయకుల వద్ద మోకరిల్లే పార్టీలు కావాలా? ఇక్కడే పనిచేసే నాయకుల పాలన కావాలా?' అని ప్రశ్నించారు. 50ఏళ్ల నుంచి ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు ఒక్క అవకాశం ఇవ్వాలంటోందని, గతంలో పాలించినప్పుడు ఏమి చేసిందని నిలదీశారు.

ధరలపై మోదీ సమాధానం చెప్పాలి

మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు సిలిండర్ ధర రూ.420కి పెరిగితే నాడు మోదీ అనేక విమర్శలు చేశారని, ప్రస్తుతం అది రూ.1,200కు పెరిగిందని కేటీఆర్ చెప్పారు. దీనిపై మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు తగ్గినా మోదీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు తగ్గించడం లేదని విమర్శించారు. హిందూ, ముస్లింల మధ్య బీజేపీ తగదాలు పెడుతోందని అన్నారు.

ప్రతి వర్గం సంతోషంగా ఉంది..

గతంలో నెర్రలు బారిన నేలలు, నెత్తురోడిన నేలలు, నక్సలైట్‌ల పోరు ఉన్న తెలంగాణ గత తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించిందని కేటీఆర్ అన్నారు. చెరువులు నిండుకుండల్లా ఉన్నాయని, పంటపొలాలు కళకళలాడుతున్నాయని చెప్పారు. 2014లో రాష్ట్రంలో 60 లక్షల టన్నుల ధాన్యం పండగా, ప్రస్తుతం మూడున్నర కోట్ల టన్నుల ధాన్యం పండుతోందని చెప్పారు. పరిశ్రమలు వస్తున్నాయని, ఐటీరంగం అభివృద్ధి చెందుతోందని, రాష్ట్రంలో ప్రతి వర్గం సంతోషంగా ఉందని మంత్రి తెలిపారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం..

జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో నిర్మించిన ఐటీ హబ్‌ను, రూ.6.15 కోట్లతో నిర్మించిన ఉపాధి శిక్షణ సంస్థ (న్యాక్ భవనం)ను మంత్రి ప్రారంభించారు. రూ.22 కోట్లతో అభివృద్ధి చేసిన రఘునాథ చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను, రూ.15.5 కోట్లతో నిర్మించిన మూడు వైకుంఠధామాలను, సమీకృత మార్కెట్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగులతో కేటీఆర్ సహపంక్తి భోజనం చేశారు. సభలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యేలు గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు.



మినీట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, నగర మేయర్

లిక్కర్ పార్టీ, నిక్కర్ పార్టీ ఒక్కటయ్యాయి

- బీజేపీ, బీఆర్ఎస్ తెలంగాణను దోచుకుంటున్నాయి
- తొమ్మిదేళ్లుగా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు
- మణిపూర్ మండిపోతుంటే ప్రధానికి, హోంమంత్రికి బాధ్యత లేదా?
- లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చలో ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: లిక్కర్ పార్టీ, నిక్కర్ పార్టీ ఒక్కటై తెలంగాణను దోచుకుంటున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి లోక్‌సభ వేదికగా మండిపడ్డారు. అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో బుధవారం పాల్గొన్న రేవంత్‌రెడ్డి.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తనదైన శైలిలో ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ మాట్లాడుతున్నంతసేపు సభలో ఉన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఏకాగ్రతతో విన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సభకి వస్తే బావుండేదని, మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు ఆదివాసీలకు క్షమాపణ చెప్పి ఉంటే వారి గౌరవం మరింత పెరిగి ఉండేదన్నారు. కానీ ఆదివాసీలపై, గిరిజనులపై ప్రధానికి చులకనభావం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత తొమ్మిదేళ్లుగా మోదీ నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన ఏ హామీని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని.. మోదీపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. అందుకే 140 కోట్ల దేశ ప్రజల తరపున అవిశ్వాసానికి మద్దతుగా నిలుస్తున్నానని తెలిపారు. మణిపూర్‌లో జాతుల మధ్య వైరం పెట్టి బీజేపీ అధికారాన్ని పదిలం చేసుకోవాలనుకుంటోందని రేవంత్ ఆరోపించారు. మణిపూర్ మండిపోతుంటే, అక్కడ రక్తం ఏరులై పారుతుంటే ప్రధాని, హోంమంత్రికి బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. మణిపూర్‌కి వెళ్లి అక్కడి ప్రజలను రక్షించాల్సిన ప్రధాని, హోంమంత్రి ఓట్ల వేట కోసం కర్ణాటకకు వెళ్లినందునే ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీని తిరస్కరించారన్నారు. బీజేపీకి ప్రజల మాన, ప్రాణాలకంటే రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు.

ఉచిత విద్యుత్ వ్యాఖ్యలు వికటించడం వల్లే

- రేవంత్‌పై మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి
- రేవంత్ మాట తప్పే రకం



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయానికి ఉచిత విద్యుత్ మీద టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వికటించి ప్రజాగ్రహం పెల్లుబుకడంతో ఆయన అసహనంతో మాట్లాడుతున్నారని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారీతిన మాట్లాడితే హీరో అవుతానని ఆయన అనుకుంటున్నారని, రేవంత్ భాషను కాంగ్రెస్ కార్యకర్తలు కూడా జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ శాసనసభాపక్షం కార్యాలయంలో బుధవారం నిరంజన్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వాదిగా చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి రెండు కళ్ల సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చిన చంద్రబాబు వెంట నడిచారని, ఆయన ఏనాడూ తెలంగాణ వాదాన్ని సమర్థించలేదని గుర్తు చేశారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్న రేవంత్‌రెడ్డి మాట తప్పే రకమని గతంలోనే రుజువైందని, ఆయన తాజాగా విసిరే సవాళ్లకు అర్థం లేదని ఎద్దేవా చేశారు.

చిల్లర పనులతో వార్తల్లో ఉండేందుకే...

రాజకీయాల్లో చిల్లర పనులు చేస్తూ వార్తల్లో ఉండేందుకు రేవంత్‌రెడ్డి తపన పడుతున్నారని, ఇలాంటి నాయకులు సుదీర్ఘకాలం రాజకీయాలు చేయలేరని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ టి.భానుప్రసాద్ పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై అవగాహన పెంచుకుని పరిణతితో వ్యవహరించాలని హితవు పలికారు. రేవంత్‌లాంటి బఫూన్‌ను కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడిగా చేసిందని శాసనసభలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు విమర్శించారు. చంద్రబాబు ఏజెంటుగా పనిచేస్తూ కాంగ్రెస్‌ను చంపేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొన్నారు.

కేటీఆర్ మాటలు హాస్యాస్పదం



సాక్షి, హైదరాబాద్: మద్యం పోయకుండా, డబ్బులు ఇవ్వకుండా పోటీ చేస్తానని మంత్రి కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ ఎద్దేవా చేశారు. ప్రజలకు దయ ఉంటే ఓట్లేయాలని అడిగిన కేటీఆర్.. గుండె మీద చేయి వేసుకుని నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ ఒక్కరే కాకుండా బీఆర్ఎస్ అభ్యర్థులందరూ ఇదే ప్రకటించి మాట మీద నిలబడాలని కోరారు. గతంలో ఏ ఎన్నికలు చూసినా అడ్డగోలుగా డబ్బు, మద్యం పంపిణీ చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దని విమర్శించారు.

ఎంఐఎం చేతిలో కారు స్టీరింగ్

▶ మొదటి పేజీ తరువాయి

పథకం కింద ప్రధాని మోదీ నాలుగు కోట్ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టి లబ్ధిదారులకు అందజేశారని, అయితే ఈ పథకాన్ని తెలంగాణలో అమలు చేయకుండా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పేరుతో కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని మెట్రో నగరాలను స్మార్ట్ సిటీలుగా ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం నిధులను అందజేస్తోందని, కేంద్ర నిధులతోనే హైదరాబాద్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తరుణ్ చుగ్ తెలిపారు. తెలంగాణ ప్రజలకు ప్రధాని మోదీపై అభిమానం, ప్రేమ ఎక్కువని అన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన..

తెలంగాణలో అవినీతి పాలన సాగుతోందని, కేసీఆర్‌కు ప్రజలు రెండుసార్లు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని తరుణ్ చుగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ దుష్టపాలనను అంతమొందించడం బీజేపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో మహాత్మాగాంధీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారని, అదే స్ఫూర్తితో తెలంగాణ నుంచి సీఎం కేసీఆర్ పాలనను క్విట్ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో భూ మాఫియా పెరిగిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మేరీ మట్టి... మేరా దేశ్

క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభ దినోత్సవం నుంచి బీజేపీ కార్యకర్తలు ప్రతి గ్రామంలోని మట్టిని ఢిల్లీకి పంపుతారని, ఈ నెలాఖరులోగా ఇండియా గేట్ వద్ద అమృత్ వన్ నిర్మాణంలో ఈ మట్టిని వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో బీజేపీ కార్యకర్తలు మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించి దేశ రక్షణకు, అభివృద్ధిపై ప్రతిజ్ఞ చేస్తారని వివరించారు. దేశ రక్షణలో మృతిచెందిన వీరసైనికుల గ్రామాల్లో సైనికుల విగ్రహాలు, శిలఫలకాలను ఏర్పాటు చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాగా, అంతకుముందు తరుణ్‌చుగ్ కొత్తపేటలోని అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఎన్నికల సన్నద్ధతపై | 'కమలం' కసరత్తు షురూ

- జిల్లాల వారీగా సమీక్షల్లో నిమగ్నమవుతున్న ముఖ్య నేతలు
- రంగారెడ్డి అర్బన్, రూరల్ జిల్లా కమిటీల నేతలతో తరుణ్‌చుగ్ భేటీ
- నేడు వరంగల్ క్లస్టర్‌కు బన్సల్.. ఉమ్మడి నల్లగొండలోని నియోజకవర్గాల్లో మీనన్ పర్యటన



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై కసరత్తును బీజేపీ వేగవంతం చేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ఉమ్మడి జిల్లాల్లోని అనేక శాసనసభా నియోజకవర్గాల్లో పార్టీకి సానుకూల వాతావరణం, పరిస్థితులున్న విషయం తాము జరిపిన పలు సర్వేలు, అధ్యయనాల్లో వెల్లడైనందున మరింత దూకుడుగా ముందుకెళ్లాలని బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయించినట్టు పార్టీ ముఖ్య నేతలు వెల్లడించారు. ప్రధానంగా ప్రస్తుతం పార్టీ పరిస్థితి, సామాజికవర్గాల వారీగా మద్దతు, ప్రభావితం చేసే అంశాలు, సంబంధిత నియోజకవర్గంలో గెలుపోటములను ప్రభావితం చేయగలిగే సామాజికవర్గాలు, గత అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు పడిన ఓట్లు, వచ్చే ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నుంచి పోటీచేసే సత్తా ఉన్న అభ్యర్థులు, వారి సామాజికవర్గాలు తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించింది. జిల్లాల వారీగా పార్టీ పరిస్థితి, బలాబలాలు, ఏవైనా లోటుపాట్లు, ఇతర అంశాలుంటే వాటిని ఎలా సరిచేసుకోవాలనే విషయాలను పరిగణనలోకి తీసుకోవడంలో భాగంగా వివిధ జిల్లాల సమీక్షలను ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్ (రాష్ట్ర ఎన్నికల సహఇన్‌చార్జి కూడా), జాతీయ కార్యదర్శి అర్వింద్ మీనన్ పార్టీపరంగా వివిధ జిల్లాల సమీక్షలను నిర్వహించనున్నారు.

జిల్లాల నేతల నుంచి సమాచార సేకరణ

బుధవారం రంగారెడ్డి అర్బన్, రూరల్ జిల్లా కమిటీలతో తరుణ్‌చుగ్ సమీక్షలు ప్రారంభించారు. ఆయా అంశాలపై నాయకుల నుంచి వివరాలు, సమాచారం సేకరించినట్లు తెలిసింది. కేసీఆర్ సర్కార్‌పై వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవాలని రంగారెడ్డి అర్బన్, రూరల్ జిల్లా కమిటీలు, నాయకులను తరుణ్‌చుగ్ ఆదేశించినట్టు సమాచారం. గురువారం మేడ్చల్ అర్బన్, రూరల్ జిల్లాల్లో చేపడుతున్న ఎన్నికల కార్యాచరణ, తయారీపై తరుణ్‌చుగ్ సమీక్షించనున్నారు. ఇదిలా ఉంటే గురువారం వరంగల్ క్లస్టర్‌లో (ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలోకి వచ్చే నియోజకవర్గాలు) సునీల్ బన్సల్, నల్లగొండ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో మీనన్ వేర్వేరుగా సమీక్షలు చేపడుతున్నారు. శుక్ర, శనివారాల్లో వివిధ అంశాలపై రాష్ట్రపార్టీ ముఖ్యనేతలతో విడతల వారీగా తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, అర్వింద్ మీనన్ చర్చిస్తారని పార్టీ వర్గాల సమాచారం. ఇదిలా ఉంటే ఆదిలాబాద్, జహీరాబాద్, మెదక్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాలపై బీజేపీ నేత, కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా ప్రత్యేక దృష్టిపెట్టారు. ఈ నాలుగు స్థానాల్లో కనీసం రెండింటిని గెలుపొందాలనే పట్టుదలతో ఉన్న ఆయన.. ఇప్పటికే వీటిపరిధిలో విస్తృతంగా పర్యటించారు.



తాగినవాడు రహస్యాన్ని దాచలేడు.
వాగ్దానాన్ని నిలబెట్టుకోలేడు.
– మిగెల్ సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 10 ఆగస్టు 2023

మళ్ళీ లైసెన్స్ రాజ్యమా?

ఎప్పుడో వదిలేసిన పాత విధానాలను ఇప్పుడు మళ్ళీ తెస్తే... కొత్త ఫలితాలు వస్తాయా? కేంద్ర ప్రభుత్వం మాత్రం వస్తాయనే అనుకుంటున్నట్టు ఉంది. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, పర్సనల్ కంప్యూటర్ల దిగుమతిపై ప్రభుత్వం గత వారం హఠాత్తుగా షరతులు పెట్టడాన్ని చూస్తే, మళ్ళీ 1970ల నాటి ప్రభుత్వ విధానాలు గుర్తొస్తున్నాయి. జాతీయ భద్రత కారణంగా చైనా, కొరియాల నుంచి ఈ దిగుమతులను నియంత్రించాలని ప్రభుత్వ భావన. లైసెన్సు తీసుకుంటేనే అనుమతిస్తామని సర్కార్ చెబుతోంది. అయితే, వెల్లువెత్తిన విమర్శలు, వ్యక్తమైన ఆందోళనలతో ప్రస్తుతానికి మూడు నెలల పాటు నవంబర్ 1 దాకా ఈ షరతులను వాయిదా వేసింది. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడానికే ఈ నిబంధనలని పాలకుల మాట. కానీ, షరతులతో అది సాధ్యమవుతుందా? చైనాను లక్ష్యంగా చేసుకొని పెడుతున్న ఈ నిషేధం తీరా భారతీయులకే నష్టం కలిగిస్తుందన్న విశ్లేషణలూ ఉన్నాయి.

దేశంలో ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు ఏటా 6.25 శాతం వంతున పెరుగుతున్నాయి. 2022 – 23లో 533 కోట్ల డాలర్ల విలువైన ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను దిగుమతి చేసుకున్నాం. అందులో 75 శాతం చైనావే. ఇప్పుడు పౌరుల డిజిటల్ భద్రత రీత్యా ఈ దిగుమతులపై షరతులు పెడుతున్నామంటున్నారు. ఆ సాకు చూపడానికి కారణం ఒకటే! జాతీయ భద్రత కారణమైతేనే బహుళ పక్ష వాణిజ్య ఒప్పందాల్లో దిగుమతులపై షరతులు పెట్టే వీలుంటుంది. దేశీయ ఉత్పత్తులను కాపు కాసుకోవడం కారణమంటే రచ్చ తప్పదు. అయితే, ఎంత జాతీయ భద్రతను సాకుగా చూపినప్పటికీ, ఈ దిగుమతుల షరతులకు అవతలి వైపు నుంచి ట్యారిఫ్‌ల ప్రతిచర్యలు, దీర్ఘకాలిక వివాదాలు ఎలాగూ తప్పవు. పరిశ్రమతో ఎలాంటి సంప్రతింపులూ జరపకుండానే హడావిడి నిర్ణయం తీసుకొని, సుస్థిర వ్యవస్థను హఠాత్తుగా మార్చడంతో వచ్చిపడే ఇబ్బందులు సరేసరి.

ప్రస్తుత నిబంధనల ప్రకారం మన దేశంలోని కంపెనీలు ల్యాప్‌టాప్‌లను యథేచ్ఛగా దిగుమతి చేసుకోవచ్చు. రానున్న కొత్త రూల్స్‌తో ప్రత్యేక లైసెన్స్ ఉంటే కానీ, దిగుమతి సాధ్యం కాదు. 2020లో కలర్ టీవీల దిగుమతి పైనా భారత్ ఇలాంటి షరతులే పెట్టడం గమనార్హం. అలాగే, మొబైల్‌ఫోన్లపైనా అధిక ట్యారిఫ్‌లు విధించింది. పలు స్మార్ట్‌ఫోన్ సంస్థలు భారత్‌లోనే విడిభాగాలను కూర్చి, తయారు చేస్తున్నాయి. కానీ, కంప్యూటర్ల సంగతలా కాదు. చైనా సంస్థ లెనోవా మినహా యాపిల్, డెల్, సామ్‌సంగ్, షియామీ తదితర ఉత్పత్తులన్నీ దిగుమతులే! కంప్యూటర్ల దిగుమతికి లైసెన్స్ దెబ్బతో ఈ సంస్థల గంపగుత్త ఆర్డర్లపై దెబ్బ పడుతుంది. కలర్ టీవీల్లా కాక కంప్యూటర్లు విద్య, పరిశోధన, పౌరసేవల్లో కీలకం. విద్యారంగంలో విప్లవాత్మక మార్పుకై ఈ మధ్యే రిలయన్స్ సంస్థ రూ. 20 వేల లోపలే లభించే జియోబుక్‌ను తెచ్చింది. అదీ చైనా తయారీయే! రిలయన్స్ ఇప్పుడిక పాలకుల నుంచి ప్రత్యేక లైసెన్స్ తెచ్చుకోకుంటే, దిగుమతి చేసుకోలేదు.

షరతుల వార్తలతో ఈ వారం కంప్యూటర్ల అమ్మకాలు 25 శాతం పెరిగాయి. చివరకు కొరత ఏర్పడి, ధరల పెరుగుదలకు దారి తీస్తుంది. ఇప్పటికే కోవిడ్ వల్ల సరఫరా వ్యవస్థల్లో ఇబ్బందులు, సెమీ కండక్టర్ సంక్షోభం సతమతం చేస్తున్నాయి. షియామీ, రియల్‌మి, వన్‌ప్లస్ లాంటి కొత్త ఉత్పత్తులతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న భారతీయ ట్యాబ్ మార్కెట్ ఈ షరతులతో మరిన్ని సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తుంది. అసలు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా, ఐటీ సేవల కేంద్రంగా పేరున్న దేశం కంప్యూటర్ల దిగుమతులపై షరతుల పాట పాడడం ఎలా చూసినా అనూహ్యమే! ప్రజలపై ప్రభావం చూపుతూ, దీర్ఘకాలిక ఆర్థిక పర్యవసానాలున్న నిర్ణయాలను తీసుకొనే ముందు పాలకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వంలోని ఆర్థిక శాస్త్రవేత్తలతో సంప్రతింపులు జరిపివుంటే పాలకులు ఈ హఠాన్నిర్ణయం తీసుకొనేవారు కాదు. దేశీయ ఉత్పత్తి పెంచడం, దిగుమతులపై ఆధారపడడం తగ్గించడం, విశ్వసనీయ హార్డ్‌వేర్‌ను అందుబాటులో ఉంచడం మంచి లక్ష్యాలే. కానీ, వాటి కోసం పాత లైసెన్స్ రాజ్యానికి తిరోగమించాల్సిన అవసరం ఏ మాత్రం లేదు.

ఫలానా చైనా ఉత్పత్తుల వల్ల భద్రతలో ముప్పుందని భావిస్తే, ఆ దేశ ఉత్పత్తులకు అడ్డుకట్ట వేస్తే సరి. అలాకాక మొత్తం వ్యవస్థను లైసెన్సుల అగచాట్లలోకి నెట్టాల్సిన పని లేదు. అనేక కష్టాలు భరించాకే లైసెన్స్ రాజ్యబంధనాల్ని వదిలించుకున్నామని విస్మరించలేం. సులభంగా లైసెన్సులు ఇస్తామంటున్నా, ఆశ్రితపక్షపాతం సహా సమస్యలు మామూలే! ఇవాళ మనది సేవల రంగంతో పురోగమిస్తున్న ఆర్థికవ్యవస్థ. అందులో కీలకమైన కంప్యూటర్ హార్డ్‌వేర్ల కొరతతో దీర్ఘకాలిక నష్టమే.

దేశీయోత్పత్తిని పెంచేందుకు ఉత్పత్తితో ముడిపడ్డ ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకాన్ని 2020లో ప్రారంభించిన కేంద్రం వివిధ రంగాలకు దాన్ని విస్తరించినా, ఐటీ హార్డ్‌వేర్ రంగంలో ఆశించినంత భాగస్వామ్యం రావట్లేదు. కేటాయింపులు రెట్టింపు చేసినా అదే పరిస్థితి. అలాగని, దిగుమతులపై షరతులు, లైసెన్స్ రాజ్యం పెడితే దేశీయ ఉత్పత్తి పెరుగుతుందనుకోవడం అవివేకం. ఆ సంగతి గత చరిత్ర నిరూపించింది. అపార ఇంజనీరింగ్ ప్రతిభ, తక్కువ వేతనానికే మెరుగైన సేవలు ఇస్తున్నా మనం అంతర్జాతీయ ఉత్పత్తి సేవల భాగస్వామ్యంలో ఎందుకని, ఎక్కడ వెనుకబడిపోయామో మథనం సాగాలి. ఆ విధాన లోపాన్ని సరిచేసుకోవాలి. ప్రతి వెయ్యిలో 15 మందికే కంప్యూటర్ చేరిన దేశంలో షరతులతో ఆ లోటు పెరుగుతుందా, తరుగుతుందా? ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యపై సమగ్ర దృష్టి పెట్టాలి. సంబంధిత పక్షాలతో క్షుణ్ణంగా చర్చించాలి. అనివార్యమైతే తప్ప అనవసర షరతులతో నష్టమని గుర్తించాలి. లేదంటే భారత పురోగతి మరోసారి కుంటుపడుతుంది.

ట్రంప్ ముందున్న మార్గం క్లిష్టమే!

విశ్లేషణ



మనోజ్ జోషి

రిపబ్లికన్ పార్టీ తమ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకునే ప్రక్రియ 2024 జనవరిలో ప్రారంభమవుతుంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై వివిధ నేరవిచారణలు ముగియడానికి ముందుగానే ఈ ప్రక్రియ ముగుస్తుంది. ట్రంప్ విషయంలో ప్రస్తుత రిపబ్లికన్ పార్టీ విధానం ఒకటే... ఆయన నేరాలనూ, దుష్ప్రవర్తనలనూ విస్మరించడం, ఈ ఫలితానికి బాధ్యత డెమోక్రాట్‌లపై ఉందని వాదించడం! అబార్షన్‌ను సహించలేని ఉన్నత నైతికత ఉన్న రిపబ్లికన్ పార్టీ, అదే సమయంలో తమ అధ్యక్ష అభ్యర్థి నీలిచిత్రాల తారలతో సహవాసం చేసినా పట్టించుకోని పార్టీగా మారిపోయింది. మరోవైపు, 2016–2024 మధ్యకాలంలోని 5.2 కోట్ల మంది అదనపు ఓటర్లు డెమోక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపుతారని తెలుస్తోంది.


అమెరికాలో 2023 వేసవికాలం క్రూరంగా ఉండబోతోంది. దేశాన్ని పట్టి పీడిస్తున్న రాజకీయ సాంస్కృతిక జ్వరాలకు ఇది ఒక సూచన. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఒక సంవత్సరం కంటే కొంచెం ఎక్కువ దూరమే ఉంది.

ఒక రకమైన ఆటో ఇమ్యూన్ వ్యాధి అమెరికాను తనవైపు తిప్పుకుంది. రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేయబోతున్న అభ్యర్థి, తిరిగి భవిష్యత్ అమెరికన్ అధ్యక్షుడిగా భావిస్తున్న డోనాల్డ్ ట్రంప్ వ్యవహారాన్నే తీసుకోండి... రహస్య పత్రాలను దుర్వినియోగం చేసిన కేసులో ఆయన వచ్చే ఏడాది మేలో విచారణను ఎదుర్కోనున్నారు. కానీ 2024లో ఆయన ఎదుర్కొనే అనేక కేసుల్లో ఇది ఒకటి మాత్రమే. 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో జరిగిన లైంగిక కుంభకోణాన్ని కప్పిపుచ్చడానికి ట్రంప్ ఇచ్చిన నగదు చెల్లింపుపై క్రిమినల్ విచారణను మార్చిలో మొదలెట్టాలని నిర్ణయించారు. జార్జియాలో గత ఎన్నికల్లో పొందిన ఓటమిని తిప్పికొట్టేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నాలపై కూడా విచారణ కొనసాగుతోంది. చివరగా, ఆయన నకిలీ ఓటర్లతో కూడిన కుట్ర ద్వారా 2020 ఎన్నికల తీర్పును తారుమారు చేయడానికి ప్రయత్నించాడనే అభియోగంపై కూడా దర్యాప్తు పూర్తి కావస్తోంది. ఈ కుట్రపూరిత ప్రయత్నం 2021 జనవరి 6న క్యాపిటల్‌పై దాడితో ముగియడం తెలిసిందే.

అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకునే రిపబ్లికన్ పార్టీ ప్రక్రియ 2024 జనవరిలో ప్రారంభమవుతుంది. ట్రంప్‌పై వివిధ నేరవిచారణలు ముగియడానికి ముందుగానే ఈ ప్రక్రియ ముగుస్తుంది. ట్రంప్ విషయంలో ప్రస్తుత రిపబ్లికన్ విధానం ఆయన నేరాలను, దుష్ప్రవర్తనలను విస్మరించడం, ఈ ఫలితానికి బాధ్యత డెమోక్రాట్‌లపై ఉందని వాదించడంగా కనిపిస్తోంది.

రిపబ్లికన్ పార్టీ ఈ అభిప్రాయానికి ఎలా వచ్చిందో, ఎలా చేరుకుందో స్పష్టం కావడం లేదు. కానీ 'లా అండ్ ఆర్డర్'గా తనను తాను చెప్పుకొనే ఈ పార్టీ... 2021 జనవరిలో జరిగిన అల్లర్లలో అసాధారణమైనది ఏమీ కనిపించలేదని భావించే స్థాయికి చేరుకుంది. పైగా ఆ పార్టీ ఇప్పుడు ఎఫ్‌బీఐ(ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్)ని కూడా రద్దు చేయాలనుకుంటోంది. అబార్షన్‌ను సహించలేని ఉన్నత నైతికత ఉన్న రిపబ్లికన్ పార్టీ, అదే సమయంలో తమ అధ్యక్ష అభ్యర్థి పోర్న్ స్టార్లతో సహవాసం చేసినా పట్టించుకోని పార్టీగా మారిపోయింది. వారి పూర్వ నాయకుడు రొనాల్డ్ రీగన్ సోవియట్ 'దుష్ట సామ్రాజ్యం'కు వ్యతిరేకంగా ప్రచారానికి నాయకత్వం వహించిన చోట, వారి ప్రస్తుత నాయకుడు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు గొప్ప ఆశాకిరణంగా కనిపిస్తున్నారు.

మరోవైపున డెమొక్రాట్‌లకు వారి సమస్యలు వారికి ఉన్నాయి. కనీస జనాదరణ కూడా లేని జో బైడెన్ రెండోసారి పదవిని కోరుతున్నారు. అయితే కాగితంపై విషయాలు బాగానే కనిపిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోంది, ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయి, పైగా, రాబోయే ఆరు నెలల్లో పరిస్థితులు మరింత మెరుగుపడతాయన్న అంచనాలున్నాయి. అధ్యక్షుడిని అభిశంసిస్తామంటూ బెదిరించడం ద్వారా బైడెన్‌ను అణగదొక్కాలని రిపబ్లికన్లు ప్రయత్నిస్తున్నారు. బైడెన్, ఆయన కుమారుడు హంటర్ చర్యలు అవినీతితో ముడిపడి ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు, అయినప్పటికీ అధ్యక్షుడు స్వయంగా తప్పు చేసినట్లు చెప్పే సాక్ష్యాలు పెద్దగా లేవు.



దేశాన్ని పట్టి పీడిస్తున్న సంస్కృతీ యుద్ధాలు కూడా అంతే నాటకీయంగా ఉన్నాయి. అమెరికా సమకాలీన చరిత్రలో అతిపెద్ద విభజన, వాస్తవానికి గర్భస్రావ అంశమే. అమెరికన్ సుప్రీంకోర్ట్ అబార్షన్ హక్కుల కోసం రాజ్యాంగ పరమైన రక్షణను తీసివేసిన తర్వాత, అనేక రిపబ్లికన్ రాష్ట్రాలు అబార్షన్‌ను నిషేధించడమే కాకుండా, అబార్షన్ చేసేవారి చర్యను నేరంగా పరిగణిస్తూ కఠినమైన చట్టాలను ఆమోదించాయి. అయితే, గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా ఆయా సర్వేలు చూపిస్తున్నట్లుగా, అమెరికన్లలో ఎక్కువ మంది కొన్ని పరిమితులతో అబార్షన్ హక్కుకు మొగ్గు చూపుతున్నారు.

1955లో మిసిసిపిలో, శ్వేతజాతి మహిళపై ఈల వేసినందుకు అపహరణకు గురై, చిత్రహింసలపాలై హత్యకు గురైన 14 ఏళ్ల నల్లజాతి బాలుడు ఎమ్మెట్ టిల్ స్మారక చిహ్నాన్ని గత వారం అధ్యక్షుడు బైడెన్ ప్రారంభించారు. ఆ హత్య, అతని హంతకులను నిర్దోషులుగా విడుదల చేయడం అనేది 1960లలో పౌర హక్కుల ఉప్పెనను ప్రేరేపించింది. పైగా గత దశాబ్దంలో, 'బ్లాక్ లైవ్స్ మేటర్' (నల్లజాతి జీవితాలూ విలువైనవే) ఉద్యమ పెరుగుదలను చూశాం. ఈ పరిణామం అమెరికాలో నిలకడగా కొనసాగుతున్న జాత్యహంకార ఫలితమే.

సమకాలీన అమెరికన్ జాత్యహంకారం ఎలా పని చేస్తున్నదో చూడాలంటే... ఫ్లోరిడా గవర్నర్, రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వంపై ఆశాజనకంగా ఉన్న రాన్ డిసాంటిస్ ఉదాహరణ చూడాలి. బానిసత్వాన్ని కొట్టివేసేలా ఆయన చర్యలు ఉంటున్నాయి. ఈ రాష్ట్రంలో సవరించిన పాఠ్య పుస్తకాలు... పని చేస్తూ బానిసలు కొన్ని నైపుణ్యాలను సంపాదించుకున్నందున వారు తమ బానిసత్వ స్థితి నుండి ప్రయోజనం పొందారని పేర్కొన్నాయి.

లైంగిక విద్య, లైంగిక ధోరణి, లింగ గుర్తింపుపై యుద్ధాలు జరుగుతున్నాయి. స్వలింగ సంపర్కుల హక్కులను స్థాపించడానికి విజయవంతమైన ప్రయత్నాలపై ఆధారపడి, ద్విలింగ, లింగ మార్పిడి వ్యక్తులు ప్రస్తుతం తమ హక్కులను పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒపీనియన్ పోల్స్ ప్రకారం, దాదాపు 21 శాతం జెనరేషన్ జెడ్ – అంటే 1990ల మధ్య నుంచి 2010 మధ్య జన్మించిన వారు– తమను తాము లెస్బియన్, గే, బైసెక్సువల్ లేదా ట్రాన్స్‌జెండర్ (ఎల్‌జీబీటీ)గా గుర్తించుకుంటున్నారు. 1980ల ప్రారంభంలో, 1990ల మధ్యకాలంలో జన్మించిన 'మిలీనియల్స్'లో ఎల్జీబీటీ సంఖ్య 10 శాతమే. జెనరేషన్ జెడ్ రాక దేశాన్ని ఇతర మార్గాల్లో కూడా ప్రభావితం చేస్తోంది. అమెరికన్లుగా ఉన్నందుకు 'అత్యంత గర్వంగా' భావిస్తున్నామని చెప్పుకొనే యువకుల (18–34 ఏళ్లు) వాటా 2013లో దాదాపు 40 శాతం ఉండగా, ఇప్పుడది 18 శాతానికి పడిపోయిందని గాలప్ పోల్ వెల్లడించింది. ఈ ఏడాది, ఎల్‌జీబీటీ హక్కులను పరిమితం చేయడానికి ఉద్దేశించిన 75 బిల్లులు అమెరికా అంతటా చట్టసభలలో ఆమోదించబడ్డాయి. లైంగిక ధోరణి ఆధారంగా ద్వేషపూరిత నేరాలు పెరిగాయి. పైగా ప్రదర్శనలు, ప్రతి–ప్రదర్శనలు ఒక సాధారణ లక్షణంగా మారాయి. పాఠశాల, విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలు కూడా రణరంగంలో చేరిపోయాయి.

'సంస్కృతి యుద్ధాలు' అని పిలిచే ఇవి నిజానికి మార్పుపై పోరాడటానికి సంప్రదాయవాదులు చేసిన ప్రయత్నం. వలసదారులు, స్వలింగ సంపర్కులు, మహిళలు, పేదలు, నల్లజాతీయులు, ఇతర సమూహాలకు తమ ఖర్చుతో అన్యాయమైన అధికారాలు ఇస్తున్నందున, ఉదారవాదం యొక్క బాధితులుగా సంప్రదాయవాదులు తమను తాము అభివర్ణించుకుంటున్నారు. సందడి ఎలా ఉన్నప్పటికీ, ట్రంప్‌కు మాత్రం రహదారి క్లిష్టంగానే ఉంది. ఒక ఎన్నికల సర్వే ప్రకారం, 2016–2024 మధ్యకాలంలోని 5.2 కోట్ల మంది అదనపు ఓటర్లు డెమోక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపుతారని తెలుస్తోంది. స్పష్టంగా, అమెరికా మార్పునకు గురవుతోంది. ఇదేమీ అసాధారణమైనది కూడా కాదు. మితవాదుల ఆధిపత్యంలోని సుప్రీంకోర్టు వంటి సంస్థల సహాయంతో, రిపబ్లికన్లు 'శ్వేత జాతీయుల ఆధిపత్యాన్ని' కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ అది సాధ్యం కాదు.

వ్యాసకర్త డిస్టింగ్విష్డ్ ఫెలో, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్
(ది ట్రిబ్యూన్ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరిచిపోయారా?



మణిపుర్‌లో తిరుగుబాట్లను అణచడానికి, సరిహద్దులను కాపాడటానికి 'అస్సాం రైఫిల్స్'ను ఉంచారు. ఈ రెండింటిలోనూ అది విఫలమైంది. 'సైనిక దళాల ప్రత్యేకాధికార చట్టం–ఏఎఫ్‌పీఎస్‌ఏ' మాటున వారు చేసింది మనందరికీ తెలుసు. కేవలం ఇప్పుడు మీ రాజకీయ వైఖరికి అనుకూలంగా ఉన్నంతమాత్రాన వారిని మణిపుర్ రక్షకులని అనుకోవద్దు.

– జాన్సన్ రాజ్‌కుమార్, మణిపుర్ ఫిలింమేకర్

దటీజ్...!



రజనీకాంత్ కొత్త సినిమా విడుదల రోజున చెన్నై, బెంగళూరుల్లో కార్యాలయాలకు సెలవులిస్తున్నారని వార్త. మిగతా నటులు సెలవు రోజుల్లో తమ సినిమాలను విడుదల చేస్తారు. రజనీకాంత్ సినిమా విడుదలైతే... అది సెలవు రోజు అవుతుంది.

– జాయ్ దాస్,
సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

వేసుకోవాల్సిన ప్రశ్న



పాకిస్తాన్‌లో లాగా మన ధర్మాన్ని తక్కువ చేసేవారిని చంపడం, జైళ్లలో వేయడం ద్వారా మాత్రమే నిజంగా మనం 'సామాజిక సామరస్యత' కోరుకుందామా? ఒకవేళ జవాబు అవును అయితే, అది ముస్లింలకు కూడా వర్తిస్తుందా?

– ముస్తఫా అక్యోల్, టర్కీ రచయిత

ఇదా మీ ప్రాధాన్యం?



వాళ్లు మణిపుర్ జీభత్సాల పట్ల కోపంగా లేరు. బ్రిజ్ భూషణ్ సింగ్ పట్ల కోపంగా లేరు. హరియాణాలో అల్లర్లు, విద్వేషపు నేరాల గురించి కోపంగా లేరు. కానీ వాళ్లకు ఒక ఫ్లయింగ్ కిస్ దౌర్జన్యంగా కనబడింది. ఇవీ వారి ప్రాథమ్యాలు!

– అద్వైద్, చరిత్రకారుడు

లవ్ ఫ్రమ్ ఆఫ్రికా




ఢిల్లీలోని పహాడ్ గంజ్‌కు మళ్లీ వెళ్లాను. పద్దెనిమిదో యేట రాసిన నా తొలి నవల 'ది అబిసీనియన్ బాయ్'కు నేపథ్యం ఈ ప్రాంతమే! కౌమార బాలుడిగా ఇండియాలో జీవించాను. ఒక ఆఫ్రికా పిల్లాడిగా నాకు ఇప్పుడు జీవితం గురించి తెలిసిన సర్వాన్నీ ఇండియా నాకు నేర్పింది.

– ఓన్యేకా నువెల్యూ, నైజీరియా రచయిత

అరుదైన పత్రికా రచయిత


సందర్భం



కొమ్మినేని శ్రీనివాసరావు

జర్నలిజంలో పది, ఇరవై ఏళ్లపాటు కొనసాగడమే కష్టం. అలాగే జర్నలిస్టుగా జీవితం ఆరంభించి, కన్ను మూసే వరకు అదే వృత్తిలో ఉంటూ పత్రికలలో వ్యాసాలు రాయడం దాదాపు అసాధ్యం. అందరికీ ఆ అవకాశం లభించదు. అలాంటిది తుర్లపాటి కుటుంబరావు డెబ్బై ఏళ్లపాటు జర్నలిస్టుగా కొనసాగగలిగారు. ఏభై ఏళ్లపాటు 'వార్తలలో వ్యక్తి' పేరుతో ఒక శీర్షిక నిర్వహించగలగడం గొప్ప విషయం. ఒక వ్యాస శీర్షికను ఏభై ఏళ్ల నడపమంటే తేలికైన పని కాదు. కాని తుర్లపాటి వల్ల అది సాధ్యపడింది. ఆంధ్రజ్యోతి, ఆ తర్వాత 'వార్త' దినపత్రికలలో 'వార్తలలోని వ్యక్తి' కాలమ్‌ను నిర్వహించేవారు. ఇంత సుదీర్ఘ కాలం జర్నలిస్టుగా ఉండి ఒక సొంత ఇల్లు కూడా సంపాదించుకోలేకపోవడం ఆశ్చర్యమే అనిపిస్తుంది. పాత్రికేయుడిగానే కాకుండా, 'ఉపన్యాస కేసరి' అని పిలిపించుకున్న ఏకైక జర్నలిస్ట్ తుర్లపాటి. 18 వేల ప్రసంగాలు చేసి గిన్నిస్ బుక్ రికార్డులలోకి ఎక్కారు. అదే సమయంలో పలు పుస్తకాలు రచించారు. 'జాతి నిర్మాతలు', '1857 విప్లవ వీరులు' వంటి పలు పుస్తకాలు వీరు రచించినవే. ఆంధ్ర యూనివర్శిటీ నుంచి 'కళా ప్రపూర్ణ', 'ముట్నూరి కృష్ణారావు అవార్డు', ఆనాటి ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 'నేషనల్ సిటిజన్స్ అవార్డు', అమెరికాలోని బయోగ్రాఫికల్ సంస్థ వారి 'ఇంటర్నేషనల్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్' వంటి అవార్డులు దక్కాయి.

తుర్లపాటి కుటుంబరావు 1933 ఆగస్టు పదో తేదీన జన్మించారు. కృష్ణా జిల్లా గన్నవరం, విజయవాడల్లో చదువుకున్నారు. 14 ఏళ్ల వయసులోనే పత్రికా రంగంలోకి రావడం ఒక ప్రత్యేకత. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుకు చెందిన 'ప్రజా పత్రిక'లో ఆయన చేరి వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. 1959లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో సహాయ సంపాదకుడిగా ఆరంభమైన ఆయన జర్నలిస్ట్ ప్రస్థానం జీవితాంతం కొనసాగింది. 18 మంది ముఖ్యమంత్రులతో ఆయనకు సంబంధాలు, మంచి పరిచయాలు ఉండేవి. అలాగే సినీ రంగంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్ బాబు తదితరులకు ఈయనంటే ఇష్టం. వారి గురించిన వ్యాసాలు పుంఖానుపుంఖాలుగా రాశారు. వారికి బిరుదులు ఇచ్చి విజయవాడలో సత్కార, సన్మాన కార్యక్రమాలు నిర్వహించేవారు. ఉదాహరణకు ఏఎన్నార్‌కు 'నట సామ్రాట్' అనే బిరుదును ఖాయం చేసి ప్రదానం చేసింది ఈయనే. 'నంది' అవార్డులను సినిమావారికి ప్రవేశపెట్టాలని కోరుతూ, అవి వచ్చేందుకు తుర్లపాటి విశేష కృషి చేశారు. జాతీయ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా, జ్యోతిచిత్ర సినిమా పత్రిక సంపాదకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. రాజకీయ, సినీ రంగం రెండింటిలోనూ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించగలగడం అందరికీ కుదరదు. సాహిత్య, సంగీతాభిలాషి అయిన ఆయన అభ్యుదయవాది కూడా. ప్రముఖ కూచిపూడి నర్తకి కృష్ణకుమారిని ప్రేమ వివాహం చేసుకున్నారు.



తుర్లపాటి కుటుంబరావు

రాష్ట్ర స్థాయి నేతలతోనే కాదు... పలువురు జాతీయ స్థాయి నాయకులతో కూడా ఆయన సంబంధాలు, ఉత్తరప్రత్యుత్తరాలు నెరపేవారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, అంబేడ్కర్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ వంటివారితో తరచు ఇంటర్వ్యూ అయ్యేవారు. ఇక ఇందిరా గాంధీ, మొరార్జీ దేశాయ్, జగ్జీవన్ రామ్, రాజీవ్ గాంధీ వంటి వారు ఏపీకి వచ్చినప్పుడు, వారి ఉపన్యాసాలకు అనువాదకులుగా ఉండేవారు. నెహ్రూపై ఉన్న అభిమానంతో ఆయన తన కుమారుడికి ఆ పేరే పెట్టుకోవడం విశేషం. ప్రేమ వివాహానికి గుర్తుగా కుటుంబ రావు తమ కుమార్తెకు 'ప్రేమ జ్యోతి' అని పేరు పెట్టారు. చతు రోక్తులతో ప్రసంగాలు చేయడం ఆయన విశిష్టత. ఆయా సందర్భాలను బట్టి ఆయా ప్రముఖుల చరిత్రను, వర్తమానాన్ని కలిపి, జీవిత విశేషాలతో ఆ కాలమ్ రాసి పాఠకులను ఆకట్టుకునేవారు. ఇన్ని గొప్పదనాలు ఉన్నవి కాబట్టే కేంద్ర ప్రభుత్వం ఈయనకు పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసింది. తెలుగు జర్నలిస్టులలో ఆ గౌరవం పొందింది ఈయన ఒక్కరే కావడం విశేషం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఛైర్మన్
(నేడు తుర్లపాటి కుటుంబరావు జయంతి)

చట్టం పేరుతో నిజాలను తిరస్కరించలేరు

అభిప్రాయం



గౌతమ్ భాటియా

వెర్నాన్ గొంజాల్వెస్, అరుణ్ ఫెరీరాలకు బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టు తాజాగా నిర్ణయం తీసుకుంది. చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) కఠినమైన నిబంధనలలో కొంత మేరకు న్యాయప్రక్రియను చొప్పించడానికి ఈ తీర్పు ప్రయత్నిస్తోంది. మహారాష్ట్రలో 2018లో ఒక వ్యక్తి మరణం, విస్తృతమైన ప్రతిఘటన, హింస చోటుచేసుకున్న 'భీమా కోరేగావ్' కేసులో వెర్నాన్ గొంజాల్వెస్, అరుణ్ ఫెరీరాలు నిందితులు. వీరు దాదాపు ఐదేళ్లపాటు ఎలాంటి విచారణ లేకుండా జైలులో గడిపినందుకే కాదు... చట్టవిరుద్ధమైన కార్యకలాపాల (నివారణ) చట్టం ఉపా నిబంధనలలో సుప్రీంకోర్టు తగిన న్యాయ ప్రక్రియకు చెందిన అంశాన్ని చొప్పించడానికి ప్రయత్నించిన అరుదైన సందర్భాలలో ఇది ఒకటి కాబట్టి ఈ తీర్పు ముఖ్యమైనది.

ఉపా కింద అరెస్ట్ అయిన వ్యక్తి బెయిల్ విచారణ సమయంలో, న్యాయస్థానం ముందు వాస్తవాలకు సంబంధించి ప్రాసిక్యూషన్ (లేదా పోలీసు)కు చెందిన వెర్షన్ (వాదన)కు సంబంధించిన వివరాలు మాత్రమే ఉంటాయి. ఈ సమయంలో, ప్రతివాది సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయలేడు లేదా తన సొంత సాక్ష్యాలను చూపించే వీలుండదు. ఉపా ప్రకారం, ఈ ఏకపక్ష వాదన ఆధారంగా నిందితుడిపై దేశద్రోహం కేసు మోపినట్లు కనిపిస్తే, బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదు.

దీనిని ఒక చేయి వెనుకకు కట్టివేసిన స్థితిలో ప్రతివాది పోరాటం చేస్తున్నట్టు భావించినట్లయితే, అత్యున్నత న్యాయస్థానం తన గత తీర్పులలో రెండో చేతిని కూడా కట్టే ప్రయత్నం చేసింది. 2019లో 'నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వర్సెస్ జహూర్ షా వటాలి' కేసులో ఇచ్చిన అపఖ్యాతి పాలైన తీర్పులో, బెయిల్ సమయంలో ఈ ఏకపక్ష వెర్షన్‌ని కూడా వివరణాత్మక లేదా శోధన పరిశీలనకు గురి చేయలేమని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. క్రిమినల్ న్యాయ కోవిదుడు అభినవ్ సెఖ్రీ మాటల్లో చెప్పాలంటే, పోలీసు వెర్షన్‌ను వేద వాక్యంగా భావించవలసి రావడంతో అనేక న్యాయస్థానాలు ఇతర వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా బెయిల్‌ను నిరాకరిస్తున్నాయి.

భీమా కోరేగావ్ కేసులో కానీ, అలాగే 2020 ఢిల్లీ అల్లర్ల కేసుల్లో ఉమర్ ఖలీద్ వంటి వ్యక్తుల బెయిల్ దరఖాస్తుల విషయంలో కానీ న్యాయస్థానాలు కేవలం ప్రాసిక్యూషన్ వాదాన్ని పఠించడం, పరిగణనలోకి తీసుకోవడం ద్వారా బెయిల్ తిరస్కరించాయి. అనేక ఇతర నిందితుల బెయిల్ విషయంలోనూ ఇదే జరిగింది. చివరకు విచారణ సమయంలో కోర్టు బయట ఉన్న వదంతులను పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. నిజానికి ఇలా పరిగణనలోకి తీసుకోవడం నిషిద్ధం. భారతదేశంలో నేర విచారణ చాలా కాలం పాటు సాగుతున్నందున, నేరారోపణ రుజువు కానప్పటికీ ఒక ఆరోపణ మాత్రంతోటే వ్యక్తులు ఏళ్లతరబడి జైళ్లలో తప్పని సరిగా మగ్గవలసి వస్తోంది.



ఈ సందర్భంలోనే వెర్నాన్ గొంజాల్వెస్ కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వు... వాస్తవాలను తిరస్కరించే రాజ్య ధోరణి (స్టేట్ ఇమ్యూనిటీ)కి తగిలిన ఒక ముఖ్యమైన న్యాయపరమైన ఎదురుదెబ్బ అనే చెప్పాలి. ఉపా కింద బెయిల్ నిబంధనల స్వభావాన్ని బట్టి కోర్టులు... నాణ్యత పరంగా, పరిశీలన విలువ పరంగా పోలీసులు అందించిన సాక్ష్యాల విశ్లేషణలో నిమగ్నమవ్వాలని న్యాయస్థానం సరిగ్గానే గుర్తించింది. చట్టం ఎంత కఠినంగా ఉంటుందో, విధి విధానాలకు కట్టుబడి ఉండటం కూడా అంతే ముఖ్యమని కోర్టు అందరి దృష్టికి తెచ్చింది. ఈ సూత్రాలను కోర్టు తన ముందున్న వాస్తవాలకు వర్తింపజేస్తూ, వెర్నాన్ గొంజాల్వెస్, అరుణ్ ఫెరీరాలకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యం చాలా నాసిరకం నాణ్యతతో ఉందని గుర్తించింది. ఈ జంట విప్లవ సాహిత్యాన్ని కలిగి ఉన్నట్లు కనుగొన్నప్పటికీ ఇది నేరం కాదని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం నొక్కి చెప్పింది.

నిషేధిత సంస్థతో ఈ ఇద్దరు వ్యక్తులకు సంబంధం ఉందనీ, దానిలో వారికి సభ్యత్వం ఉందనీ థర్డ్ పార్టీ రాసిన లేఖను ప్రాసిక్యూషన్ చూపించడం సరికాదని కోర్టు పేర్కొంది. ఆ విధంగా కుట్రకు సంబంధించిన అస్పష్టమైన ఆరోపణల ద్వారా తన కేసులోని ఖాళీలను పూరించడానికి ప్రాసిక్యూషన్ చేసిన ప్రయత్నాలను కోర్టు తిరస్కరించింది. నిర్దిష్టమైన, ప్రత్యేకమైన వాస్తవాలు లేకుండా ఈ ఆరోపణలకు విశ్వసనీయతను కల్పించడానికి న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు నిర్దేశించిన కొన్ని బెయిల్ షరతులు (గొంజాల్వెస్, ఫెరీరా తమ ఫోన్‌లను పోలీసు ఇన్వెస్టిగేటర్‌తో జత చేయడం, ఆ ఫోన్‌ల లొకేషన్‌ని ఎల్లప్పుడూ ఆన్‌లో ఉంచడం వంటివి) వ్యక్తిగత గోప్యతపై భృకుటి ముడి వేసినా... ఈ తీర్పు ఉపా కింద ప్రభుత్వానికి ఉన్న వాస్తవాలను తిరస్కరించే వెసులుబాటుపై గణనీయమైన దెబ్బలే వేసింది.

వస్తుగతంగా చూస్తే, విచారణలో సరైన ప్రక్రియను, న్యాయబద్ధతకు చెందిన కొన్ని ప్రాథమిక సూత్రాలను మాత్రమే ఉన్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది. కానీ ఈ తీర్పు ప్రముఖమైనది ఎందుకయ్యిందంటే... చాలా ఇతర కేసులలో, అనేక ఇతర కోర్టులు (ట్రయల్ కోర్టు, హైకోర్టు నుండి, సుప్రీం కోర్టు దాకా) పదేపదే ఈ సూత్రాలను విడిచిపెట్టేశాయనీ, పైగా వ్యక్తులు తమ రాజ్యాంగ హక్కుల సాధనలో కోర్టు తలుపులు తట్టినప్పుడు న్యాయస్థానాలు మరో వైపు చూశాయనీ చెప్పకనే చెప్పినందువల్ల.

సుప్రీం కోర్టు తీర్పు ఉపా చీకటి సొరంగంలో వెలుగును ప్రసరిస్తుంది. ఇప్పుడు ముందుకు వెళ్లే మార్గాన్ని ప్రకాశవంతం చేయడం ఇతర కోర్టుల పని.

వ్యాసకర్త ఢిల్లీ న్యాయవాది
('ద హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.నవమి ఉ.7.52 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** కృత్తిక ఉ.6.59 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** రా.11.20 నుండి 12.56 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.57 నుండి 10.48 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.54 వరకు, **అమృతఘడియలు:** తె.4.54 నుండి 5.50 వరకు (తెల్లవారితే శుక్రవారం); **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.27.

క్లుప్తంగా...

సాహిత్యం అందరికీ అందాలి: జూలూరి

సాక్షి, హైదరాబాద్: 'సాహిత్యం అందరిది. దానిని అందరికీ అందించాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నాం. మనం ఎవరి కోసమైతే సాహిత్యాన్ని సృష్టిస్తున్నామో అది వాళ్లకు చేరినప్పుడే దాని ప్రయోజనం నెరవేరినట్లుగా భావించాలి' అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ తెలిపారు. బుధవారం సాహిత్య అకాడమీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాహిత్య అకాడమీ వనపట్ల సుబ్బయ్య రాసిన 'బహుజన బావుటా', దామెర రాములు రాసిన 'నేను సావిత్రిబాయి పూలే మాట్లాడుతున్నాను' దీర్ఘకవితలు ప్రచురించిందని చెప్పారు. మొత్తం 150 చోట్ల ఒకే రోజున పుస్తకావిష్కరణలు జరిగాయని, తెలంగాణతో పాటు ముంబైలో డాక్టర్ అంబేడ్కర్ ఇంటి ముందు ఆవిష్కరించటం జరిగిందనీ, అలాగే జ్యోతిబా పూలే తిరుగాడిన పుణేలోనూ, సావిత్రీబాయి పూలే విశ్వవిద్యాలయంలోని విగ్రహం వద్ద కూడా పుస్తకావిష్కరణలు జరిగినట్లు తెలిపారు. నాందేడ్, షోలాపూర్, నాగ్‌పూర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, గుంటూరు, తిరుపతిలోనూ ఈ పుస్తకావిష్కరణలు జరిగినట్లు వివరించారు. చేతివృత్తుల బతుకు గాథలు, వ్యథలను చిత్రించిన సాహిత్యాన్ని ఆ బహుజన చేతివృత్తుల వారి వద్దకు తీసుకెళ్లి, వారి చేతుల మీదుగా ఆవిష్కరించడంతో సాహిత్య ప్రయోజనం సఫలీకృతమైనట్లుగా భావిస్తున్నామని జూలూరి అన్నారు.

హార్టికల్చర్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

మంత్రి నిరంజన్‌రెడ్డికి హెచ్‌ఈవోల వినతి

సాక్షి, హైదరాబాద్: ఉద్యానసాగు (హార్టికల్చర్) ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఉద్యానశాఖ విస్తరణ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం ప్రతినిధి బృందం బుధవారం మినిస్టర్స్ క్వార్టర్‌లో మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బొల్లుసైదులు, జనరల్ సెక్రటరీ బండి వేణుకుమార్, సంధ్య జోషి మాట్లాడుతూ...కరోనా కాలం నుంచి ఉద్యానశాఖ విస్తరణ అధికారులను (హెచ్‌ఈవో) పునరుద్ధరించకుండా నిలిపి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను నిధులలేమి కారణంతో రోడ్డుపాలు చేయడం సరికాదని, వయస్సుపైబడి వేరే ఉద్యోగాలు చేయలేక, కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందులకు గురవుతున్నాయని మంత్రికి వివరించారు. దీనికి మంత్రి నిరంజన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ...సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో వంటకపు విశ్వనాథ్‌రెడ్డి, బ్యాగరి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

రుణమాఫీ సొమ్ము వెనక్కి

- కొందరు రైతుల ఖాతాల్లో పడని సొమ్ము
- ఆయా ఖాతాలు ఫ్రీజ్‌లో ఉండటమే కారణం
- వ్యవసాయశాఖకు ఫిర్యాదుల వెల్లువ
- ఇప్పటివరకు రూ.50 కోట్లు వెనక్కి వచ్చినట్లు అంచనా



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ సొమ్ము కొందరు రైతుల ఖాతాల్లో పడకుండా వెనక్కి వస్తున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆయా రైతుల రుణ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్‌లో ఉండటం లేదా డిఫాల్ట్‌లో ఉండటం వల్ల ఈ విధంగా జరుగుతున్నట్లు చెబుతున్నారు. దీంతో అనేకమంది రైతులు వ్యవసాయశాఖకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది. దాదాపు రూ.50 కోట్లు తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి వచ్చినట్లు వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి.

మూడు సీజన్లలో చెల్లించకుంటే డిఫాల్టరే...

రాష్ట్రంలో ప్రతీ ఏటా సరాసరి 42 లక్షల మంది వరకు రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుంటారు. రుణం తీసుకున్న రైతులు మూడు సీజన్లలోగా బకాయిలు చెల్లిస్తేనే, తదుపరి రుణం తీసుకోవడానికి అర్హులవుతారు. అయితే రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించడం, వాటిని ఇటీవలి వరకు తీర్చకపోవడంతో రైతులు తమ బకాయిలను చెల్లించలేదు. మరోవైపు దీర్ఘకాలంగా బకాయిలు పేరుకుపోయిన వారు కూడా బకాయిలు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. 2018 ఎన్నికల సమయంలో లక్ష రూపాయల వరకు రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని అప్పుడు టీఆర్ఎస్(ఇప్పుడు బీఆర్ఎస్) హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. మొత్తంగా 36.68 లక్షల మంది రైతులకు చెందిన రూ.19,198.38 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గత నాలుగేళ్లలో దాదాపు రూ.1,200 కోట్లకు పైగా రుణమాఫీ చేశారు. మిగిలిన మొత్తం సొమ్మును మరో నెలన్నరలో మాఫీ చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు సొమ్మును విడతల వారీగా జమ చేస్తున్నారు.

బకాయిలు చెల్లించమని సర్కారు విన్నవించినా...

ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో రుణమాఫీ సొమ్ము పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో అనేకమంది రైతులకు రెన్యువల్ సమస్య వచ్చింది. రెన్యువల్ చేసుకోకపోతే డిఫాల్టర్లుగా మారుతారు. అయితే చాలామంది రైతుల నుంచి రైతుబంధు సొమ్మును బ్యాంకులు గుంజుకున్నాయి. అలా రెన్యువల్ చేశాయి. రుణం పొందాలంటే రెన్యువల్ చేయాల్సి ఉంటుంది కాబట్టి రైతులు బకాయిలు చెల్లించాలని, తర్వాత రుణమాఫీ సొమ్మును వారి ఖాతాలో వేస్తామని ప్రభుత్వం గతంలో విన్నవించిన సంగతి తెలిసిందే. కొందరు రైతులు అలా చెల్లించగా, మరికొందరు రైతులు మాత్రం డబ్బులు లేకపోవడంతో బ్యాంకులకు చెల్లించలేకపోయారు. దీంతో 10 లక్షల మంది వరకు రైతులు డిఫాల్టర్లుగా మిగిలినట్లు అంచనా. రుణమాఫీ అర్హులైన రైతుల సొమ్మును ఇస్తామని, వారిని ఎవరినీ డిఫాల్టర్లుగా ప్రకటించవద్దని వ్యవసాయశాఖ బ్యాంకులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. అనేక కారణాలతో రైతుల రుణ ఖాతాలు ఫ్రీజ్ కావడమో, నిలిచిపోవడమో జరగడం వల్ల ఇప్పుడు సమస్య వచ్చిపడింది. దీనిపై వ్యవసాయశాఖ వర్గాలు ఏం చేస్తారన్న దానిపై స్పష్టత లేదు.

ఆదివాసీల అభివృద్ధితోనే కొమురంభీంకు నివాళి

- కొమురంభీం మనవడు కొమురం సోనేరావు



ట్యాంక్‌బండ్‌పై కొమురంభీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొమురంభీం మనవడు కొమురం సోనేరావు

ముషీరాబాద్ (హైదరాబాద్): ఆదివాసీ గిరిజన బిడ్డలకు న్యాయం జరిగినప్పుడే కుమురంభీంకు మనం అందించే నిజమైన నివాళి అని కొమురంభీం మనువడు కొమురం సోనేరావు అన్నారు. ఆదివాసీ, గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా పాలకులు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఏటా ఆదివాసీ ప్రపంచ దినోత్సవం, కొమురంభీం జయంతి, వర్ధంతులు నిర్వహించడం కాదని గిరిజనులు అభివృద్ధి చెందేలా పాలకుల చర్యలుండాలని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వివేక్‌నాయక్, ప్రధాన కార్యదర్శి సోయం ప్రభాకర్, కోశాధికారి సోయం గోవర్ధన్‌ల ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురంభీం విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి సోనేరావు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ బంధు అమలు చేయాలని, కొమురంభీంకు కేంద్రం భారతరత్న అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఆదిలాబాద్ జిల్లాలో నెలకొల్పాలని, జీవో నంబర్ 34 గిరిజన సాధికారిత విధానం-2010ని వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వేరు చేసి ఎస్టీలకు ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తిరుపతి, యాదగిరి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆట, పాట, మాటతో.. జన హృదయాలు గెలిచారు



త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, జూలూరి గౌరీశంకర్, దేవీ ప్రసాద్, శ్రీనివాస్‌గుప్తా, కళా జనార్దనమూర్తి, కోళ్ల సుధాకర్

- గద్దర్ సంతాప సభలో ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి (హైదరాబాద్): గద్దర్ ఏ ఒక్క వర్గానికి, భావజాలానికి మాత్రమే పరిమితం కాలేదని, ఆయన పాట, మాట, ఆటతో జనహృదయాలను గెలిచారని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. చెప్పదలచుకున్న విషయాన్ని జన హృదయాలను తాకేటట్టు నేర్పుగా చెప్పగల గొప్ప వాగ్గేయకారుడు గద్దర్ అని ప్రశంసించారు. బుధవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో లలిత కళావేదికపై ప్రజా యుద్ధనౌక, ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ సంతాప సభ జరిగింది. ఇనాక్ తనకు గద్దర్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గద్దర్ సాహిత్యం సిలబస్‌గా పెట్టే ప్రయత్నంలో ఎదుర్కొంటున్న అనుభవాలు, గద్దర్‌లో విప్లవభావాలు, తెలంగాణ భావన, దళిత వర్గాల అభ్యుదయం పట్ల ఆలోచనలను పంచుకున్నారు. సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ, ప్రపంచ జానపద గాయకుని స్థాయికి ఎదిగిన గద్దర్.. పాట ఉన్నంతకాలం నిలిచి ఉంటారని అన్నారు. గద్దర్‌లో భిన్న కోణాలు ఉన్నాయని బేవరేజెస్ పూర్వ చైర్మన్ దేవీప్రసాద్ పేర్కొన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా 'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా'అన్న గద్దర్ పాటను లయబద్ధంగా పాడి తనకు గద్దర్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ, గద్దర్ గొప్ప కళాకారుడు అయినప్పటికీ అందరినీ ఆప్యాయంగా పలుకరించే మానవతామూర్తి అని ప్రశంసించారు.

గద్దర్ ఆశయాలను పూర్తిగా నెరవేరుస్తాం

మీడియా సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజాకవి, గాయకుడు గద్దర్ ఆశయాలను ప్రభుత్వం చాలావరకు నెరవేర్చిందని, ఇతర ఆశయాలను కూడా పూర్తిగా సాకారం చేస్తామని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. గద్దర్ గురించి ఏమీ తెలియని అజ్ఞాని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడితే ఆయన ఆత్మ క్షోభిస్తుందన్నారు. ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. గద్దర్ జీవితం ఎవరికి వ్యతిరేకంగా మొదలైందో రేవంత్‌కు తెలియదని, గద్దర్‌కు ఫలానా వారే నివాళి అర్పించాలని ఎక్కడైనా ఉందా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కలిసి పనిచేశారని, ఆయన గురించి మాట్లాడే అర్హత తమకే ఉందన్నారు. గద్దర్‌ను అడ్డుపెట్టుకుని శవ రాజకీయం చేస్తున్నదని రేవంత్‌రెడ్డి మాత్రమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నా తన అహంకారం, అతి తెలివితో ఖతం చేస్తారని, కాంగ్రెస్‌కు కూడా అదే గతి పట్టిస్తారని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

మాది అభివృద్ధి భాష.. రేవంత్‌ది పిండాల భాష

ఓటుకు నోటు కేసుతో టీడీపీ, కరెంట్‌పై వ్యాఖ్యలతో కాంగ్రెస్‌కు తద్దినం పెట్టిన చరిత్ర రేవంత్‌కే ఉందని జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి భాష మాట్లాడితే రేవంత్ పిండాల భాష మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షుద్ర రాజకీయాలు చేసే ఆయన క్షమాపణ చెప్పాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మాచర్లలో భరతుడంటా!

- లోకేశ్ మళ్లీ ఏసేశాడు



సాక్షి, నరసరావుపేట: 'యుద్ధానికి వెళుతున్న భరతుడికి వీర తిలకం దిద్దిన ప్రాంతం మాచర్ల'అంటూ టీడీపీ నేత నారా లోకేశ్ తన అజ్ఞానాన్ని మరోసారి చాటుకున్నారు. పల్నాడు జిల్లా గురజాలలో బుధవారం జరిగిన బహిరంగ సభలో లోకేశ్ పైవిధంగా నాలుకను మడతేసిపడేశారు. వాస్తవానికి బాలచంద్రుడికి వీర తిలకం దిద్ది పంపింది మగువ మాంచాల. పల్నాటి గడ్డపై పసివాడిని అడిగినా ఈ విషయం ఇట్టే చెప్పేస్తాడు. కానీ లోకేశ్ మాత్రం మిడిమిడి జ్ఞానంతో భరతుడిని మాచర్లలోకి దించేశారు.

సీఎం కేసీఆర్‌వి కపట నాటకాలు: జూపల్లి



కొల్లాపూర్ (నాగర్‌కర్నూల్ జిల్లా): ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావువి అన్నీ కపట నాటకాలేనని, ఆయన పరిపాలన పైన పటారం, లోన లొటారం మాదిరిగా ఉందని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ఆయన తొలిసారిగా బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాగాయకుడు గద్దర్ రెండేళ్లుగా సీఎం అపాయింట్‌మెంట్ అడిగితే కేసీఆర్ ఇవ్వలేదని, ఈ విషయం స్వయంగా గద్దరే తనకు చెప్పారని గుర్తు చేశారు. గద్దర్ చనిపోయాక ఆయన అంత్యక్రియల్ని అధికారికంగా నిర్వహిస్తే ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ప్రొఫెసర్ జయశంకర్‌కు సైతం ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని, ఈ విషయాలను ప్రొఫెసర్ హరగోపాల్ తనకు వెల్లడించారన్నారు. నీటిపారుదలశాఖ మంత్రి పదవిని విద్యాసాగర్‌రావుకు ఇవ్వాలని జయశంకర్ సూచిస్తే...సరే అని చెప్పి ఆ పదవిని తన మేనల్లుడు హరీశ్‌రావుకు కట్టబెట్టారని దుయ్యబట్టారు.

మత్స్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మత్స్యశాఖ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అధ్యక్షుడు రమేశ్ డిమాండ్



ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్న మత్స్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు

ముషీరాబాద్ (హైదరాబాద్): ఆరేళ్లుగా మత్స్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ మత్స్యశాఖ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆర్టీసీ, వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం అతితక్కువ మంది ఉన్న తమను కూడా రెగ్యులరైజ్ చేయాలని ఆయన కోరారు. మత్స్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ చేపలు, రొయ్యల ఉత్పత్తిని పెంచడంతోపాటు మత్స్య సంపదను దేశవిదేశాలకు ఎగుమతి చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మణిపూర్‌లో భరతమాత హత్య

- లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు
- మణిపూర్‌ను బీజేపీ విచ్ఛిన్నం చేసింది
- బీజేపీ నేతలు దేశభక్తులు కాదు.. దేశద్రోహులు
- లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ తర్వాత సభలో రాహుల్ తొలి ప్రసంగం

సాక్షి, న్యూఢిల్లీ: అధికార బీజేపీపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. మణిపూర్‌లో భరతమాతను బీజేపీ ప్రభుత్వం హత్య చేసిందని గర్జించారు. రాష్ట్రంలో హింసాకాండను అరికట్టడంలో, శాంతిని నెలకొల్పడంలో నరేంద్ర మోదీ సర్కారు దారుణంగా విఫలమైందని ఆరోపించారు. బీజేపీ నాయకులు ముమ్మాటికీ దేశద్రోహులేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ సహా విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో రెండోరోజు బుధవారం కూడా చర్చ కొనసాగింది. ఈ చర్చలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించిన తర్వాత సభలో ఆయన మాట్లాడడం ఇదే మొదటిసారి. దాదాపు 30 నిమిషాల పాటు ప్రసంగం సాగింది. బీజేపీపై, మోదీ సర్కారుపై దుమ్మెత్తి పోశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకొని ఘాటు వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. ఆ సమయంలో మోదీ సభలో లేరు. అలాగే తన 'భారత్ జోడో యాత్ర' అనుభవాలను రాహుల్ పంచుకున్నారు. ఒకవైపు ఆయన ప్రసంగం కొనసాగుతుండగా, మరోవైపు సభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. విపక్ష ఎంపీలు 'ఇండియా.. ఇండియా' అని నినాదాలు చేయగా, అధికార పక్ష సభ్యులు 'మోదీ.. మోదీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. గౌతమ్ అదానీ గురించి మాట్లాడడానికి సభకు రాలేదని, భయపడకండి అని బీజేపీ సభ్యులకు చురక అంటిస్తూ రాహుల్ తన ప్రసంగం ప్రారంభించారు. సభలో ఆయన ఏం మాట్లాడారంటే...


లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

ప్రజల మద్దతుతోనే పాదయాత్ర దిగ్విజయం

భారత్ జోడో యాత్ర ఇంకా పూర్తి కాలేదు. ఈ యాత్ర ప్రారంభించినప్పుడు ఎందుకు నడుస్తున్నారు? మీ లక్ష్యం ఏమిటి? అని చాలామంది అడిగారు. పాదయాత్ర చేయాలని ఎందుకు అనుకున్నానో తొలుత తెలియలేదు. నేను దేన్ని ప్రేమిస్తానో అర్థం చేసుకోవడానికి, దేనికోసం నేను మరణానికి కూడా సిద్ధమో గుర్తించడానికి, మోదీకి చెందిన జైలుకు వెళ్లడానికి యాత్ర చేస్తున్నట్లు క్రమంగా తెలుసుకున్నా. నేను నిత్యం 10 కిలోమీటర్లు పరుగెత్తేవాడిని. అలాంటిది పాదయాత్రలో రోజుకు 25 కిలోమీటర్లు నడవలేనా అనుకున్నా. అప్పట్లో నాలో అహంకారం ఉండేది. భారత్ జోడో యాత్ర ఆ అహంకారాన్ని మాయం చేసింది. యాత్ర మొదలైన తర్వాత రెండు మూడు రోజుల్లోనే నాకు ఒళ్లు నొప్పులు ప్రారంభమయ్యాయి. నాలో అహంకారం పూర్తిగా మాయమైంది. పాదయాత్రలో ప్రజలు నాకు అండగా నిలిచారు. వారి మద్దతుతోనే యాత్ర దిగ్విజయంగా కొనసాగించా. ప్రతిరోజూ ప్రజలు చెప్పింది విన్నాను. నా వద్దకు ఓ రైతు వచ్చాడు. అతడికి పంటల బీమా దక్కలేదని చెప్పాడు. అతడి ఆకలి బాధ నాకు అర్థమైంది. ఆ తర్వాత నా యాత్ర తీరు మారిపోయింది. అప్పటినుంచి చుట్టుపక్కల ప్రజల నినాదాలు నాకు వినిపించలేదు. బాధితుల ఆవేదనే వినిపించేది. భారత్ జోడో యాత్ర పూర్తి కాలేదు. తూర్పు నుంచి పశ్చిమ భారతదేశం వరకూ పాదయాత్ర కొనసాగిస్తా. దేశంలో వేర్వేరు భాషలు ఉన్నాయని చెబుతుంటారు. ఇది నేల, ఇది బంగారం, ఇది వెండి అని అంటుంటారు. కానీ, సత్యం ఏమిటంటే ఈ దేశం ఓ గొంతుక. దాన్ని వినాలంటే మన మనసులోని అహంకారాన్ని, విద్వేషాన్ని విడనాడాలి. అప్పుడే దేశం గొంతుక మనకు వినిపిస్తుంది.

మణిపూర్ బాధితుల ఆవేదన విన్నా

కొన్ని రోజుల క్రితం మణిపూర్ వెళ్లాను. అక్కడికి ప్రధాని ఇప్పటికీ వెళ్లలేదు. మోదీ దృష్టిలో మణిపూర్ లేదు. మణిపూర్ భారతదేశంలో ఒక భాగం కాదని అనుకుంటున్నారు. నేను 'మణిపూర్' అనే పదాన్ని వాడాను. కానీ, మణిపూర్ అనేదే లేదు. దానిని రెండుగా విభజించారు. బీజేపీ ప్రభుత్వం మణిపూర్‌ను విచ్ఛిన్నం చేసింది. నేను మణిపూర్‌లో సహాయక శిబిరాలకు వెళ్లాను. అక్కడున్న మహిళలు, పిల్లలతో మాట్లాడాను. ఒక మహిళను 'అక్క.. మీకు ఏమైంది?' అని అడిగా. దానికి ఆమె 'నాకు ఒకే ఒక్క కుమారుడు ఉన్నాడు. నా కళ్ల ముందే అతడిని కాల్చిచంపారు. రాత్రంతా నేను నా బిడ్డ మృతదేహం పక్కనే కూర్చున్నాను. ఆ తర్వాత భయపడి కట్టుబట్టలతో, చేతిలో ఓ ఫొటోతో నా ఇంటిని విడిచిపెట్టాను' అని ఆమె నాతో చెప్పింది. మరో మహిళను 'మీకు ఏమైంది?' అని అడగ్గానే, ఆమెకు జరిగింది గుర్తుకు వచ్చి వణికిపోవడం మొదలుపెట్టింది. సొమ్మసిల్లి పడిపోయింది. మణిపూర్‌లో హిందూస్తాన్‌ను బీజేపీ హత్య చేసిందని చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు చాలు.

ప్రజల గొంతుకను హత్య చేశారు

భారత్ అంటేనే ఓ గొంతుక. భారత్ మన ప్రజల గొంతుక. అది ప్రజల హృదయ స్పందన. అలాంటి గొంతుకను మీరు(బీజేపీ ప్రభుత్వం) మణిపూర్‌లో హత్య చేశారు. అంటే భరతమాతను హత్య చేశారు. మణిపూర్ ప్రజలను హత్య చేయడం ద్వారా భారతదేశాన్ని హత్యచేశారు. అందుకే మీ ప్రధాని(మోదీ) మణిపూర్ వెళ్లడం లేదు. మీరు దేశభక్తులు కాదు, దేశ ద్రోహులు. మీరు భరతమాత రక్షకులు కాదు. భరతమాతను హత్య చేసిన హంతకులు. నా తల్లి ఈ సభలోనే ఉన్నారు. మరో తల్లి అయిన భరతమాత మణిపూర్‌లో హత్యకు గురైంది. మణిపూర్‌లో హింసను అరికట్టనంత వరకూ నా తల్లి హత్యకు గురవుతూనే ఉంటుంది.

దేశాన్ని దహనం చేసే కుట్రలు

సైన్యం ఒక్క రోజులో మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించగలదు. కానీ, కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని మణిపూర్‌లో మోహరించడం లేదు. ఎందుకంటే ప్రభుత్వం మణిపూర్‌లో భారతదేశాన్ని హత్య చేయాలనుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల మాటలు వినడం లేదు. కేవలం ఇద్దరి మాటలే వింటున్నారు. రావణాసురుడు కేవలం మేఘనాథుడు, కుంభకర్ణుడి మాటలే విన్నాడు. అలాగే మోదీ కేవలం గౌతమ్ అదానీ, అమిత్ షా మాటలనే ఆలకిస్తున్నారు. రావణుడి అహంకారమే లంకను దహనం చేసింది. రావణుడి అహంకారమే అతడిని అంతం చేసింది. మీరు దేశం మొత్తం కిరోసిన్ చల్లుతున్నారు. మణిపూర్‌లో కిరోసిన్ చల్లి నిప్పు రగిలించారు. హరియాణాలోనూ ఇప్పుడు అదే చేస్తున్నారు. దేశాన్ని దహనం చేసేందుకు మీరు కుతంత్రాలు పన్నుతున్నారు. దేశమంతటా భరతమాతను అంతం చేస్తున్నారు'' అని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ప్రసంగం అనంతరం ఆయన సభ నుంచి బయటకు వెళ్తూ ఇతర సభ్యుల వైపు చూస్తూ 'ఫ్లైయింగ్ కిస్' ఇచ్చారు.

రాజకీయం చేయడం సిగ్గుచేటు

మణిపూర్ అంశంలో విపక్షాల తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆగ్రహం

- హింసకు స్వస్తి పలకాలని మణిపూర్ తెగలకు విజ్ఞప్తి
- మణిపూర్‌లో శాంతి కోసం లోక్‌సభలో తీర్మానం

న్యూఢిల్లీ: మణిపూర్ అంశంలో ప్రతిపక్షాల వైఖరిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ వ్యవహారాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. బుధవారం లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. విపక్ష నేత రాహుల్ గాంధీ తీరును తప్పుపట్టారు. మణిపూర్‌లో ముఖ్యమంత్రిని మార్చడం గానీ, రాష్ట్రపతి పాలన గానీ అవసరం లేదని తేల్చిచెప్పారు. మణిపూర్‌లో శాంతిని కాంక్షిస్తూ అమిత్ షా ప్రతిపాదించిన తీర్మానాన్ని లోక్‌సభలో ఆమోదించారు. సభలో అమిత్ షా ప్రసంగం ఆయన మాటల్లోనే...

రాహుల్ 13సార్లు విఫలం

''మణిపూర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పెద్ద డ్రామా నడిపించారు. ఆయన పర్యటనకు ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేసింది. వాటిని తిరస్కరించారు. చురాచాంద్‌పూర్‌కు హెలికాప్టర్‌లో వెళ్లాలని కోరితే రోడ్డు మార్గంలో వెళ్తానన్నారు. మొదటిరోజు సత్యాగ్రహం చేశారు. రెండోరోజు హెలికాప్టర్‌లో వెళ్లారు. 13 సార్లు రాజకీయ రంగ ప్రవేశం చేసిన నాయకుడు(రాహుల్ గాంధీ) ఈ సభలో ఉన్నారు. ఆయన 13 సార్లు విఫలమయ్యారు. మహారాష్ట్రలోని విదర్భలో కళావతి అనే పేద మహిళతో కలిసి రాహుల్ భోజనం చేశారు. ఆమె అనుభవిస్తున్న కష్టాలను ఈ సభలో ప్రస్తావించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వమే ఆరేళ్లు అధికారంలో ఉంది. కానీ, కళావతి పేదరికాన్ని పోగొట్టడం కోసం రాహుల్ చేసిందేమీ లేదు. మోదీ ప్రభుత్వమే కళావతికి ఇల్లు, కరెంటు, గ్యాస్ సౌకర్యాలు కల్పించింది. రేషన్ సరుకులు ఇస్తోంది.

మోదీ సర్కారు ఎన్నో ఘనతలు సాధించింది

ప్రధాని మోదీ గత తొమ్మిదేళ్లలో 50 సార్లు ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించారు. ఆయా రాష్ట్రాల అభివృద్ధి కోసం ఆయన శ్రమిస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో మణిపూర్‌లో ఎన్నోసార్లు హింసాత్మక సంఘటనలు జరిగాయి. అప్పట్లో హోంమంత్రి మణిపూర్‌లో పర్యటించలేదు. కానీ, నేను ఆ రాష్ట్రంలో 23 రోజులపాటు పర్యటించా. ఈశాన్యంలో గత తొమ్మిదేళ్లలో 8 వేల మంది సాయుధ తీవ్రవాదులు లొంగిపోయారు. దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేసింది. ఎన్నో ఘనతలు సాధించింది.

ఆ వీడియో వెనుక ఆంతర్యం ఏమిటి?

''మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన మే 4న జరిగింది. ఈ వీడియో జూలై 19న బయటికొచ్చింది. వీడియోను సోషల్ మీడియాలో పెట్టే బదులు రాష్ట్ర డీజీపీకి అందజేస్తే బాగుండేది. తద్వారా నేరస్తులను వెంటనే గుర్తించి, అరెస్టు చేసేందుకు వీలుండేది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ఒక్కరోజు ముందు ఈ వీడియోను ఉద్దేశపూర్వకంగా లీక్ చేశారు. దాని వెనుక ఆంతర్యం ఏమిటి? వీడియో బయటపడిన వెంటనే ప్రభుత్వం స్పందించింది. తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసింది.

అందువల్లే అసలు సమస్య

మయన్మార్‌లో 2021లో అక్కడి సైనిక ప్రభుత్వం మిలిటెంట్లపై కఠిన చర్యలు ప్రారంభించింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడున్న కుకీలు మన దేశంలోని మణిపూర్‌కు వలసవచ్చారు. మణిపూర్ లోయలోని అడవుల్లో వారు స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. దాంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అందువల్ల ఇక్కడ సమస్య మొదలైంది. వలసవచ్చిన కుకీల స్థావరాలను గ్రామాలుగా అధికారికంగా ప్రకటిస్తున్నారని వదంతులు రావడంతో అశాంతి ప్రారంభమైంది. మైతేయిలను ఎస్టీల్లో చేర్చే ప్రక్రియ ప్రారంభించాలని మణిపూర్ హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వడంతో సమస్య ఇంకా ముదిరింది. మణిపూర్‌లో ఘర్షణల నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. శాంతి కమిటీని ఏర్పాటు చేసింది. హింసను చాలావరకు అరికట్టాం.


లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

కాంగ్రెస్‌కు అవినీతి పనులు అలవాటే

ప్రభుత్వాలను కాపాడుకోవడానికి అవినీతికి పాల్పడిన ఘన చరిత్ర కాంగ్రెస్‌దే. విపక్ష కూటమి అసలు రూపం ప్రజలకు తెలుసు. 1999లో అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం అవిశ్వాస పరీక్షను ఎదుర్కొంది. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి వాజ్‌పేయి తప్పుడు మార్గాలు ఎంచుకోలేదు. మౌనంగా పదవి నుంచి దిగిపోయారు. ముడుపులు ఇచ్చి ప్రభుత్వాలను కాపాడుకోవడం కాంగ్రెస్‌కు అలవాటే. 1993లో పీవీ నరసింహారావు ప్రభుత్వాన్ని అలాగే రక్షించుకున్నారు. 2008లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కూడా అదే విధంగా సంక్షోభం నుంచి గట్టెక్కింది. కాంగ్రెస్ పార్టీ అసలు రంగు ఇదే. బీజేపీ ఎప్పటికీ విలువలకు కట్టుబడి ఉంటుంది. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలకు విశ్వాసం లేకపోవచ్చు గానీ ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా పొందిన నాయకుడు నరేంద్ర మోదీ మాత్రమే. ఆయన రెండు సార్లు పూర్తి మెజార్టీతో అధికారంలోకి వచ్చారు. ఇలా జరగడం 30 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. అవినీతి.. క్విట్ ఇండియా, వారసత్వ రాజకీయాలు.. క్విట్ ఇండియా, బుజ్జగింపు రాజకీయాలు.. క్విట్ ఇండియా అని మేము నినదిస్తున్నాం.

చేతులు జోడించి ప్రార్థిస్తున్నా..

చేతులు జోడించి ప్రార్థిస్తున్నా. హింసకు ఇక స్వస్తి పలికి శాంతియుతంగా కలిసిమెలసి ఉండాలని మణిపూర్ తెగలను కోరుతున్నా. సమస్య పరిష్కారం కోసం కేంద్రంతో చర్చలు జరపడానికి కుకీలు, మైతేయిలు ముందుకు రావాలి. మణిపూర్ అంశాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దు. అరాచకాలను ఎవరూ సమర్థించరు. మణిపూర్‌లో జరిగిన ఘటనలు సిగ్గుచేటు. వాటిని రాజకీయం చేయడం సిగ్గుచేటు. మణిపూర్‌లో అగ్నికి ఆజ్యం పోయవద్దని ప్రతిపక్షాలను కోరుతున్నా. మణిపూర్‌లో జరిగిన ఘర్షణల్లో మే 3వ తేదీ నుంచి ఇప్పటిదాక 152 మంది మరణించారు. 14,898 మంది నిందితులు అరెస్టయ్యారు. 1,106 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మరణాలు తగ్గుతున్నాయి. మే నెలలో 107 మంది, జూన్‌లో 30 మంది, జూలైలో 15 మంది మరణించారు. మణిపూర్ ముఖ్యమంత్రిని తొలగించే అవకాశం లేదు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించే విషయంలో సీఎం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నారు. అక్కడ రాష్ట్రపతి పాలన అవసరం లేదు'' అని అమిత్ వివరించారు.

నిండు సభలో.. మహిళా మంత్రికి ముద్దులా?

- మహిళా ఎంపీలను అవమానించాడు
- తద్వారా పార్లమెంట్‌కే మచ్చతెచ్చాడు
- కేంద్ర మహిళా మంత్రులు, ఎంపీల ధ్వజం
- కఠినాతి కఠిన చర్యలు తీసుకోండి
- లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు
- బీజేపీకి రాహుల్ ఫోబియా: కాంగ్రెస్
- ప్రేమను పంచితే సహించలేకపోతున్నారంటూ ఎదురుదాడి


మీడియాతో మాట్లాడుతున్న శోభ, తదితరులు

న్యూఢిల్లీ: లోక్‌సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఫ్లయింగ్ కిస్‌లు బుధవారం పెను వివాదానికి దారితీశాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతుండగా అధికార సభ్యుల కేసి ఆయన ముద్దులు విసిరారు. రాహుల్‌కి ఉన్న మహిళా విద్వేషానికి ఇది నిదర్శనమని బీజేపీ దుమ్మెత్తిపోయగా, అధికార పార్టీ రాహుల్ ఫోబియాతో బాధపడుతోందంటూ కాంగ్రెస్ ఎదురు దాడికి దిగింది. రాహుల్‌పై అత్యంత కఠిన చర్య తీసుకోవాలంటూ బీజేపీ మహిళా ఎంపీలు స్పీకర్ బిర్లాకు ఫిర్యాదు చేశారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. రాహుల్ తీరును తూర్పారబట్టారు. మొత్తంమ్మీద అనర్హత వేటు తర్వాత సభలో అడుగుపెట్టిన తర్వాత రాహుల్‌గాంధీ చేసిన సైగలతో రేగిన దుమారం కొద్దిరోజులపాటు పార్లమెంట్‌ను కుదిపేసేలా కనిపిస్తోంది.

సభలోనే కన్ను కొట్టిన చరిత్ర రాహుల్‌ది

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని ఉద్దేశించి లోక్‌సభలో రాహుల్ అసభ్యకర సైగలు చేశారంటూ స్పీకర్‌కు బీజేపీ లిఖితపూర్వక ఫిర్యాదుచేసింది. మంత్రులు శోభా కరంద్లాజే, దర్శన జర్దోష్‌తోపాటు 20 మందికిపైగా బీజేపీ మహిళా ఎంపీలు దానిపై సంతకం చేశారు. ' రాహుల్ చేసిన దిగజారుడు పని సభలోని మహిళా సభ్యులను తీవ్రంగా అవమానించింది. అంతేకాదు, లోక్‌సభలో గౌరవానికి కూడా భంగం కలిగింది. అందుకే ఆయనపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దుమ్మెత్తిపోశారు. ఒక సభ్యుడు నిండు సభలో ఇంత బాహాటంగా స్త్రీ విద్వేషం ప్రదర్శించిన ఉదంతం పార్లమెంట్ చరిత్రలోనే ఎన్నడూ లేదని మహిళా బీజేపీ ఎంపీ అన్నారు. గాంధీ కుటుంబీకులు పాటించే విలువలకు ఇదే నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఇలాంటి దిగజారుడు ప్రవర్తనకుగాను రాహుల్‌కు తగిన శిక్ష పడి తీరాలని డిమాండ్ చేశారు. ఇరానీ ప్రసంగం వినాల్సిందిగా బీజేపీ సభ్యులు కోరినందుకు రాహుల్ వారివైపు రెండు మూడు అడుగులు వేసి మరీ ఫ్లైయింగ్ కిస్సులు విసిరారని శోభా కరంద్లాజే ఆరోపించారు. సీసీటీవీ ఫుటేజీలు చూసి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలోనూ లోక్‌సభలో కన్ను కొట్టిన చరిత్ర రాహుల్‌కు ఉందని ఎంపీలు గుర్తుచేశారు. ఆయన ప్రవర్తనలోనే ఏదో లోపముందని అభిప్రాయపడ్డారు.

మణిపూర్‌పై చర్చ తప్పించుకునేందుకే: కాంగ్రెస్

లోక్‌సభలో రాహుల్ ఫ్లయింగ్ కిస్సులను కాంగ్రెస్ గట్టిగా సమర్థించుకుంది. ఆయన మహిళలను ఎప్పటికీ అగౌరవపరచజాలరని పార్టీ స్పష్టంచేసింది. మణిపూర్ హింసాకాండపై పార్లమెంట్‌లో చర్చ జరగడం అధికార పార్టీకి అస్సలు ఇష్టం లేదంటూ ఎదురుదాడికి దిగింది. అందుకే రాహుల్‌పై ఇలా తప్పుడు ఆరోపణలకు బరితెగించిందని ఆరోపించింది. బీజేపీకి, స్మృతి ఇరానీకి రాహుల్ ఫోబియా పట్టుకుందని లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణిక్కం ఠాకూర్ ఎద్దేవా చేశారు. ముద్దులు.. ప్రేమకు, ఆప్యాయతకు నిదర్శనమని ఆయన చేసిన భారత్ జోడో యాత్రను చూసిన వారందరికీ తెలుసు అని కాంగ్రెస్ పార్టీప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గుర్తుచేశారు. రాహుల్ చర్య ఆప్యాయత చిహ్నమేనని శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) మహిళా ఎంపీ ప్రియాంకా చతుర్వేది వ్యాఖ్యానించారు. 'అప్పట్లో రాహుల్ ప్రేమ దుకాణం అన్నారు. ఇదీ అలాంటి సదుద్దేశంతో కూడిన సైగ మాత్రమే' అని స్పష్టంచేశారు.



భరతమాతను హత్యచేశారంటే.. బల్లలు చరుస్తారా ?

రాహుల్ గాంధీ ప్రసంగంపై నిప్పులు చెరిగిన స్మృతి ఇరానీ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో భరతమాతను హత్య చేశారంటూ రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాన్ని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వంపై విపక్షాలు చేసిన అవిశ్వాస తీర్మానంపై బుధవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్‌కు ఘాటుగా స్మృతి తన స్పందన తెలిపారు. ' సభలో ఆయన ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నా. భరతమాత హత్యకు గురైందంటూ సభలోనే వ్యాఖ్యలు చేయడం పార్లమెంటరీ చరిత్రలో ఇదే తొలిసారి. ఆయన ఇలాంటి తీవ్రవ్యాఖ్యలు చేస్తుంటే తోటి కాంగ్రెస్ సభ్యులు చప్పట్లు కొడుతూ, బల్లలు చరుస్తారా ?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ' నా ముందే ప్రసంగం చేశారు. ముందు వరసలో మహిళా సభ్యులు ఉండగా ఆయన(రాహుల్) గాలిలో ముద్దులు విసిరారు. ఇలాంటి అసభ్య సైగలు గతంలో మరెవరూ చేయలేదు. ఈ (గాంధీ)కుటుంబం సంస్కృతి ఇప్పుడు దేశం మొత్తానికి తెలిసొచ్చింది' అని వ్యాఖ్యానించారు. స్మృతి తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా కొందరు మహిళా బీజేపీ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ ఫ్లయింగ్ కిస్‌పై ఫిర్యాదుచేశారు. కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఆర్టికల్ రద్దు వల్లే అది సాధ్యమైంది

'విపక్ష కూటమి పార్టీ నేత ఒకరు తమిళనాడులో.. భారత్ అంటే ఉత్తరభారతమే అని వివాదాస్పద వ్యాఖ్యచేశారు. దమ్ముంటే ఈ అంశంపై రాహుల్ మాట్లాడారు. మరో నేత కశ్మీర్‌పై రెఫరెండం కోరతారు. ఇలాంటి ప్రకటనలు కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలతో వస్తున్నాయా ?. మీ కూటమి 'ఇండియా' కాదు. భారత్‌లో అవినీతిని పెంచారు' అని ఆవేశంగా మాట్లాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కశ్మీర్‌లో కొనసాగడంపై స్మృతి ఎద్దేవా చేశారు. ' రక్తంతో తడిసిన కశ్మీర్ లోయ అది. యాత్ర పేరుతో అక్కడికెళ్లి స్నో బాల్స్‌తో ఆడుకున్నారు. ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ రద్దుచేయడం వల్లే అక్కడ అల్లర్లు తగ్గి నెలకొన్న ప్రశాంతత కారణంగా మీరు ఆ పని చేయగలిగారు. ఆ ఆర్టికల్‌ను మళ్లీ తెస్తామని అక్కడి వారికి రాహుల్ హామీ ఇచ్చి వచ్చారు. కానీ అది ఎన్నటికీ సాధ్యపడదు. ఆర్టికల్ పునరుద్ధరణ ఉండదు' అని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పాలనలో అత్యయిక స్థితిని స్మృతి గుర్తుచేశారు. ' మీ పాలనా చరిత్ర అంతా రక్తసిక్తం. 1984 సిక్కుల వ్యతిరేక అల్లర్లు, కశ్మీర్‌లో అశాంతి..' అని వ్యాఖ్యానించారు.


'మణిపూర్'పై పార్లమెంట్‌లో అలజడి

న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. లోక్‌సభ బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. వెంటనే విపక్ష ఎంపీలు తమ స్థానాల్లో నిల్చొని మణిపూర్ అంశంపై నినాదాలు ప్రారంభించారు. ప్రధాని సభకు రావాలని డిమాండ్ చేశారు. ఇంతలో స్పీకర్ 'క్విట్ ఇండియా' ఉద్యమకారులకు సభలో నివాళులర్పించారు. 1942 ఆగస్టు 9న జరిగిన ఈ పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఆ త్యాగమూర్తులను ప్రజలంతా స్మరించుకోవాలని అన్నారు. అనంతరం విపక్ష ఎంపీలు మళ్లీ నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి దూసుకొచ్చారు. ప్రశ్నోత్తరాలకు సహకరించాలని స్పీకర్ పలుమార్లు కోరినా వారు లెక్కచేయలేదు. విపక్ష ఎంపీల ఆందోళన మధ్యే స్పీకర్ 45 నిమిషాలపాటు ప్రశ్నోత్తరాలను నిర్వహించారు. సభలో గందరగోళం ఆగకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత అవిశ్వాస తీర్మానంపై చర్చ మొదలైంది.

రాజ్యసభలో రెండు బిల్లులకు ఆమోదం

మణిపూర్ హింసాకాండ వ్యవహారం రాజ్యసభలోనూ అలజడి సృష్టించింది. 267 నిబంధన కింద వెంటనే చర్చ చేపట్టాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. ప్రతిపక్షాల ఆందోళనలు, నినాదాల కారణంగా సభను తొలుత మధ్యాహ్నం 2 గంటల వరకు, తర్వాత 2.45 గంటల దాకా, అనంతరం 3.15 గంటల దాకా వాయిదా వేయాల్సి వచ్చింది. బుధవారం సభలో రాజ్యాంగం(షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్(సవరణ) బిల్లు–2023పై చర్చ జరిగింది. బిల్లును సభలో ఆమోదించారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల కోసం నిధులు సమకూర్చడానికి ఉద్దేశించిన 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు–2023'ని సైతం రాజ్యసభలో ఆమోదించారు. ఈ బిల్లు వర్సిటీల్లో సానుకూల మార్పు తీసుకొస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే క్విట్ ఇండియా ఉద్యమంలో అసువులు బాసినవారికి రాజ్యసభలో నివాళులర్పించారు. వారి ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు.

ఆ రాజకీయాలను దేశం నుంచి తరిమికొట్టాలి



న్యూఢిల్లీ: అవినీతి నిర్మూలన, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలను భారత్ నుంచి తరిమి కొట్టాలని ప్రజలు నినదిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌పై పరోక్షంగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. స్వాతంత్య్ర పోరాటంలో 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమ సంస్మరణ దినాన్ని బుధవారం బీజేపీ నిర్వహించింది. ఈ సందర్భంగా మూడింటిని దేశం నుంచి తరిమి కొట్టాలని ఒకే స్వరం వినిపిస్తోందని ప్రధాని చెప్పారు. 'అవినీతిని దేశం నుంచి తరిమేయాలి. వారసత్వ రాజకీయాలను, బుజ్జగింపు రాజకీయాలను కూడా తరిమికొట్టాలి'' అని ప్రధాని బుధవారం ఒక ట్వీట్‌లో వెల్లడించారు. మరోవైపు బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రయోజనాలు పరిరక్షించాలంటే అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలకు చోటు ఉండకూడదని అన్నారు.

మణిపూర్ మంటలు మోదీకి ఇష్టం

రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ ధ్వజం


జైపూర్: అధికార బీజేపీ సైద్ధాంతిక భావజాలమే మణిపూర్‌ను మంటల్లోకి నెట్టిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. అమాయక ప్రజలను చంపేశారని, మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రధాని మోదీ నిజంగా తలచుకొంటే రెండు మూడు రోజుల్లో మణిపూర్ మంటలు ఆరిపోతాయని చెప్పారు. కానీ, ఆ మంటలు అలాగే చెలరేగాలని మోదీ కోరుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా రాజస్తాన్‌లోని మన్‌గఢ్ ధామ్‌లో బుధవారం కాంగ్రెస్ ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. మణిపూర్‌ను ప్రధాని మోదీ రెండు విభజించారని ఆరోపించారు. గత మూడు నెలలుగా మణిపూర్ భారతదేశంలో ఒక భాగంగా లేనట్లు కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులను బీజేపీ నేతలు 'ఆదివాసీ' అని కాకుండా 'వనవాసీ' అని సంబోధిస్తూ అవమానిస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. గిరిజనులకు చెందిన అడవులను బలవంతంగా లాక్కొని అదానీకి కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. గిరిజనులకు హక్కులు దక్కాలని, వారి ఆకాంక్షలు నెరవేరాలని కాంగ్రెస్ కోరుకుంటోందని వివరించారు.

మరోసారి చంద్రయాన్‌-3 కక్ష్య తగ్గింపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చందమామ చుట్టూ చక్కర్లు కొడుతున్న ఇస్రో వారి చంద్రయాన్‌–3 వ్యోమనౌక కక్ష్యను మరోసారి తగ్గించారు. చంద్రుడికి దగ్గరగా 174 కిలోమీటర్లు, దూరంగా 1,437 కిలోమీటర్ల దూరంలో ఉండే దీర్ఘ వృత్తాకార చంద్ర కక్ష్యలోకి చంద్రయాన్‌–3ని ప్రవేశపెట్టారు. మూడోసారి బుధవారం మధ్యాహ్నం 1.35 గంటలకు కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను విజయవంతంగా ఇస్రో నిర్వహించింది. బుధవారం బెంగళూరులోని ఇస్ట్రాక్ కేంద్రంలోని శాస్త్రవేత్తలు ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 12.30 లోపు మరోసారి కక్ష్య దూరాన్ని తగ్గిస్తామని ఇస్రో ప్రకటించింది. కక్ష్య దూరాన్ని తగ్గిస్తూ చివరకు వంద కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి వ్యోమనౌకను తీసుకొస్తారు. ఆ తర్వాత కమాండ్‌ను పంపి ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్, రోవర్‌లను విడదీస్తారు. ల్యాండర్ నెమ్మదిగా చంద్రుడిపై దిగుతుంది.

ఇక మాది కేరళం రాష్ట్రం !

తిరువనంతపురం: రాష్ట్రం పేరును కేరళంగా మార్చుకోవాలని కేరళ శాసనసభ తీర్మానించింది. దీనికి సంబంధించి బుధవారం కేరళ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. 'రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లోసహా అన్ని భాషల్లో, అన్ని ప్రభుత్వ దస్త్రాల్లో తమ రాష్ట్రం పేరును కేరళం అని మార్చండి., అందుకు అనుమతి ఇవ్వండి' అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. 'మలయాళం భాషలో రాష్ట్రాన్ని కేరళం అనే సంబోధిస్తారని సీఎం గుర్తుచేశారు. 'జాతీయోద్యమ కాలం నుంచి శక్తివంతమైన వర్గంగా ఉన్న మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను సాధించాల్సిన సమయం ఆసన్నమైంది' అని ముఖ్యమంత్రి విజయన్ అన్నారు.



ఈ గది నుంచి బయటకు తెండి

కారాగారంలో ఇమ్రాన్ ఖాన్ ఆవేదన



ఇస్లామాబాద్: ప్రభుత్వ కానుకల అక్రమ అమ్మకం కేసులో దోషిగా తేలి జైలు ఊచలు లెక్కిస్తున్న పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తాను ఉంటున్న జైలు గదిపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. అటోక్ జైలుకొచ్చిన తన లాయర్‌తో మాట్లాడారు. ' నేనీ గదిలో ఉండలేను. బయటకు తీసుకెళ్లండి' అని ఖాన్ బాధపడ్డారు. కాగా, జైలు అధికారులకు, ఖాన్‌కు మధ్య రహస్య కోడ్ సంభాషణలు జరుగుతున్నాయన్న కథనాల నేపథ్యంలో అటోక్ జైలు యంత్రాంగం ఒక భద్రతా ఆడిట్‌ను చేపట్టనుంది.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 10 । ఆగస్టు । 2023



హవ్వ.. చెట్లను కొట్టేసి..
హరితహారంలో భాగంగా మొక్కలు నాటేం దుకు పార్కులో ఉన్న చెట్లను కొట్టేస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. -8లో



‘చాయ్ విత్ అజర్ భాయ్’లో ఉద్రిక్తత
జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో బుధవారం మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ చేపట్టిన ‘చాయ్ విత్ అజర్ భాయ్’ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. -8లో

ఏజీ వర్సిటీలో ‘నా దేశం.. నా మట్టి’



కొండా లక్ష్మణ్ వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ‘మేరీ మిట్టీ, మేరా దేశ్’ (నా దేశం, నా మట్టి) కార్యక్రమాన్ని నిర్వహించారు. -8లో

న్యూస్‌రీల్

పబ్‌లో బౌన్సర్ల దాడి: ముగ్గురికి గాయాలు

గచ్చిబౌలి: శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లోని ఎయిర్‌లైవ్ పబ్‌లో బౌన్సర్లు దాడి చేయడంతో ముగ్గురు కస్టమర్లకు గాయాలయ్యాయి. గచ్చిబౌలి సీఐ జేమ్స్‌బాబు కథనం ప్రకారం.. మంగళవార ం రాత్రి సీతాఫల్‌మండికి చెందిన నిషాంత్ గౌడ్, సాయి కుమార్ యాదవ్, శివారెడ్డిలు కలిసి ఎయిర్ లైవ్ పబ్‌కు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత వారు బయటి వచ్చి తిరిగి రాత్రి 11.30 గంటల సమయంలో పబ్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా బౌన్సర్లు అనుమతించలేదు. కావాలంటే అదనంగా డబ్బు చెల్లిస్తామని చెప్పగా మాటా మాటా పెరిగింది. తోపులాట జరగడంతో బౌన్సర్లు, మేనేజ్‌మెంట్ సభ్యులు కర్రలు, స్టీల్ స్కేల్‌తో దాడికి పాల్పడ్డారు. దీంతో నిషాంత్ గౌడ్‌కు తలకు గాయం కాగా సాయి కుమార్, శివా రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. డబ్బులు తీసుకొని కొట్టారని, దాడి చేస్తుంటే వీడియో తీస్తుండగా ఐ ఫోన్‌ను పగులగొట్టారని బాధితుడు నిషాంత్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై ఐపీసీ 324, 427, రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దాడి పాల్పడిన వారికి అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

నిఖత్ జరీన్‌కు ‘మహీంద్రా థార్’ అందజేత



గచ్చిబౌలి: ట్రెండింగ్‌లో ఉన్న మహీంద్రా థార్ కారు అంటే ఎంతో ఇష్ట మని మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడలోని వీవీసీ మోటార్స్ మహీంద్రా షో రూమ్‌లో మహీంద్రా ఎమర్జింగ్ బాక్సింగ్ ఐకాన్ అవార్డు విజేత జరీన్‌కు థార్ కారును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023 ఐబీఏ మహిళల బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో విజేతగా నిలిచినందుకు ఇచ్చిన మాట ప్రకారం మహీంద్రా గ్రూపు థార్ కారును అందజేసిందన్నారు. మొదట మారుతి జెన్ కారును వాడేదాన్ని అని, మెర్సిడెస్ కొనాలని అనుకున్నప్పటికీ టెండింగ్‌లో థార్ దక్కిందన్నారు. మహీంద్రా సౌత్ జోనల్ హెడ్ రాయ్ మాట్లాడుతూ.. రెండు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్‌కు థార్ కారును బహూకరించడం గర్వంగా ఉందన్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా బాక్సింగ్ క్రీడా కారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మహీంద్రా రీజినల్ సేల్స్ హెడ్ అభిషేక్ , వీవీసీ మోటార్స్ ఎండీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కోటలో పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు

గోల్కొండ: గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ పంద్రాగస్టు రోజున జాతీయ జెండాను ఇక్కడ ఆవిష్కరించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి వేడుకల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ముందుగా రాణీమహల్ ముందు కోటలోని ఇబ్రహీం మసీదు ప్రాంగణం వద్ద పతాకావిష్కరణ వేదికను సిద్ధం చేస్తున్నారు. వీఐపీల కోసం షెడ్‌ల పనులు జోరుగా సాగుతున్నాయి. మరో వైపు కోటను విద్యుద్దీపాలతో అలంకరించేందుకు ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి.

ఉప్పల్- వరంగల్ రహదారి మరమ్మతులు షురూ

ఉప్పల్: వరంగల్ జాతీయ రహదారి మరమ్మతుల పనుల్ని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ప్రారంభించారు. ఆరేళ్ల క్రితం రహదారిని తవ్వి వదిలేయడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఎట్టకేలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ఈ సమస్య రావడంతో చొరవ తీసుకున్నాయి. ‘సాక్షి’లో ప్రచురితమైన కథనాలపై స్థానిక ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు మంజూరు కావడంతో ఎట్టకేలకు వాహన దారులకు మోక్షం కలగనుంది. ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. యుద్ధ ప్రాతిపదికన పనుల్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గాయత్రీ కన్‌స్ట్రక్షన్స్ ప్రాజెక్టు మేనేజర్ అశోక్, ఏఈ గోపీకృష్ణ పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ భవన్‌లో బుధవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను కళ్లకు కట్టాయి.

ఆదివాసీ.. ఆనందమేసీ..

ఔరా! అయిదుగురే?



బీసీ బంధు అమలులో అంతులేని నిర్లక్ష్యం

- ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 20వేల పైనే
- మొదటి విడతకే దిక్కూదివాణం లేదు
- దరఖాస్తుల విచారణ నత్త నడకన
- ముందుకు సాగని లబ్ధిదారుల ఎంపిక
- పట్టించుకోని జిల్లా అధికార యంత్రాంగం

‘ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ, అభివృద్ధి పథకాలను త్వరితగతిన అర్హులైన ప్రజలకు అందించడమే ప్రధాన లక్ష్యం’.

25 రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి చెప్పిన మాటలివి.



హైదరాబాద్ జిల్లాలో ఇలా

మండలం	దరఖాస్తులు
అంబర్‌పేట	2272
అమీర్‌పేట	324
ఆసిఫ్‌నగర్	3011
బండ్లగూడ	2519
బహదూర్‌పురా	626
చార్మినార్	131
గోల్కొండ	355
హిమాయత్‌నగర్	1049
ఖైరతాబాద్	1761
మలక్‌పేట	11
మారేడుపల్లి	1072
ముషీరాబాద్	2223
నాంపల్లి	1186
సైదాబాద్	1382
సికింద్రాబాద్	785
షేక్‌పేట	1470
తిరుమలగిరి	547

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు సాక్షాత్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. జిల్లా పరిపాలనాధీశుడి పర్యవేక్షణ లోపం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరు నత్తకు నడకలు నేర్పిస్తోంది. జిల్లా మంత్రులు సైతం కేవలం మొక్కుబడి సమీక్ష సమావేశాలకు పరిమితం కావడంతో ప్రభుత్వ ఫలాలు పేదలకు అందని ద్రాక్షగా మారుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ సర్కారు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీసీ వర్గాల్లోని కుల, చేతి వృత్తులపై ఆధార పడిన నిరుపేదలకు స్వయం ఉపాధి కోసం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీకి హైదరాబాద్ జిల్లాలో ఆదిలోనే హంసపాదుగా మారింది. బీసీ బంధు పథకం ప్రారంభించి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు కేవలం అయిదుగురికి మాత్రమే రూ. లక్ష ఆర్థిక సాయం అందించడం పథకం అమలు తీరును ప్రశ్నిస్తోంది. నగర పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మాత్రం ఇప్పటికే మొదటి విడత పంపిణీ పూర్తయి రెండో విడత కసరత్తు సాగుతున్నా... హైదరాబాద్ జిల్లా యంత్రాంగం మాత్రం పూర్తిగా వెనుకబడింది.

లాంఛనానికే పరిమితం..


తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రకటించిన రూ. ఒక లక్ష ఆర్థిక సాయం చేయూత పంపిణీ జిల్లాలో లాంఛనానికే పరిమితమైంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 9న అంబర్‌పేటలో మంత్రి చేతుల మీదుగా అయిదుగురు సభ్యులకు రూ.లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. వాస్తవంగా అప్పట్లోనే ప్రతి నియోజకవర్గంలో 50 మంది చొప్పున ఆర్థిక సాయం అందించాల్సి ఉండగా ఆచరణలో మాత్రం అమలు లేకుండా పోయింది. ప్రభుత్వం ఇది నిరంతర ప్రక్రియ అంటూ ప్రతినెలా నియోజకవర్గానికి 300 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి సహాయం అందిస్తామని స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలో మాత్రం మొదటి విడత పంపిణీకే దిక్కు లేకుండా పోయింది.

విచారణ అంతంతే..

బీసీ బంధు పథకం కింద రూ. లక్ష ఆర్థిక సాయం కోసం వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తులపై క్షేత్ర స్థాయి విచారణ ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన గడువులో హైదరాబాద్ జిల్లాలో మొత్తం మీద 20,724 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆధార్ ఆధారంగా వారి ఆర్థిక స్థితిగతులను పరిశీలించి అర్హులను గుర్తించాల్సి ఉంది. వాస్తవంగా ఈ పథకం కింద బీసీల్లోని కుల వృత్తులు చేసుకునే వారిలో అత్యంత నిరుపేద కుటుంబాలను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం గడచిన అయిదేళ్లలో రూ.50 వేలకు పైబడి ఎవరైనా ఆర్థికసాయం పొందారా.. లేదా అనే విషయాన్ని పరిశీలించడంతో పాటు అత్యంత నిరుపేదలు, దివ్యాంగులు, వితంతువులకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అధికారుల నిర్లక్ష్యమో.. సిబ్బంది కొరతో తెలియదు గానీ.. రెండు నెలలు గడిచినా దరఖాస్తులపై క్షేత్ర స్థాయి విచారణ పూర్తి కాకపోవడం విస్మయానికి గురిచేసోంది. దీంతో తొలి విడత లబ్ధిదారుల ఎంపికే పూర్తికాని పరిస్థితి నెలకొంది.

మీ పేరుందా.. లేదా?

- ఓటరు జాబితాలో సరి చూసుకోండి
- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్



సాక్షి, సిటీబ్యూరో: రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం అర్హులైన ఓటర్లు తమ పేరును జాబితాలో ఉందో లేదో చూసుకోవాల్సిందిగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సూచించారు. తప్పులు, పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా సరిగా ఉండేందుకు నగరవాసులు సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ యంత్రాంగం అన్ని పనులూ చేస్తున్నప్పటికీ, ఓటర్ల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. జాబితాలో పేరు లేని వారు నమోదు చేసుకోవాలని, పేరు ఉన్నప్పటికీ ఏవైనా పొరపాట్లుంటే వాటిని సవరించుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్ ద్వారా వెసులుబాటు కల్పించిందని తెలిపారు. సంబంధిత ఫారాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని రోనాల్డ్ రాస్ కోరారు.

దేని కోసం.. ఏ ఫారం

ఓటరు పేరులోని అక్షరాల్లో (స్పెల్లింగ్స్) ఏవైనా తప్పులు, పొరపాట్లు ఉంటే.. పేరు తప్పుగా ఉన్నా, కుటుంబ సభ్యుల పేర్లు, రిలేషన్, జెండర్‌లకు సంబంధించి పొరపాట్లు ఉన్నా.. పుట్టిన తేదీ, చిరునామా తప్పుగా ఉంటే.. ఒకే కుటుంబంలోని వారి పేర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉంటే.. ఫోన్‌నంబర్ మార్చుకోవాలనుకుంటే.. ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇదివరకు ఓటరు జాబితాలో పేరు ఉండి గతంలో ఓటేసి ఉన్నప్పటికీ, ఇప్పుడు జాబితాలో పేరు లేకపోయినా, తమ ఫొటో బదులు వేరే ఫొటో ఉన్నా, ఇప్పటి వరకు అసలు నమోదు చేసుకోకపోయినా ఫారం- 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పాత ఎపిక్ (ఓటరు గుర్తింపు కార్డు) ఉన్నప్పటికీ ఇప్పుడు జాబితాలో పేరు లేనివారు ఓటు వేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. అలాంటి వారు సైతం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.voters.eci.gov.in లేదా ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా సంబంధిత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నమోదు సందర్భంగా అవసరమైన సహాయం కోసం ఓటర్ హెల్ప్‌లైన్ నంబర్ 1950ను కార్యాలయ పని వేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య సంప్రదించవచ్చని రోనాల్డ్ రాస్ సూచించారు.

అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ అరెస్టు

- రూ.60 లక్షల విలువైన మాదకద్రవ్యాల స్వాధీనం
- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వెల్లడి

కొరియర్‌లో డ్రగ్స్ సరఫరా

సాక్షి, సిటీబ్యూరో: దుస్తుల మధ్య మాదక ద్రవ్యాలు పెట్టి కొరియర్ సర్వీస్‌లు, ప్రైవేట్ బస్సులలో సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ దీపారాం బిష్ణోయ్‌ను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.60 లక్షలు విలువ చేసే 70 గ్రాముల హెరాయిన్, 30 గ్రాముల ఎండీఎంఏ, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నేరస్తుడి ఖాతాలోని రూ.3.21 లక్షల నగదును ఫ్రీజ్ చేశారు. వివరాలను బుధవారం రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడించారు.

- రాజస్థాన్‌కు చెందిన బిష్ణోయ్ కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. కూకట్‌పల్లిలోని ఎల్లమ్మబండలో ఉంటూ ఎస్ఎస్ రెయిలింగ్ గ్రానైట్ వ్యాపారం ప్రారంభించాడు. మాదక ద్రవ్యాలకు బానిసగా మారిన ఇతగాడు క్రమంగా పెడ్లర్‌గా అవతారం ఎత్తాడు. ఈ క్రమంలో రాజస్థాన్‌కు చెందిన డ్రగ్ సప్లయర్ రమేష్ కుమార్‌తో బిష్ణోయ్‌కి పరిచయం ఏర్పడింది. ఇతని నుంచి గ్రాము హెరాయిన్‌ను రూ.5-6 వేలకు కొనుగోలు చేసి, అక్రమ మార్గంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి రూ.8-10 వేలకు విక్రయించి డబ్బు సంపాదించడం మొదలుపెట్టాడు.
- పోలీసుల నిఘా నుంచి తప్పించుకునేందుకు ఆన్‌లైన్‌లో ఆర్డరు తీసుకుంటూ.. ప్రైవేట్ బైక్ షేరింగ్ కంపెనీల ద్వారా డ్రగ్స్‌ను కస్టమర్లకు సరఫరా చేస్తున్నాడు. బుధవారం విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), చైతన్యపురి పోలీసులు టెలిఫోన్ కాలనీ సమీపంలో నిందితుడు బిష్ణోయ్‌ను పట్టుకున్నారు. అతని నుంచి మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించారు. నిందితుడు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, అందులోని డేటాను విశ్లేషిస్తున్నారు. పలువురు ప్రైవేట్ షేరింగ్ కంపెనీల ప్రతినిధులను కూడా నిందితులుగా చేర్చనున్నారు.



కార్లు కాజేసి.. రూపు మార్చేసి

అంతర్రాష్ట్ర వాహన చోరీ ముఠా ఆటకట్టు

- ఢిల్లీ, పుణె, హరియాణాల్లో దొంగతనం
- తెలంగాణ, మహారాష్ట్రల్లో విక్రయం
- ఏడుగురు నిందితుల అరెస్టు
- పరారీలో మరో ఏడుగురు
- రూ.3.3 కోట్ల విలువైన 11 వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న స్టీఫెన్ రవీంద్ర

సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీ, పుణె, హరియాణా తదితర రాష్ట్రాల్లో ఖరీదైన కార్లను చోరీ చేస్తారు. వాటి రూపురేఖలు మార్చేస్తారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, అసోం వంటి రాష్ట్రాల్లో విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర వాహన చోరీ ముఠా గుట్టు రట్టయింది. ముఠాలోని ఏడుగురు నిందితులను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.3.3 కోట్ల విలువైన 11 కార్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఆయా వివరాలను సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు.

- కోల్‌కతాకు చెందిన బప్ప ఘోష్ అలియాస్ సోను ఘోష్ ఫార్చునర్, బ్రిజా, క్రెటా వంటి ఖరీదైన కార్లను దొంగిలించి వాటి ఇంజిన్, ఛాసిస్ నంబర్లను మారుస్తాడు. ఆ తర్వాత ఒరిజినల్ నంబరు ప్లేట్‌లను తీసేసి.. దాని స్థానంలో తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హరియాణా, అసోం రాష్ట్రాలకు చెందిన వాహనాల నకిలీ నంబరు ప్లేట్లను అమరుస్తాడు. నకిలీ ఆర్సీలను సైతం సృష్టిస్తాడు. ఆ తర్వాత వీటిని విక్రయించేందుకు వివిధ రాష్ట్రాల్లోని కారు డీలర్లను సంప్రదిస్తాడు.
- మైలార్‌దేవ్‌పల్లికి చెందిన మక్కీ యూఆర్ రెహ్మాన్, నిజాంపేటకు చెందిన కడియం శ్రీనివాస్ రావులు సెకండ్ హ్యాండ్ కార్ల క్రయవిక్రయ వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో వీరిరువురికి బప్ప ఘోష్ ఏజెంట్లయిన ఉత్తరప్రదేశ్‌లోని మీర్‌పేటకు చెందిన అక్షయ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆషబుల్ మోండల్ పరిచయమయ్యారు. దీంతో వీరి ద్వారా బప్ప ఘోష్ నుంచి రెహ్మాన్ రెండు, శ్రీనివాస్ ఏడు కార్లను కొనుగోలు చేశారు. ఈ కార్లను కస్టమర్లకు విక్రయించాలంటే కారు తాలుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) పత్రాలు ఉండాలి. ఆ పత్రాలు నిందితుల వద్ద లేకపోవటంతో పాక్షిక అమౌంట్‌కు కస్టమర్లకు కార్లను విక్రయించి, 2-3 నెలల్లో ఎన్ఓసీ పత్రాలను అందజేస్తామని చెప్పి ఉడాయిస్తుంటారు.
- క్రమంలో బుధవారం ఆరాంఘర్ క్రాస్ రోడ్‌లోని పరివార్ దాబా వద్ద చోరీ చేసిన హ్యుందాయ్ క్రెటా కారును విక్రయించేందుకు నిందితులు సమీర్ అహ్మద్, ఆశబుల్ మోండల్‌లు వస్తుండగా.. విశ్వసనీయ సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వారిని పట్టుకున్నారు. వారిని విచారించగా అసలు విషయాలు బయటకు వచ్చాయి. దీంతో ఏడుగురు నిందితులు మక్కీ యూఆర్ రెహ్మాన్, శ్రీనివాస్ రావులతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని మీర్‌పేటకు చెందిన సమీర్ అహ్మద్, ఆశిష్ సూద్, అక్షయ్, అక్షయ్ సూద్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆషబుల్ మోండల్‌లను అరెస్టు చేశారు. కోల్‌కత్తాకు చెందిన బప్పఘోష్ అలియాస్ సోను ఘోష్, జాకీర్, అరుణ్ బంగానీ, యూపీకి చెందిన సాజిద్ ఖాన్, ఢిల్లీకి చెందిన పర్వాజ్, శౌర్దాలాల్, అభిషేక్ కుమార్‌లు పరారీలో ఉన్నారు. ఈ ముఠాపై కేపీహెచ్‌బీ, చిలకలగూడ, మిర్యాలగూడ రూరల్‌లతో పాటు ఢిల్లీ, హరియాణా, పుణెల్లో 8 కేసులు నమోదయ్యాయి.

రైల్లో వస్తారు.. బైకేసుకెళ్తారు



నిందితులు భాస్కర్ బోయిని శ్రీకాంత్ మెట్టు శ్రీకాంత్

- ముగ్గురు పాత నేరస్తులు అరెస్టు
- 27 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: వికారాబాద్ జిల్లా తాండూరు నుంచి హైదరాబాద్‌కు రైలులో వస్తారు. ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగిలించి, రూ.5-6 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఘరానా నిందితులను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.22.20 లక్షల విలువ చేసే 27 బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను బుధవారం సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మీడియాకు వెల్లడించారు.

- వికారాబాద్ జిల్లా కమాల్‌పూర్‌నకు చెందిన బోయిని శ్రీకాంత్, మేతారి భాస్కర్, మెట్టు శ్రీకాంత్‌లు పాత నేరస్తులు. బైక్‌లు దొంగిలించి, సొమ్ము చేసుకోవటం వీరి స్టైల్. ఈ ముగ్గురు నిందితులపై ఇప్పటికే సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్లలో 15 కేసులున్నాయి. గతేడాది అరెస్టయి జైలుకు వెళ్లి వచ్చినా వీరి ప్రవృత్తిలో మార్పు రాలేదు.
- తాండూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చి జన సంచారం తక్కువగా కాలనీలు, ప్రాంతాలను ఎంపిక చేసుకుంటారు. రెక్కీ నిర్వహించి అర్ధరాత్రి వేళలలో ఎంపిక చేసిన ప్రాంతానికి వెళతారు. నకిలీ తాళాలను ఉపయోగించి బైక్ లాక్‌ను ఓపెన్ చేసి, అక్కడి నుంచి ఉడాయిస్తారు. చోరీ చేసిన బైక్‌లను వికారాబాద్ జిల్లా శివారు ప్రాంతాలలో అమాయకులకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈక్రమంలో దర్యాప్తు ప్రారంభించిన బాలానగర్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), జీడిమెట్ల పోలీసులు బోయిని శ్రీకాంత్, భాస్కర్, మెట్టు శ్రీకాంత్‌లను అరెస్టు చేశారు.

ఫోన్లు కొట్టేసి.. ఐఎంఈఐ నంబర్లు మార్చేసి

మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠా

- ఏపీ, కర్ణాటకలో మొబైల్ దొంగతనాలు
- హైదరాబాద్‌కు తీసుకొచ్చి విక్రయం
- ఆర్టీసీ మాజీ ఉద్యోగి అరెస్టు
- 563 సెల్‌ఫోన్లు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో సెల్‌ఫోన్లను దొంగతనం చేసి, వాటిని హైదరాబాద్‌కు తరలించి, ఐఎంఈఐ నంబర్లు మార్చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. రూ.3 లక్షల నగదుతో పాటు రూ.1.92 కోట్ల విలువైన వివిధ బ్రాండ్లకు చెందిన 563 సెల్‌ఫోన్లు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలను మాదాపూర్ డీసీపీ సందీప్ వివరించారు.

ఏపీలోని కడపకు చెందిన గారడీ రామాంజీ చదువు పూర్తయ్యాక హైదరాబాద్‌కు వచ్చి ఎల్బీనగర్‌లో స్థిర పడ్డాడు. 1995లో ఫలక్‌నుమా డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. జీతం సరిపోకపోవడంతో 2005లో ఉద్యోగం మానేసి.. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగాడు. భారీగా నష్టాలు రావటంతో జీవనం కష్టంగా మారింది. జేబు దొంగల నుంచి సెల్‌ఫోన్లను తక్కువ రేటుకు కొనుగోలు చేసి, వాటిని హైదరాబాద్‌లో విక్రయించి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో జేబుదొంగలైన ఆంధ్రప్రదేశ్‌లోని ఆకివీడుకు చెందిన ఆకాశ్, సన్నీ, కర్ణాటకకు చెందిన వంశీ అలియాస్ రియాలు, హైదరాబాద్‌కు చెందిన ఆసిఫ్, అర్షద్‌లు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ గ్యాంగ్ గత 15-17 ఏళ్లుగా సెల్‌ఫోన్లను కొట్టేసి, ఐఎంఈఐ నంబర్లను మార్చేసి, స్థానికంగా విక్రయిస్తోంది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లు

కేవలం ఆండ్రాయిడ్ ఫోన్లు మాత్రమే..

ఆకాశ్, సన్నీ, వంశీల నుంచి రామాంజీ కేవలం ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లను మాత్రమే కొనుగోలు చేస్తారు. రూ.10 వేల సెల్‌ఫోన్‌ను రూ.2 వేలకు కొనుగోలు చేస్తాడు. వీటిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఆసిఫ్, అర్షద్‌లకు ఒక్కో ఫోన్ మీద రూ.1,000 కమీషన్‌తో అమ్మేస్తాడు. వీరిరువురు సికింద్రాబాద్, కోఠి ప్రాంతాలలో సెల్‌ఫోన్ రిపేరింగ్ సెంటర్ల వారితో ఒప్పందం చేసుకొని.. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల సహాయంతో ఫోన్ల లాక్‌లు, ఐఎంఈఐ నంబర్లను మార్చేస్తారు. ఆ తర్వాత వీటిని నిరుద్యోగులకు, గ్రామీణులకు తక్కువ ధరకు విక్రయిస్తుంటారు. ఒక్క సెల్‌ఫోన్ మీద రూ.5-7 వేలు కమీషన్ వస్తుంటుంది.

విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), రాయదుర్గం పోలీసులు రామాంజీ ప్రయాణిస్తున్న హ్యుందాయ్ క్రెటా కారును పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా 4 తెలుపు రంగు థర్మాకోల్ డబ్బాలు, 3 నలుపు రంగు డబ్బాలను గుర్తించారు. వాటిని తెరిచి చూడగా 563 స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. రామాంజీ అరెస్టు కావడానికి మూడు రోజుల ముందే 300 ఫోన్లను విక్రయించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. గతంలో ఇతనిపై శామీర్‌పేట పీఎస్‌లోనూ సెల్‌ఫోన్ దొంగతనం కేసు, అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణాలో భూ కబ్జా కేసు నమోదయింది. ఆయా కేసులలో జైలుకు వెళ్లిన కూడా రామాంజీ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.

హవ్వ.. చెట్లను కొట్టేసి మొక్కలు నాటుతారట?

జూబ్లీహిల్స్ రోడ్ నెం. 72లో పార్కులో నేలకూలిన 20 చెట్లు


జూబ్లీహిల్స్ రోడ్ నెం. 72లో జీహెచ్ఎంసీ పార్కులో నరికేసిన చెట్లు

బంజారాహిల్స్: హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు పార్కులో ఉన్న చెట్లను కొట్టేసిన వైనమిది. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 72లోని జీహెచ్ఎంసీ పార్కులో గత రెండు, మూడు రోజులుగా భారీ చెట్లను కొట్టేస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉన్న చెట్లను కొట్టేసి కొత్తగా మొక్కలు నాటడం ఏంటని అధికారుల తీరుపై విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 72లో ప్రశాసన్‌నగర్ రోడ్డులో ఈ విశాలమైన పార్కులో దశాబ్దాలుగా చెట్లు పెరుగుతున్నాయి. అయితే హరితహారంలో 2 వేల మొక్కలు నాటేందుకు సంబంధిత యూబీడీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ మొక్కలు నాటేందుకు ఈ పార్కులో సుమారుగా 20 భారీ చెట్లను కొట్టేశారు. ఇదేమిటని కాలనీవాసులు అడిగితే మాకేమి తెలియదంటూ చేతులెత్తేశారు. కొట్టేసిన చెట్ల కొమ్మలను అక్కడి నుంచి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది. జీహెచ్ఎంసీ సర్కిల్–18 యూబీడీ నిర్వాహకులు ఈ వ్యవహారంపై నోరుమెదపడం లేదు. కాంట్రాక్టర్ కొట్టేశాడని అటవీ శాఖాధికారులకు చెప్పి కేసు నమోదు చేయిస్తామంటూ బుకాయించారు. ఇన్ని చెట్లు కొట్టేశాక కేసు పెడితే ఉపయోగం ఏంటంటూ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశం అయింది. హరితహారం సమయంలో పచ్చని చెట్లను కొట్టేయడం ఏ మేరకు సమంజసమో జీహెచ్ఎంసీ అధికారులే తెలపాలంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కథల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం


అవార్డులతో విద్యార్థులు

బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం 'కథ చెబుతారా ఊ కొడతాం' నీతి కథల పోటీలు హిమాయత్‌నగర్‌లోని టీటీడీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. జూనియర్స్ విభాగం 5–10లో 36 మంది విద్యార్థులు 10–15 సీనియర్స్ విభాగంలో 41 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో విద్యాభారతి స్కూల్ 8వ తరగతి విద్యార్థిని కృతిక మొదటి బహుమతిని, బ్రిలియంట్ గ్రామర్స్ స్కూల్ విద్యార్థిని ఫణిశ్రీ ద్వితీయ బహుమతి, విద్యాభారతి స్కూల్ 8వ తరగతి విద్యార్థిని పి.రక్షిత తృతీయ బహుమతి గెలుచుకున్నారు. జూనియర్స్ విభాగంలో హిందూపబ్లిక్ స్కూల్ యూకేజీ విద్యార్థి కె.జ్ఞానవేద మొదటి బహుమతి, 5వ తరగతి విద్యార్థిని కె.నేహానంది ద్వితీయ బహుమతి, రమాదేవి పబ్లిక్ స్కూల్ 4వ తరగతి విద్యార్థిని టి.జయశ్రీ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సహాయ కార్యనిర్వహణాధికారి చతుర్వేదుల సత్యనారాయణ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎ.విజయలక్ష్మి, ప్రోగ్రామ్ అసిస్టెంట్ గూడూరు హరినాథ్, ధర్మ ప్రచార మండలి సభ్యులు టి.సురేందర్, కత్రి హరిలాల్, ధనలక్ష్మి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

29న హైబిజ్ ఫుడ్ అవార్డ్స్


బ్రోచర్, ట్రోఫీని ఆవిష్కరిస్తున్న హైబిజ్ నిర్వాహకులు, నటి కిషోరి ధాత్రక్

బంజారాహిల్స్: హైబిజ్ టీవీ ఫుడ్ అవార్డ్స్–2023 రెండో ఎడిషన్‌కు సంబంధించిన పోస్టర్, ట్రోఫీ ఆవిష్కరణ మాసబ్ ట్యాంక్‌లోని గోల్కొండ హోటల్‌లో నిర్వహించారు. నగరంలో ఫుడ్‌గ్రాఫ్‌ను అత్యున్నత స్థాయికి తీసుకొచ్చిన వారిని గుర్తించి వారికి ఈ అవార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 22 నామినేషన్ చివరి తేదీ అని హైబిజ్ టీవీ ఎండి ఎం. రాజగోపాల్ తెలిపారు. ఆహార పరిశ్రమలో ఉన్న వారు నామినేషన్లు చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఎంపికైన వారికి ఆగస్టు 29వ తేదీన బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సురేష్ చిట్టూరి, చేతన్, నటి కిషోరి ధాత్రక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు అసభ్యకర మెస్సేజ్‌లు
– స్కూల్ ప్రిన్సిపాల్ అరెస్టు

గోల్కొండ: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ ప్రిన్సిపాల్ తన వద్ద చదువుకున్న విద్యార్థినికి అసభ్యకర మెస్సేజ్‌లు పంపి వేధించాడు. చివరకు బండారం బయటపడి పోలీసులకు చిక్కాడు. ఈ సంఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నదీమ్‌కాలనీలో కేంబ్రిడ్జి క్రియేటివ్ పాఠశాలను అహ్మద్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. కాగా ఈ పాఠశాలకు అహ్మద్ అలీ (25) ఇన్‌చార్జిగా(ప్రిన్సిపాల్) విధులు నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం ఈ పాఠశాలలో ఓ బాలిక (15) టెన్త్ చదివింది. గత కొంత కాలంగా అహ్మద్ అలీ ఈ బాలిక ఫోన్ నెంబర్‌కు అసభ్య మెసేజ్‌లు పెడుతున్నాడు. చివరకు సులువుగా డబ్బు సంపాదించే మార్గం చెబుతానంటూ నమ్మబలికాడు. తాను చెప్పిన వ్యక్తుల వద్దకు వెళ్తే నీకు డబ్బులు వస్తాయంటూ మాయమాటలు చెప్పాడు. ఈ విషయంపై బాలిక వెంటనే తన తల్లిదండ్రులకు తెలుపగా..వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అహ్మద్ అలీ, బాధిత బాలిక ఫోన్లు స్వాధీనం చేసుకోని విచారించారు. అనంతరం అహ్మద్ అలీపై కేసు నమోదు చేసి మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

'చాయ్ విత్ అజర్ భాయ్'లో ఉద్రిక్తత

- అజహర్ వాహనాలను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులు
- దాదాపు రెండుగంటల పాటు హంగామా
- లాఠీచార్జి చేసిన పోలీసులు


వాహనాలను అడ్డుకుంటున్న పార్టీ నాయకులు

రహమత్‌నగర్: టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ, క్రికెట్ టీం ఇండియా మాజీ సారథి అజహరుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో బుధవారం చేపట్టిన 'చాయ్ విత్ అజర్ భాయ్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు దాదాపు రెండు గంటల పాటు అజహరుద్దీన్‌ను అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు భవానీశంకర్ వర్గీయులు, విష్ణువర్ధన్ రెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భవానీ శంకర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఎస్పీఆర్‌హిల్స్‌లో చాయ్ విత్ అజర్ భాయ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తమకు సమాచారం లేకుండా అజహరుద్దీన్ ఎలా వస్తారంటూ విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు అంతకుముందే రెండు బొమ్మల వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. ఆ సమయంలో ఎస్పీఆర్‌హిల్స్ రెండు బొమ్మల వద్దకు అజహరుద్దీన్, భవానీశంకర్‌లు వాహనాల్లో చేరుకున్నారు.


వాహనంలోనే ఉండిపోయిన అజహరుద్దీన్

విష్ణు వర్గీయులు ఒక్కసారిగా అజహరుద్దీన్ వాహన శ్రేణిని అడ్డుకున్నారు. దీంతో అజహరుద్దీన్, భవానీశంకర్‌లు వాహనాల్లో ఉండిపోయారు. వారి వాహనాలకు రక్షణగా కార్యకర్తలు నిలిచారు. దాదాపు రెండు గంటల పాటు ఇద్దరు నాయకులు వాహనాల్లోనే ఉండిపోయారు. దీంతో ఇరు వర్గాల నడుమ తోపులాట జరిగింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్ఆర్‌నగర్ డీసీపీ వెంకటేశ్వర్ రావు, బోరబండ, మధురానగర్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు కామల్ల రవికుమార్, శ్రీనివాస్ ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎంతకీ వినకపోవడంతో చివరికి లాఠీచార్జీ చేసి వాహనాలను అక్కడ నుండి పంపించారు. చివరికి కార్యక్రమంలో పాల్గొనకుండానే అజహరుద్దీన్ వెళ్లిపోయారు. అనంతరం కొందరు కార్యకర్తలు ఇందిరాగాంధీ బొమ్మ వద్ద విష్ణు అనుచరులు ఏర్పాటు చేసిన టెంట్‌ను తొలగించి, బ్యానర్లను చించి వేసి ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేశారు.

కుమారుడు పరీక్షలో తప్పాడని..తల్లి ఆత్మహత్య

జీడిమెట్ల: కుమారుడు పరీక్షలో ఫెయిల్ అయ్యాడని మనస్తాపం చెందిన ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎం.పవన్ వివరాల ప్రకారం..గాజులరామారం బాలాజీ ఎన్‌క్లేవ్‌లో ఉండే పుష్పజ్యోతి (41), నాగభూషణం దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో ఒక కుమారుడు సీఏ అర్హత పరీక్ష రాశాడు. కానీ పరీక్షలో తప్పడంతో మనోవేదనకు గురైన పుష్పజ్యోతి బుధవారం ఉదయం బెడ్‌రూంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందింది. పుష్పజ్యోతి ఇంట్లో నుండి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు లోపలికి వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది. మృతురాలి భర్త నాగభూషణం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వారం రోజుల్లో విచారణ జరిపి అర్హుల జాబితా


బీసీ బంధుపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తలసాని

– బీసీ బంధుపై సమీక్షలో మంత్రి తలసాని

సాక్షి, సిటీబ్యూరో: బీసీ కుల వృత్తి దారుల నుంచి రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం వచ్చిన దరఖాస్తులపై వారం రోజులలో సమగ్ర విచారణ జరిపి అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించి అందజేయాలని సంబంధిత అధికారులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి బీసీ బంధు పథకం అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ వివిధ కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. నూతనంగా నాయీబ్రాహ్మణులు, రజకులు, కుమ్మరి, కంసలి, కమ్మరి, కంచర, వడ్రంగి, పూసల, మేదర, వడ్డెర, ఆరెకటిక, మేర తదితర కులవృత్తులకు అర్హులైన ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ముందుగా ఒక్కో నియోజకవర్గ పరిధిలో 300 మందికి లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. ఒకేసారి కాకుండా దశలవారీగా లబ్ధిదారులను గుర్తించి ఆర్థిక సహాయం అందించనున్నట్లు మంత్రి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, మౌజం ఖాన్, కౌసర్ మొయినొద్దీన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, బీసీ కార్పొరేషన్ అధికారి ఆశన్న, ప్రాజెక్ట్ ఆఫీసర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ చూడటానికి వచ్చి... గంజాయితో పట్టుబడి...

లంగర్‌హౌస్: ఇంటర్ చదువుతున్న ఓ బాలుడు సినిమా షూటింగ్‌లు చూడటానికి నగరానికి వచ్చి..ఓ అపరిచిత వ్యక్తిని నమ్మి గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. చివరకు జైలుపాలయ్యాడు. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు, ఎస్ఐ రాఘవేంద్రలు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రౌతుల పుడి మండలం, గిడజం గ్రామానికి చెందిన యువకుడు (18) స్థానికంగా ఇంటర్ చదువుతున్నాడు. సినిమా షూటింగ్‌లు చూడటానికి ఇటీవల హైదరాబాద్‌కు వచ్చాడు. ఇక్కడ అన్నపూర్ణ స్టూడియోలో ఓ వ్యక్తి పరిచయమవ్వగా రెండు రోజులు కలిసి మాట్లాడుకున్నారు. సదరు వ్యక్తికి విశాఖపట్నం, అరకు తదితర ప్రాంతాల్లో గంజాయి తక్కువ ధరకు లభిస్తుందని తెలుసు. అక్కడి నుండి నగరానికి తెస్తే గంజాయి వ్యాపారం చేద్దామని తెలిపాడు. నిరుపేద కుటుంబంలో పుట్టిన యువకుడు సులువుగా డబ్బులు సంపాదించవచ్చని భావించి సొంతూరుకు తిరిగి వెళ్లాడు. అతని స్నేహితుడు, లారీ డ్రైవర్ కొప్పనాథి అజయ్‌కుమార్ (25)కు గంజాయి విషయాన్ని తెలిపాడు. ఇద్దరు కలిసి కొంత డబ్బు సేకరించి 16 కిలోల గంజాయి కొన్నారు. అక్కడ నుండి ద్విచక్ర వాహనంపై తూర్పుగోదావరి జిల్లా నుండి నగరానికి చేరుకున్నారు. పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు లంగర్‌హౌస్ సమీపంలో పీవీ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్ 109 వద్ద వీరి వాహనాన్ని నిలిపి తనిఖీలు చేశారు. వీరి వద్ద నుండి ఆరున్నర లక్షల రూపాయల విలువ చేసే గంజాయి, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏజీవర్సిటీలో 'నా దేశం, నా మట్టి'



ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'మేరీ మిట్టీ, మేరాదేశ్' (నా దేశం, నామట్టి) కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి వివిధ రకాలైన 75 రకాల మొక్కలు నాటారు. మొక్కలు నాటిన ప్రాంతానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వనంగా నామకరణం చేశారు. విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ చీనా నాయక్ మాట్లాడుతూ..అమర జవాన్లు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడానికి ప్రధాని మోదీ 'మేరీ మిట్టీ, మేరాదేశ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.

- ఆగస్టు 15న దేశవ్యాప్తంగా 'నా దేశం, నామట్టి' పేరుతో అమరవీరుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా 'అమృత్ కలశ్ యాత్ర' చేపట్టనున్నట్లు వివరించారు.
- కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల నుంచి మట్టి, పవిత్రమైన మొక్కలను పంపిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగామ్ అధికారి ఎన్.ఆర్. సంతోషిని, డాక్టర్ మానసా, సాయికృష్ణ, నిఖిల్, కళాధర్‌బాబు తదితరులు న్నారు.

రాణా వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

మలక్‌పేట: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని గాయపడిన వ్యక్తి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 1వ తేదీన మూసారంబాగ్ తీగలగూడకు చెందిన సోలంకి విజయ్ (25)..తనను ఫారూఖ్ అనే వ్యక్తి చంపేస్తానని బెదిరిస్తున్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే తన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోవడం లేదంటూ అదే రోజు అర్ధరాత్రి విజయ్ మళ్లీ పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గాయపడిన అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తొమ్మిది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు.

పీఎస్ వద్ద భారీ బందోబస్తు

పోలీసుల నిర్లక్ష్యం వలనే విజయ్ మృతి చెందాడని, బాధితుని కుటుంబానికి న్యాయం చేయాలని ఈ సంఘటన జరిగిన మరుసటి రోజున కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు పోలీసులను డిమాండ్ చేశారు. విజయ్ దళితుడని, గర్భవతి అయిన అతని భార్య విజయ భవానిని చంపేస్తానని బెదిరించిన ఫారూఖ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో విజయ్ మృతి వార్త తెలియగానే బుధవారం ముందస్తు జాగ్రత్తగా పీఎస్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుని భార్య విజయభవాని ఫిర్యాదు మేరకు ఫారూఖ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఫారూఖ్‌ను 3వ తేదీన అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే.


'ఏఐఎస్ఎఫ్ చలో సెక్రటేరియట్'లో ఉద్రికత్త

లిబర్టీ: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మీడియా, విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఓకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఛలో సెక్రటేరియట్ కార్యక్రమం తీవ్ర ఉద్రికత్తకు దారితీసింది. బుధవారం లిబర్టీ చౌరస్తా నుంచి విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి సెక్రటేరియట్ ముందు నిరసన చేపట్టారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేజీ టూ పీజీ ఉచిత విద్యను అమలుపరుస్తామని చెప్పిన కేసీఆర్ మాట తప్పారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ లోటుపాట్లను వెలికితీస్తారనే భయంతోనే తప్పుడు జీఓలు జారీ చేసి మీడియాను, విద్యార్థి సంఘాలను అణచివేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటిక్యాల రామకృష్ణ, రహమాన్, గ్యార క్రాంతి, రఘురాం, నాగజ్యోతి, రాజు, వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు మద్దుపల్లి లక్ష్మణ్, పి.శివ, మురళి, అన్వర్, వనమా ఆంజనేయులు, శరత్, వెంకటేష్, శ్రవణ్, లోకేష్, ప్రేమ్, చైతన్య, హరీష్, అక్రమ్, రమగల్ల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈసందర్భంగా విద్యార్థి నేతలను పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి తరలించారు.


ర్యాలీ చేపట్టిన నాయకులు


విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

స్థిరమైన వృద్ధి దిశగానే తెలంగాణ అడుగులు
– ఐటీ శాఖ మంత్రి కేటీఆర్



శంషాబాద్: అన్ని రంగాల్లో స్థిరమైన వృద్ధి దిశగానే తెలంగాణ రాష్ట్రం అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం ఆయన తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్, బర్మింగ్‌హామ్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ సస్టైనబుల్ కూలింగ్, జీఎంఆర్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించనున్న కోల్డ్ చైన్ జీఎంఆర్ ఇన్నోవెక్స్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఫార్మా రంగానికి కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌కు కోల్డ్‌చైన్ విస్తరణ మరింత అవసరముందన్నారు. కోల్డ్ చైన్ ద్వారా వ్యవసాయ రంగంలోని ఉత్పత్తులకు మరింత విలువను జోడించేందుకు అవకాశముందన్నారు. ఇది రైతులకు ఎంతో లాభదాయకంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

జాతీయ పతాకావిష్కరణలో విజయారెడ్డి



బంజారాహిల్స్: క్విట్ ఇండియా దినోత్సవ వేడుకలను బుధవారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి ఇక్కడ నిర్వహించిన జాతీయ పతాక ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న జెడ్‌సీ వెంకటేష్

ఫిలింనగర్: మెరుగైన పాలన అందించేందుకు ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల ద్వారా ఉద్యోగులు పౌరులకు మంచి సేవలు అందించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఇక్కడ అందుతున్న సేవలతో పాటు ఉద్యోగులతో మాట్లాడారు. పౌరులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్ చర్చి లైన్‌లో గత వారం రోజులుగా మ్యాన్‌హోళ్లు పొంగుతూ మురుగు ప్రధాన రోడ్డుపై పారుతున్నది. దీంతో స్థానికంగా అపరిశుభ్ర వాతావరణంతో పాటు కంపుకొడుతున్నది. స్థానిక కాలనీవాసులతో పాటు చర్చి నిర్వాహకులు ఈ సమస్యను జలమండలి జీఎం హరి శంకర్‌కు ఫిర్యాదు చేయడంతో బుధవారం తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు స్పందించి కాలనీలో సూపర్ సక్కర్ వాహనంతో మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించారు.

అర్హులందరూ ఓటును నమోదు చేసుకోవాలి




ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాన్ని సందర్శిస్తున్న కవితారెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం .10లోని గౌరీ శంకర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాన్ని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి బుధవారం సందర్శించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఈ నమోదు కేంద్రాలపై స్థానికులకు అవగాహన కలిగించాలన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

వెంగళరావునగర్: చట్ట విరుద్ధంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సమాచారం మేరకు... ఒరిస్సాకు చెందిన సాహు శ్రీధర్ అనే వ్యక్తి ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటుంటాడు. కూలీ పనులు చేసుకుని జీవిస్తూ గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో వారం కిందట ఒరిస్సా వెళ్లి గంజాయిని తీసుకుని వచ్చాడు. ఈ విషయాన్ని కొందరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మాటువేసి అతనిని పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

చేనేత వస్త్రకళా ప్రదర్శనకు స్పందన



మోతీనగర్: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరిస్తే చేనేత కార్మికులకు చేయూత అందించిన వారమవుతామని కళాసిల్క్ చేనేత వస్త్రకళా ప్రదర్శన నిర్వాహకులు సంజయ్, వినోద్‌జైన్ పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే గృహోపకరణాలూ ఉన్నాయన్నారు. ఈ మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

సాధ్యమైన చోట్ల... రోడ్లను విస్తరించాల్సిందే..!

జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ పోలీసులు నాలుగైదు నెలలుగా చేపట్టిన వాహనాల మళ్లింపులతో తలపట్టుకుంటున్న వాహనదారులకు జీహెచ్ఎంసీ అధికారులు పరిష్కారం చూపబోతున్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్‌తో పాటు ట్రాఫిక్ ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్డు విస్తరణతోనే ట్రాఫిక్ ఇక్కట్లను కొంత మేర చెక్ పెట్టవచ్చని ఈ సందర్భంగా నిర్ణయించారు.



కళింగ చౌరస్తాలో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఇతర అధికారులు

- జర్నలిస్టు కాలనీ, కళింగ జంక్షన్ల వద్ద రోడ్డు విస్తరణ చేయాలని కమిషనర్ సూచన
- వాహనాలు సులువుగా ముందుకు వెళ్లేలా ప్రణాళికలు
- త్వరలోనే రోడ్డు విస్తరించే పనులు షురూ
- ప్రతిపాదనలు సిద్ధం చేయనున్న ఇంజినీరింగ్ శాఖ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 70 జర్నలిస్టు కాలనీ చౌరస్తాలో ఓ భవన యజమాని రోడ్డు మీదికి నిర్మించిన ర్యాంప్‌ను కూల్చివేసి రోడ్డును విస్తరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ అధికారులకు సూచించారు. దీనికి తోడు ఇదే చౌరస్తాలో ఉన్న విగ్రహాన్ని పక్కకు తప్పించాలని అన్నారు. ఫుట్‌పాత్‌లను ఆధునీకరించాలన్నారు. అవసరమైన మేర మాత్రమే ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసి మిగతా స్థలాన్ని రోడ్డు విస్తరణకు ఉపయోగించాలని సూచించారు.

కళింగ జంక్షన్‌ను తగ్గించండి...

- బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కళింగ చౌరస్తాలో ట్రాఫిక్ నరకంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇక్కడ సెంట్రల్ మీడియన్‌ను, అగ్రసేన్ విగ్రహం చౌరస్తాను ఎంత మేరకు తగ్గిస్తే బాగుంటుందో ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ సూచించారు.
- మూడు వైపుల నుంచి వాహనాలు తాకిడి అధికంగా ఉండటంతో గతంలో ఇక్కడ ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు.
- అపోలో ఆస్పత్రి వైపు నుంచి వచ్చే వాహనాలను తెలంగాణ భవన్ దాటిన తర్వాత యూటర్న్ తీసుకొని మళ్లీ రోడ్ నెం. 12 వైపునకు అనుమతించినప్పటికీ ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు మాత్రం తగ్గలేదు.
- దీనికి తోడు ఈ చౌరస్తా ఇరుకుగా ఉండటంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. దీంతో ఇక్కడున్న ఐలాండ్‌ను తగ్గించి రోడ్డును వెడల్పు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ సూచించారు.
- కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే, ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబు, డీసీపీ రాహుల్ హెగ్డే, ఎస్ఈ రత్నాకర్, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళికలు అవసరం

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్



యూబీడీ అధికారులు, సిబ్బందితో సమావేశమైన జెడ్‌సీ వెంకటేష్

బంజారాహిల్స్: హరితహారం కార్యక్రమంలో భాగంగా జోన్ పరిధిలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జోన్ పరిధిలోని అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే విషయంలో మనసుకు పెట్టి పని చేయాలని సూచించారు. ఈ ఏడాది 12 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 3.5 లక్షల మొక్కలు నాటినట్లు డీడీ శ్రీనివాస్ ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌కు తెలిపారు. ఈ నెలలోనే 50 శాతానికి పైగా లక్ష్యాన్ని ఛేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. కాలనీలు, బస్తీల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. రోడ్లకు రెండువైపులా పచ్చదనం కనిపించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి శుక్రవారం ఏదో ఒక చోట భారీ ఎత్తున హరితహారం కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. ప్రతి వారం చేసిన పనిపై రివ్యూ మీటింగ్ నిర్వహిస్తామని ఆ రోజు కచ్చితంగా ప్రగతి నివేదికలను సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్–18 యూబీడీ మేనేజర్ బాలయ్య, వివిధ సెక్షన్ల ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు తీరని అన్యాయం: బీజేవైఎం



షేక్‌పేట ఆర్ఐకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న జూబ్లీహిల్స్ బీజేవైఎం నేతలు

శ్రీనగర్‌కాలనీ: బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందని, మోసపూరిత హామీలను ప్రజలను, యువతను మభ్యపెట్టారని, ఇస్తానన్న నిరుద్యోగభృతి ఇవ్వలేదని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేవైఎం నేతలు ఆరోపించారు. ఈ మేరకు యువతను నిరుద్యోగభృతి ఇవ్వకుండా మోసం చేసిన బీఆర్ఎస్‌పై షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ప్రదీప్‌కుమార్‌కు మెమొరండం అందజేశారు. హామీ ఇచ్చిన మొత్తాన్ని నిరుద్యోగ యువతకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ సెక్రటరీ అవినాష్, స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ నీలం రతన్, గణేష్ కుమార్, హరి, పవన్, విగ్నేష్, అనికేత్, రాజేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు యువతకు స్ఫూర్తి

వెంగళరావునగర్: ఆంగ్లేయులకు భారతీయ వాదాన్ని బలంగా తెలియజేసి దేశాన్ని విడిచి పారిపోయేలా చేసిన స్వాతంత్ర సమరయోధులను యువత పోరాటాలు, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని భారతీయ జనతా పార్టీ జూబ్లీహిల్స్ నాయకురాలు కీర్తిరెడ్డి పిలుపునిచ్చారు. క్రాంతి దివస్ (క్విట్ ఇండియా డే)ను పురస్కరించుకుని బుధవారం వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ సీనియర్ నాయకులు బాలప్రకాశ్, అల్లం సంగీత, మధు, అల్లం ఈశ్వర్, శ్రీధర్‌రెడ్డి, గణేష్‌గౌడ్, నర్మద, కళ, ప్రమీల, జ్యోతి, ఇందిర పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కీర్తిరెడ్డి

బీఆర్ఎస్ పాలనలోనే గిరిజనుల సంక్షేమం



కొమురం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: దశాబ్దాలుగా అణిచివేతకు, వెనుకబాటుకు గురైన గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా చేసిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం–10లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గిరిపుత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. కొమురం భీం విగ్రహానికి పూల మాలలు అర్పించారు. అనంతరం దానం మాట్లాడుతూ... రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమంతో పాటు వారి అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తూ వారి సమగ్ర వికాసానికి కార్యాచరణను అమలుచేస్తున్నదన్నారు. గిరిజనులకు కుమురం భీం ఆదివాసీభవన్, సేవాలాల్ బంజారా భవన్‌లను తన నియోజకవర్గమైన బంజారాహిల్స్‌లో నిర్మించి వాటికి ఆత్మగౌరవ భవనాలుగా నామకరణం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఆదివాసీ పండుగలను, జాతరలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు.

వీరంగం సృష్టించిన రౌడీషీటర్ అరెస్టు

బంజారాహిల్స్: డబ్బులు డిమాండ్ చేస్తూ హోటల్‌పై అనుచరులతో కలిసి దాడి చేసిన ఘటనలో రౌడీషీటర్ అర్జున్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... శ్రీకృష్ణానగర్ 'సి' బ్లాక్‌లో తెలుగు సినీ అండ్ టీవీ ప్రొడక్షన్ అసిస్టెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి సత్యనారాయణ అలియాస్ సతీష్ తన భార్య అచ్యుత కుమారితో కలిసి ఎస్ఎస్‌వీ టిఫిన్స్ అండ్ క్యాటరర్స్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదై ఉన్న అర్జున్ యాదవ్ ఆరు మంది అనుచరులను తీసుకొని ఈ హోటల్‌పై దాడి చేశారు రూ. 40 వేలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. మద్యం మత్తులో ఉన్న అర్జున్ యాదవ్ అనుచరులు విధుల్లో ఉన్న అచ్యుత కుమారిని దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించారు. హోటల్‌లో పని చేస్తున్న శరత్‌కుమార్, రాంప్రసాద్‌లను తీవ్రంగా కొట్టారు. సామగ్రిని ధ్వంసం చేశారు. అందరూ చూస్తుండగానే అర్జున్‌యాదవ్‌తో పాటు ఆయన అనుచరులు అంతా హోటల్‌లో బీభత్సం సృష్టించి వీరంగం చేశారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శుభాకాంక్షలు



ఖైరతాబాద్: సెంట్రల్ జోన్ సీసీఎస్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జగన్నాథంకు మాల వెలుగు సంఘం సభ్యులు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, రాజలింగం, బన్నప్ప, వల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఫైనాన్స్ యజమానుల ఆగడాలను అరికట్టాలి

లిబర్టీ: ఆటో ఫైనాన్స్ యజమానుల వేధింపులు ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు. ఆటో ఫైనాన్స్ యజమానుల వేధింపుల వల్ల ఇటీవలి కాలంలో నలుగురు ఆటో డ్రైవర్లు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. లిబర్టీ వద్ద ఉన్న యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆటో ఫైనాన్స్ యజమానుల వేధింపులు, ఆగడాలు శృతి మించి పోతున్నాయన్నారు. గతంలో అనేకమార్లు తాము పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఆటో ఫైనాన్స్ యజమానుల వేధింపుల వల్ల తాజాగా ఆటో ట్రాలీ నిర్వహించే నగరానికి చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫైనాన్స్ యజమానులు డబ్బులు కట్టాలని వేధించడం వల్లనే విధి లేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన పేర్కొన్నారు. ఫైనాన్స్ కట్టాలని యజమానులు ఇంటికి వచ్చి బెదిరించి వేధించి మానసిక ఇబ్బంది పెట్టారని దాన్ని తట్టుకోలేకనే ఆత్మహత్యకు ఒడిగట్టాడని అన్నారు. వేధించి ఆత్మహత్య కారణమైన ఫైనాన్స్ యజమానులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్‌కు విజ్ఞప్తి చేశారు.

శ్రీకృష్ణానగర్‌లో మురుగును అరికట్టరా ?



నిరసన తెలియజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

వెంగళరావునగర్: ఎంతో అందంగా ఉండే శ్రీకృష్ణానగర్ ఇటీవల కాలంలో నిత్యం రోడ్లపై ప్రవహిస్తుందని, అక్కడ మంచినీరు పారితే ఇక్కడ మురుగు నీరు వస్తున్నాయని ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ టీ హోప్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో కొన్ని రోజులుగా మురుగునీరు ఏరులై పారుతోంది. ఈ విషయాన్ని స్థానికులు కొందరు ఉపేందర్‌రెడ్డికి ఫోన్ల ద్వారా సమాచారం అందించారు. దీనికి స్పందించిన ఉపేందర్‌రెడ్డి బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి మురుగునీటి వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు చేశారు. కార్యక్రమంలో టీ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న మొహర్రం వేడుకలు

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని సింగాడికుంటలో చిన్న మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని పీర్లకు ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ముస్లింలకు మొహర్రం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అబ్బాస్ అలీ, మొహిసిన్, గౌస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న విజయారెడ్డి

అమర జవానుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



మాజీ సైనికులకు సన్మానిస్తున్న బీజేపీ నేతలు

రహమత్‌నగర్: దేశం కోసం ప్రాణాలు తృణప్రాయంగా త్యజించిన అమర జవానుల త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకమని, వారి పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. అజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీరాంనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ కొలన్ సత్యనారాయణ, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ డాక్టర్ మహేందర్, నాయకులు లంకాల దీపక్ రెడ్డి, కుంభాల గంజరాజు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొని మాజీ సైనిక ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: బి.కె.గూడ 11కేవీ ఫీడర్ ఈఎస్ఐ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జయభారతి స్కూల్, శ్రీరామ్‌నగర్, దాసారం బస్తీ, సి–టైమ్ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

- మినిస్టర్ రోడ్డు, కామత్ లింగాపూర్ 11కేవీ ఫీడర్లు ఎస్–పార్కు సబ్‌స్టేషన్ పరిధిలో జీఈ బిల్డింగ్, కామత్‌లింగాపూర్, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాశ్‌నగర్ వాటర్ ట్యాంకు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.
- ఎయిర్‌పోర్ట్ 11కేవీ ఫీడర్ ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 9.30 వరకు డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, క్యాచ్ ప్రాపర్టీస్, యూఎస్ కాన్సులేట్, ఇంటర్‌గ్రాఫ్, హుడాలైన్, చిరాన్‌ఫోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీసు, ప్రకాశ్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుకవైపు, చికోటి గార్డెన్, ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, ప్రకాశ్‌నగర్, పేస్ హాస్పిటల్, గురుమూర్తి లైన్, మోతీలాల్‌నగర్, నెహ్రూనగర్, ఎయిర్ కార్గో, భగత్‌సింగ్‌నగర్, శ్యామలకుంట, ఐసీఐసీఐ బ్యాంక్‌లైన్, భగవతాపూర్, గగన్‌విహార్ కాలనీ, షేర్‌ఖాన్ బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు.
- సాయి ఎన్‌క్లేవ్ 11కేవీ ఫీడర్, రోడ్–13 సబ్‌స్టేషన్ పరిధిలోని సాయిఎన్‌క్లేవ్ ఏరియా, బంజారా, కమలా అపార్ట్‌మెంట్, సెంచరీ హాస్పిటల్, రోడ్–12 ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ వెల్లడించారు.
- ఎమ్మెల్యేకాలనీ 11 కేవీ ఫీడర్ ఫిల్మ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు దుర్గాభవానీనగర్, దీన్‌దయాల్‌నగర్, అకీంబాబా దర్గాలైన్, జగపతిబాబు ఇల్లు పరిసర ప్రాంతాలు, రోడ్–86 11కేవీ ఫీడర్ టోలీచౌకి సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్–86, చిత్రం రామచంద్ర‌రెడ్డి ఇల్లు, బెల్లంకొండ సురేష్ ఇల్లు లైన్, వైఎస్ వివేకానంద ఇంటి లైన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.
- లోటస్‌పాండ్ 11 కేవీ ఫీడర్ ఎమ్మెల్యే కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లు, లోటస్‌పాండ్ పార్కు, దామోదర్ నరసింహ ఇల్లు, వైఎస్ షర్మిల ఇల్లు పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వివరించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో...

కాంగ్రెస్‌కు పూర్వవైభవం లభించేనా?

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం ఆ పార్టీ తెలంగాణ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందనడం నిర్వివాదాంశం. అయితే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నేతల్లో నిరాశనిస్పృహలే కన్పిస్తున్నాయి. ప్రధానంగా నియోజకవర్గంలో పార్టీని నడిపించే యోధుడు ఆశించిన స్థాయిలో చురుగ్గా లేకపోవడమే కారణమంటూ పార్టీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి.

- రోజురోజుకూ దిగజారుతున్న పరిస్థితి
- పార్టీ శ్రేణుల్లో సర్వత్రా ఆందోళన
- ప్రతిష్టమైన కేడర్ ఉన్నా నాయకత్వలేమితో గంగరగోళం
- కొత్త నాయకత్వంపై ఎదురు చూపులు
- దిద్దుబాటు చర్యలపై హైకమాండ్ ఫోకస్!

శ్రీనగర్‌కాలనీ: ఒకప్పుడు రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గం అది. జనహృదయ నేత పి.జనార్దన్ రెడ్డి (పీజేఆర్) అంటే ఖైరతాబాద్... ఖైరతాబాద్ అంటేనే పీజేఆర్ అనే విధంగా ఉండేది. గెలుపోటములతో సంబంధం లేకుండా ఆయన ప్రజల నడుమే ఉండేవారనడం.. ప్రజామద్దతు ఆయనకే ఉండేదనడం అతిశయోక్తికాదు.

- పీజేఆర్ అకాల మరణంతో ఆయన తనయుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించినా పీజేఆర్‌కు ఉన్న ఓర్పు, నేర్పు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ప్రస్తుత జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రాంతంలో క్రమేపీ ఆ పార్టీ తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వచ్చింది. ఇప్పటికీ పీజేఆర్ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు పటిష్టంగా ఉన్నా సమర్థవంతంగా నడిపించే నాయకులు లేక పార్టీ చతికిల పడిపోయింది. దీంతో దశాబ్దాలకాలం పాటు వెన్నంటి నడిచిన కేడర్‌కు దిక్కులేకుండా పోయింది.
- అధికార పార్టీ ఒత్తిడిని తట్టుకోలేక మెజారిటీ నాయకులు పార్టీలు మారినా.. ఉన్న కొంత మంది పీజేఆర్‌ను మరువలేక పార్టీని వదలలేక పార్టీలోనే కొనసాగుతున్నారు.
- పీజేఆర్ తనయుడు మాజీ ఎమ్మెల్యే పీవీఆర్ కేవలం ఎలక్షన్స్ ముందు మాత్రమే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పీవీఆర్‌కు సత్తా ఉన్నా నియోజకవర్గంలో సమస్యలు, పార్టీలో యువతను సంఘటితం చేస్తూ పార్టీలో చురుకుగా పాల్గొనకపోవడం పెద్ద సమస్యగా మారింది. పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చాలా చురుకుగా ఉండి, ఎప్పుడూ నియోజకవర్గంలోనే ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. క్రమేపీ ఆయనలోని మార్పుల వల్ల పార్టీ బలహీనంగా మారింది.
- ఆయన నివాసం కూడా దోమలగూడలో ఉండటంతో కార్యకర్తలు, నేతలకు ఒకింత సమస్యగానే మారింది. దీంతో కొత్త నాయకత్వం వైపు పలువురు సీనియర్ నేతలు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇంతవరకూ పెద్దాయనపై ఉన్న గౌరవంతో ఈ నియోజకవర్గం పార్టీ స్థితిగతులపై దృష్టి సారించిన పార్టీ హైకమాండ్ మారుతున్న రాజకీయ పరిస్థితులపై సీరియస్‌గా దృష్టి సారించినట్లు సమాచారం.

గతంలో...

దివంగత పీజేఆర్ ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది తన సత్తా చాటుకున్నారు. జాతీయ స్థాయి నాయకుల మన్ననలు పొందారు. ఆయన మరణానంతరం జరిగిన ఉప ఎన్నికల్లో పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తరువాత నూతనంగా ఏర్పాటైన జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి మరోసారి పి.విష్ణువర్ధన్‌రెడ్డి విజయం సాధించారు. మొత్తంగా ఏడుగురు కార్పొరేటర్లలో నలుగురు కాంగ్రెస్ కార్పొరేటర్లు విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో విష్ణువర్ధన్‌రెడ్డి వరుస అపజయాలను మూటగట్టుకున్నారు.

- టీ పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పగ్గాలు చేపట్టాక పార్టీలో నూతనోత్తేజం వస్తుందని ఆశించిన పార్టీ కేడర్‌కు నిరాశే మిగిలింది.
- మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి పనితీరుతో ఎలాంటి మార్పు రాకపోవడంతో పార్టీని బతికించుకోవడం కోసం తమ ఉనికిని కాపాడుకోవడం కోసం కొత్త నాయకత్వం వైపు చూడక తప్పడం లేదని సీనియర్లు భావిస్తున్నారు.
- సీనియర్ నేతలను సంప్రదించకుండా ఏక పక్షంగా నియామకాలు చేపట్టంపై అసంతృప్తి చెందిన నేతలు నియోజకవర్గంలో పార్టీ ప్రక్షాళన కోసం శ్రీకారం చుట్టారు.

అజహరుద్దీన్ పర్యటనలో ఆంతర్యమేమిటో?

కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత, టీం ఇండియా మాజీ సారథి మహ్మద్ అజహరుద్దీన్ బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటించారు. ముఖ్య నేతలను కలుసుకొని వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం. నియోజకవర్గంలో అభ్యర్థులు గెలుపోటముల్లో ముస్లిం ఓట్లే కీలకం అయిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అజహరుద్దీన్‌ను బరిలోకి దింపితే ఎలా ఉంటుందో అనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పార్టీ ఢిల్లీ అధిష్టానం సూచనల మేరకే అజహరుద్దీన్ పర్యటన సాగిందని ఆయా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గ బరిలో అధిష్టానం మాజీ ఎమ్మెల్యే పీవీఆర్‌కు మరో అవకాశం ఇస్తుందా.. కొత్త నేతలకు అవకాశం ఇస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

అంగళ్లు దాడుల కేసులో
ఎ1గా చంద్రబాబు

హత్యాయత్నం, నేరపూరిత కుట్ర సహా పలు సెక్షన్ల కింద కేసు

- నిందితుల్లో మాజీ మంత్రులు దేవినేని, అమరనాథ్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్, రమేశ్ పైనా కేసు
- మొత్తం 20 మందిపై కేసు నమోదు


అంగళ్లులో చంద్రబాబు ప్రసంగిస్తుండగా తొడగొడుతూ, చెప్పు చూపిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొడుతున్న టీడీపీ నేతలు

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లులో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు సంబంధించి టీడీపీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు ప్రథమ ముద్దాయిగా పోలీసులు హత్యాయత్నం, నేరపూరిత కుట్ర, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈనెల 4న యాత్ర ముసుగులో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నేతల హత్యకు కుట్ర పన్ని, మారణాయుధాలు, బాటిళ్లు, రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడిన ఘటనలపై చంద్రబాబు సహా 20 మందిపై కురబలకోట మండలం ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఈ కేసు నమోదైంది. ఇతర నిందితుల్లో టీడీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ, మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి, తిరుపతి ప్రాంతాలకు చెందిన నేతలు నిందితులుగా ఉన్నారు. దాదంవారిపల్లెకు చెందిన అంగళ్లు మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్.ఉమాపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై ఐపీసీ 120బి, 147, 148, 153, 307, 115, 109, 323, 324, 506, రెడ్‌విత్ 149 సెక్షన్ల కింద ఎస్‌ఐ షేక్ ముబిన్‌తాజ్ కేసు నమోదు చేశారు.

వినతిపత్రం ఇచ్చేందుకు వేచి ఉండగా..

ప్రాజెక్టుల సందర్శన యాత్ర చేపట్టిన చంద్రబాబు ఈనెల 4న అంగళ్లుకు వస్తున్నారని తెలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమాపతిరెడ్డి, ఎంపీపీ దస్తగిరి, జెడ్పీటీసీ జ్యోతి భర్త బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి తదితరులు అంగళ్లు కూడలి సమీపంలోని రాయచోటి రోడ్డు వద్దకు చేరుకున్నారు. పిచ్చలవాండ్లపల్లె సాగు, తాగ నీటి రిజర్వాయర్ పనులను చంద్రబాబు కోర్టు ద్వారా నిలిపివేయించారని, ఈ చర్యను నిరసిస్తూ నల్ల కండువాలు ధరించి శాంతియుత పద్ధతిలో ఆయనకు వినతిపత్రం ఇవ్వాలని వేచి ఉన్నారు. వారికి రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మద్దతుగా వచ్చారు.

ఊగిపోయి.. దాడులకు ఉసిగొల్పి..

మధ్యాహ్నం చంద్రబాబు యాత్ర కూడలిలోకి చేరుకుంది. అక్కడ నల్ల కండువాలతో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులను చూసి చంద్రబాబు ఊగిపోయారు. 'తమాషాగా ఉందా.. ఆ నా కొడుకులను తరమండిరా.. వేసేయండిరా వాళ్లని'అని వేలెత్తి చూపించి టీడీపీ శ్రేణులను ఉసిగొల్పారు. వాహనంపై ఆయన పక్కనే ఉన్న మాజీ మంత్రులు దేవినేని ఉమా, ఎన్.అమరనాథ్‌రెడ్డి, మదనపల్లె మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, దొమ్మలపాటి రమేష్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి తదితర నేతలు కూడా వైఎస్సార్‌సీపీ నేతలవైపు చేతులు చూపుతూ, కేకలు వేస్తూ హెచ్చరికలు చేస్తూనే.. సైగలతో దాడులకు ప్రేరేపించారు. మరికొందరు స్థానిక నేతలు ఈలలు వేస్తూ, తొడ గొడుతూ.. బూతులు తిడితూ కొట్టండి అంటూ దాడికి ప్రోత్సహించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నేతలపై విరుచుకుపడ్డారు. ఓ పథకం ప్రకారం ఉద్దేశపూర్వకంగా టీడీపీ నేతలు ఈ దాడులు చేయించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా అప్పటికే సిద్ధం చేసుకున్న మారణాయుధాలు, రాళ్లు, కొడవళ్లు, ఇటుకలు, కట్టెలు, చెప్పులు, రాడ్లతో విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, దాడిని అడ్డుకోబోయిన పోలీసులు కూడా గాయపడ్డారు. దాడితో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. రోడ్డుపై పగిలిన బాటిళ్లు, ఇటుకలు, కర్రలు పడి ఉన్నాయి. కొందరు స్థానికులు వైఎస్సార్‌సీపీ నేతలను రక్షించారు. లేనిపక్షంలో కొందరు హత్యకు గురయ్యేవారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఆధారాలతో ఫిర్యాదు

మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమాపతిరెడ్డి ఆధారాలతో సహా చంద్రబాబు తదితరులపై ఫిర్యాదులో చేశారు. అంగళ్లు రోడ్‌షోలో చంద్రబాబు రెచ్చగొట్టే ప్రసంగాలు, ఇతర నాయకుల చర్యలను పెన్‌డ్రైవ్, సీడీలో ముదివేడు పోలీసులకు అందజేశారు. దీంతో పోలీసులు చంద్రబాబు ఏ1గా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ముందస్తు ప్రణాళిక, నేరపూరిత కుట్ర, అల్లర్లలో భాగంగా మారణాయుధాలతో తమపై దాడిచేసిన చంద్రబాబు అనుచరులు, దాడులకు పురమాయించిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో ఉమాపతిరెడ్డి కోరారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లోనూ ఇవే అంశాలను పేర్కొన్నారు.

చంద్రబాబు తదితరులపై నమోదు చేసిన కేసులో సెక్షన్లు

- సెక్షన్ 120బి: కుట్రపూరితంగా వ్యవహరించడం
- సెక్షన్ 147: అక్రమంగా సంఘం ఏర్పాటు చేసుకోవడం
- సెక్షన్ 148: చట్టవిరుద్ధంగా గుమిగూడి మారణాయుధాలు కలిగివుండటం
- సెక్షన్ 153: వర్గాలుగా హింసాత్మక సంఘటలకు ప్రేరేపించడం
- సెక్షన్ 307: హత్యాయత్నం
- సెక్షన్ 115: గొడవలకు ప్రేరేపించడం
- సెక్షన్ 109: ప్రేరేపించడం
- సెక్షన్ 323: చేతులతో కొట్టడం
- సెక్షన్ 324: కట్టెలతో చిన్న గాయం చేయడం
- సెక్షన్ 506: బెదిరించడం

చంద్రబాబుపై హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కేసు : అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి టౌన్ : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపై ముదివేడు పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కింద కేసు నమోదు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు చెప్పారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అంగళ్లులో జరిగిన సంఘటనపై ఉమాపతి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశామని తెలిపారు. ఈనెల 4 న మారుణాయుధాలు, ఐరన్ రాడ్లు, రాళ్లు, ఇటుకలు, కర్రలతో వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని వివరించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

రామోజీ, శైలజా కిరణ్‌లకు సీఐడీ నోటీసులు

16, 17 తేదీల్లో విజయవాడలో విచారణ

- ఈసారి హాజరుకాకపోతే న్యాయపరంగా కఠిన చర్యలకు యోచన
- కోర్టు ద్వారా నోటీసులు ఇప్పించాలని నిర్ణయం
- జూలై 5న ఏపీలో విచారణకు రావాలని కోరినా రాని రామోజీ
- ఇప్పటికే ఇద్దరిని హైదరాబాద్‌లో పలుమార్లు విచారించిన సీఐడీ



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ-1గా ఉన్న ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు, ఏ-2గా ఉన్న ఆయన కోడలు శైలజా కిరణ్‌లకు సీఐడీ బుధవారం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న రామోజీరావు, 17న శైలజా కిరణ్ విజయవాడలోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని సీఆర్‌పీసీ సెక్షన్ 41-ఏ(1) కింద జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం, ఆర్బీఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్టు రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ విభాగం విచారణలో వెల్లడైంది. దీంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై ఏడు కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు ఇప్పటికే రామోజీరావును ఓసారి, శైలజా కిరణ్‌ను రెండుసార్లు హైదరాబాద్‌లోని వారి నివాసంలో విచారించారు. మరోవైపు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆస్తులను అటాచ్ చేసేందుకు సీఐడీకి రాష్ట్ర హోంశాఖ అనుమతినిచ్చింది. దీంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్ముతో నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన రూ.1,035 కోట్ల పెట్టుబడులతోపాటు ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్న 88.50 శాతం వాటా, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లో ఉన్న 44.55 శాతం వాటాను అటాచ్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో ఇప్పటికే పిటిషన్లు దాఖలు చేసింది. ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై నమోదు చేసిన 7 ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి రెండింటిలో సీఐడీ చార్జ్‌షీట్లు కూడా వేసింది.

హాజరుకాకపోతే న్యాయపరంగా కఠిన చర్యలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో ప్రధాన నిందితులు రామోజీరావు, శైలజా కిరణ్ ఈసారి విచారణకు హాజరుకాకపోతే న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సీఐడీ భావిస్తున్నట్టు సమాచారం. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో మార్గదర్శి చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా రామోజీరావు, శైలజా కిరణ్ మళ్లించారని సీఐడీ గుర్తించి కేసు నమోదు చేసింది. బాధితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు కావడంతో కేసును కూడా రాష్ట్రంలోనే నమోదు చేశారు. అయితే రామోజీరావును, శైలజా కిరణ్‌ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో సీఐడీ విచారించింది. కాగా వారిద్దరూ విచారణకు సహకరించలేదు. పైగా అధికారులను తమ నివాసంలోకి అనుమతించకుండా చాలాసేపు రోడ్డు మీదే వేచి ఉండేలా చేశారు. కేసు నమోదైన ప్రాంతంలోనే విచారించాలనే ప్రాథమిక దర్యాప్తు సూత్రాన్ని దేశవ్యాప్తంగా దర్యాప్తు సంస్థలు పాటిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రామోజీరావు, శైలజా కిరణ్‌లను రాష్ట్రంలో విచారించాలని సీఐడీ భావించింది. అందుకోసం జూలై 5న గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. కానీ వారిద్దరూ విచారణకు హాజరు కాలేదు. తాము రాలేని పరిస్థితుల్లో ఉన్నామని ఈ-మెయిల్ ద్వారా తెలుపుతూ విచారణకు డుమ్మా కొట్టారు. ఈ నేపథ్యంలో కేసు విచారణలో మరింత పురోగతి సాధించిన సీఐడీ వారిద్దరిని రాష్ట్రంలో విచారించాల్సిన అవసరం ఉందని గుర్తించింది. అందుకే ఈ నెల 16, 17 తేదీల్లో విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. ఈసారి కూడా విచారణకు హాజరుకాకపోతే న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి కఠిన చర్యలపై సీఐడీ ఇప్పటికే సూత్రప్రాయంగా ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఉద్దేశపూర్వకంగానే విచారణకు గైర్హాజరవుతున్న విషయాన్ని న్యాయస్థానానికి నివేదించాలని సీఐడీ భావిస్తోంది. న్యాయస్థానం ద్వారా నోటీసులు గానీ అంతకుమించిన ఉత్తర్వులుగానీ ఇప్పించాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మార్గదర్శిలో తీవ్రమైన అవకతవకలు

- అవి చందాదారులకు తెలిసే అవకాశమే లేదు
- తీవ్ర ఉల్లంఘనలు గుర్తించాకే నోటీసు ఇచ్చాం
- హైకోర్టుకు నివేదించిన ఏజీ శ్రీరామ్
- ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో జరుగుతున్నవన్నీ తీవ్ర అంతర్గత అవకతవకలని, వాటి గురించి చందాదారులకు తెలిసే అవకాశమే లేదని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. అందుకే వాటిపై ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని వివరించింది. చందాదారులు ఫిర్యాదు చేయనంత మాత్రాన, మార్గదర్శి అక్రమాలు, అవకతవకలను ప్రశ్నించకూడదు, చర్యలు తీసుకోకూడదు అంటే ఎలా అని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ ప్రశ్నించారు. చట్టపరమైన తీవ్ర ఉల్లంఘనలను గుర్తించాకే 2022 డిసెంబర్‌లో ఆ సంస్థకు నోటీసులు ఇచ్చి వివరణ కోరామన్నారు. ఆ వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో.. అందుకు కారణాలను వివరిస్తూ మళ్లీ నోటీసు ఇచ్చామని తెలిపారు. అయినా కూడా మార్గదర్శి యథేచ్ఛగా ఉల్లంఘనలను కొనసాగిస్తూనే ఉందన్నారు. ఈ నేపథ్యంలో చిట్ గ్రూపుల నిలుపుదల విషయంలో అభ్యంతరాలను ఆహ్వానిస్తూ బహిరంగ నోటీసు ఇచ్చామన్నారు. చట్ట నిబంధనలకు విరుద్ధంగా తాము వ్యవహరిస్తున్నట్లు మార్గదర్శి చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని వివరించారు.

మార్గదర్శి వ్యాజ్యాలకు విచారణార్హత లేదు..

ఉల్లంఘనలను గుర్తించినప్పుడు.. వాటి విషయంలో తనంతట తాను (సుమోటో)గా చర్యలు ప్రారంభించే అధికారం చిట్ రిజిస్ట్రార్లకు చట్టం కల్పిస్తోందని ఏజీ శ్రీరామ్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. చిట్ రిజిస్ట్రార్లు చట్టప్రకారం తమకున్న సుమోటో అధికారాన్ని ఉపయోగించి చర్యలకు ఉపక్రమించారన్నారు. 2008లో ఇచ్చిన జీవో ప్రకారం రిజిస్ట్రార్లకు అధికారాలను అప్పగించారని, చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 48 (హెచ్) కింద చిట్ గ్రూపులను నిలిపేసేందుకు చర్యలు తీసుకునే సుమోటో అధికారం సైతం డిప్యూటీ రిజిస్ట్రార్లకు ఉందన్నారు. ప్రస్తుతం తాము జారీ చేసింది కేవలం షోకాజ్ నోటీసు మాత్రమేనని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు మార్గదర్శికి ఏమాత్రం అవకాశం లేదని తెలిపారు. అందువల్ల ఆ సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యాలకు విచారణార్హత లేదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో విస్తృత ప్రజాప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయొద్దని కోర్టును అభ్యర్థించారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేస్తామని చెప్పారు. వాదనలు ముగించడంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నగర వార్తలు

ట్యాంక్‌బండ్‌పై గద్దర్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డి


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేతలు

అల్వాల్: తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం పోరాడిన ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భూదేవినగర్‌లోని గద్దర్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ... జీవితకాలంపాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకే పనిచేసిన ప్రజా గాయకుడు గద్దర్ చరిత్ర భావి తరాలకు తెలియాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు ట్యాంక్‌బండ్ వద్ద గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు ఆయన స్మృతి వనాన్ని నిర్మించాలన్నారు. తన ఆట, పాట, సాహిత్యంతో ప్రజలకు చైతన్య పరిచారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.బాలమల్లేష్, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతి, దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు మారపాక అనిల్ కుమార్, జిల్లా నాయకులు శంకర్, సహదేవ్, లత, స్వరూప, మహేందర్, గోవిందరావు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో యువకుడి మృతి!

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

చంపాపేట: వైద్యుల నిర్లక్ష్యంతో యువకుడు మృతి చెందాడంటూ ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువులు ఆందోళనకు దిగిన సంఘటన బుధవారం రాత్రి కర్మన్‌ఘాట్‌లో చోటుచేసుకుంది. వివరాలివీ... భువనగిరి జిల్లా ధోతిగూడెం గ్రామానికి చెందిన సాయి(27) రెండు రోజులుగా కడుపు నొప్పితో బాధపతున్నాడు. దీంతో ఆయనను బంధువులు కర్మన్‌ఘాట్‌లోని జీవన్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం సాయంత్రం సాయి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించటంతో మృతి చెందాడు. సాయి బంధువులు భారీ ఎత్తున ఆస్పత్రికి చేరుకుని.. వైద్యుల నిర్లక్ష్యంతోనే సాయి మృతి చెందాడని ఆరోపిస్తూ ఆందోళన చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. సరూర్‌నగర్, చైతన్యపురి, ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరి ఆందోళనకారులను సముదాయించటంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలపై
కదిలిన యంత్రాంగం

- పలు కూడళ్లను పరిశీలించిన జీహెచ్ఎంసీ కమిషనర్, సైబరాబాద్ కమిషనర్
- ట్రాఫిక్ సమస్య పరిష్కార మార్గాలపై దిశానిర్దేశం


సైబర్ టవర్ జంక్షన్‌ను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో నిత్యం తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కార మార్గాలపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర జాయింట్ ఇన్స్‌పెక్షన్ చేశారు. బుధవారం ఉదయం పలు కూడళ్లను పరిశీలించి ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం తీసుకునే చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఐకియా రోటరీ, లెమన్ ట్రీ హోటల్, సైబర్ టవర్, శిల్పారామం, ఎస్ఐఏ, ఖైత్లాపూర్ ఆర్‌వోబీ, గోకుల్ ప్లాట్స్, ఫోరం మాల్, కొత్తగూడ, బొటానికల్ గార్డెన్ మసీద్ బండ, డెలాయిట్, రాడిసన్ హోటల్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. బాటిల్ నెక్ రోడ్లు, వాటర్ లాగింగ్ పాయింట్లు, జంక్షన్ల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. హెచ్‌సీయూ వైపు నుంచి డీఎల్ఎఫ్ వైపు వెళ్లే ట్రాఫిక్ సాజావుగా వెళ్లాలంటే గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్‌ను వేరే చోటికి తరలించాలని అధికారులను సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు.

ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని, బాటిల్ నెక్ రోడ్లను విస్తరించాలని, జంక్షన్‌లలో ఐలాండ్‌లను తగ్గించాలని, డెలాయిట్ నుంచి ఐకియా రోటరీకి వెళ్లే రోడ్డును ఎడమ వైపు విస్తరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సజావుగా సాగాలంటే తక్షణమే చేపట్టాల్సిన పనులను గుర్తించి, ప్రతిపాదనలు రూపొందించాలని వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ సందీప్, జడ్సీ శ్రీనివాస్ రెడ్డి, సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణవీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకత్వం దేశ ప్రజలకు అవసరం

- టీం ఇండియా మాజీ సారథి, కాంగ్రెస్ నేత మహ్మద్ అజహరుద్దీన్

శ్రీనగర్‌కాలనీ: క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌నని, ఇండియాకు ప్రాతినిధ్యం వహించానని, ఇప్పుడు ప్రజల సంక్షేమం కోసం, వారి అభ్యున్నతి కోసం ప్రాతినిధ్యం వహించడానికి సిద్ధంగా ఉన్నానని మాజీ ఇండియన్ క్రికెటర్, కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎల్లారెడ్డిగూడ, ఎర్రగడ్డ, రహమత్‌నగర్ ప్రాంతాల్లో చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ న్యాయకత్వం నేడు ప్రజలకు చాలా అవసరమని, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతమై ప్రజల్లో మార్పు మొదలైందన్నారు. కార్యక్రమంలో నేతలు భవానీశంకర్, కిరణ్‌యాదవ్, మోసిన్‌ఖురేషి, పెద్ద శ్రీశైలంయాదవ్, కుందన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిగూడ, ఎర్రగడ్డల్లో కాంగ్రెస్ నేతలతో మాట్లాడుతున్న మహ్మద్ అజహరుద్దీన్



12, 13 తేదీల్లో చెస్ సెలెక్షన్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు సంబంధించి ఈ నెల 12, 13వ తేదీల్లో చెస్ సెలెక్షన్ టోర్నీ జరగనుంది. ఎల్‌బీ స్టేడియంలోని యోగా, వుషు హాల్‌లో అండర్-7, అండర్-11 వయో పరిమితి విభాగాల్లో సెలెక్షన్ టోర్నీ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్.ప్రసాద్ తెలిపారు. స్పాట్ ఎంట్రీలను స్వీకరించడం లేదన్నారు. ఔత్సాహికులు తమ పేర్లను ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు ఫోన్స్: 73375 78899, 73373 99299లలో సంప్రదించి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

పోస్టు కార్డులతో ఆయుర్వేద విద్యార్థుల నిరసన


పోస్టు కార్డులతో నిరసన తెలియజేస్తున్న ఆయుర్వేద విద్యార్థులు

వెంగళరావునగర్: న్యాయబద్ధంగా తమకు రావాల్సిన స్టైఫండ్‌ను విడుదల చేయాలని దాదాపు పది రోజుల నుంచి ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆయుర్వేద పీజీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో బుధవారం పోస్టు కార్డుల ద్వారా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు పోస్టు కార్డుల ద్వారా తమ ఆవేదనను తెలియజేస్తూ నినాదాలు చేశారు. పోస్టు కార్డుల మీద సమస్యను వివరిస్తూ ఇకనైనా తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పోస్టు కార్డులన్నీ కూడా మంత్రి హరీష్‌రావు కార్యాలయానికి పోస్టు చేస్తామని, వాటిని చూసి తమకు తక్షణ న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. పాత స్టైఫండ్‌ను తొలగించి కోర్టు ఉత్తర్వుల ప్రకారం దానిని పెంచుతూ కొత్తది ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీజీ వైద్య విద్యార్థులు శ్రీనివాస్, రాంబాబు, సందీప్, హర్ష, అభిలాష్, జగన్‌లాల్, అలేఖ్య, హిమజ, సాహితి, రోహిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి


అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని వివిధ కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం అనే నినాదంతోబుధవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాయి. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎం.సాయిబాబా, ఐఎన్‌టీయూసీ నాయకులు నాగన్నగౌడ్, ఏఐటీయూసీ నాయకులు బాలరాజు, సుదర్శన్, రెబ్బ రామారావు, బీఆర్‌టీయూ నాయకులు రాంబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.సూర్యం, జనార్దన్, బోస్, కార్మిక సంఘాల నేతలు వెంకట రమణారావు, భాస్కర్, వి.నాగేశ్వర్‌రావు, సాధినేని వెంకటేశ్వరరావు, పద్మ, అనురాధ తదితరులు హాజరై మాట్లాడారు. కేంద్రం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోలను తక్షణమే అమలు చేయాలని, రైతాంగానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం ఆపాలని కోరారు.

ఐక్య ఉద్యమాలతోనే ఉద్యోగ భద్రత



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా నిలువరించడంతో విద్యుత్ ఉద్యోగులు పోషించిన పాత్ర మరవలేనిదని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ రత్నాకర్‌రావు పేర్కొన్నారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్ (ఎన్‌సీసీఓఈఈఈ) పిలుపు మేరకు బుధవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట 'యాంటీ ప్రైవేటైజేషన్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రావు మాట్లాడుతూ... ఉద్యోగుల ఐక్య ఉద్యమాల వల్లే ప్రైవేటీకరణ ప్రక్రియకు చెక్‌పడిందని గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన బాధ్యత ఉద్యోగులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కో చైర్మన్లు శ్రీధర్, బీసీరెడ్డి, వరప్రసాద్, జేఏసీ ప్రతినిధులు ముత్యం వెంకన్న గౌడ్, సుధాకర్‌రెడ్డి, రాంజీ, ఈశ్వర్‌గౌడ్, జ్యోతిరాణి, నెహ్రూ, వెంకటనారాయణరెడ్డి, పి.సదానందం, శ్రీనివాస్, కె.కిరణ్, భాస్కర్, జనప్రియ, బాగయ్య, ఎన్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్– 2 పరీక్ష వాయిదా వేయాలి

- గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పొడిగించాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: గ్రూప్– 2 పరీక్ష వాయిదా వేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వరుస పోటీపరీక్షల షెడ్యూల్‌తో లక్షలాదిమంది అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని, వారి విన్నపాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలన్నారు. గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించాలని, రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుపేదలకు ఇంత తక్కువ గడువులో దరఖాస్తు చేసుకోవడం ఎలా వీలవుతుందని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, నాయకులు ప్రవీణ్ కుమార్, నక్క మనోహర్ పాల్గొన్నారు.

గెజిట్‌లో భూములు గల్లంతు!

- ఆర్ఆర్ఆర్ 'ఉత్తర రింగు' పరిహారం పంపిణీ వేళ గుర్తింపు
- మిస్ అయిన వందలాది ఎకరాల భూముల వివరాలతో గెజిట్ల జారీ షురూ
- అన్ని నోటిఫికేషన్లూ పూర్తయ్యాకే పరిహారం పంపిణీ



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం సర్వే చేశారు.. అలైన్‌మెంట్ ఖరారు అయింది. భూమి వివరాల ఆధారంగా మూడు గెజిట్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. వాటిపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం తంతూ పూర్తయింది.. ఇక పరిహారం పంపిణీకి రంగం సిద్ధమైంది. కానీ తాజాగా హెక్టార్ల కొద్దీ భూమి వివరాలు రికార్డుల్లోకి రాలేదని గుర్తించారు. ఇప్పటివరకు జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్లలో వాటి వివరాలు లేకపోవడంతో హడావుడిగా ఆ భూములకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్లు జారీ ప్రక్రియ ప్రారంభించారు. వీటికి తొలుత 3ఏ (క్యాపిటల్), ఆ తర్వాత 3డీ నోటిఫికేషన్లు ఇస్తూ, వాటిపై అభ్యంతరాలు స్వీకరించి గ్రామ సభల్లో సమాధానాలు చెప్పాలి. ఆ తర్వాతే పరిహారం ప్రక్రియ మొదలుపెట్టాల్సి ఉంది.

ఏడాదిన్నర తర్వాత గుర్తింపు!

రీజినల్ రింగురోడ్డులో సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు నిర్మించే ఉత్తర భాగానికి సంబంధించిన ప్రక్రియ 2021లోనే మొదలైన విషయం తెలిసిందే. సర్వే ప్రక్రియ పూర్తి చేసి అలైన్‌మెంటు ఖరారయ్యాక గతేడాది మార్చిలో తొలి గెజిట్ నోటిఫికేషన్ 3ఏ (స్మాల్ ఏ) జారీ అయింది. అందులో ఎక్కడ ఎన్ని కి.మీ. రోడ్డు నిర్మాణం కానుందో వెల్లడించారు. ప్రభావితమయ్యే భూముల వివరాలు కూడా సేకరించారు. అనంతరం ఏప్రిల్‌లో 3ఏ (క్యాపిటల్ ఏ) నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో సేకరించే భూమి వివరాలను సర్వే నంబర్లు, విస్తీర్ణం వారీగా ప్రచురించారు. ఆ తర్వాత పట్టాదారు పేర్లతో 3డీ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. అయితే మధ్యలో చాలా భూముల వివరాలు గల్లంతైన విషయాన్ని మాత్రం గుర్తించలేదు. ఇప్పుడు పరిహారం పంపిణీకి వివరాలు సిద్ధం చేస్తున్న క్రమంలో లెక్కల్లో తేడాలొచ్చాయి. 162 కి.మీ. ఉత్తర భాగం రింగురోడ్డుకు సంబంధించి 2 వేల హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. కానీ పరిహారం లెక్కించే తరుణంలో భూమి తక్కువగా ఉన్నట్టు తేలింది. దీంతో మొదటి నుంచి చూస్తూ రాగా, దాదాపు 450 ఎకరాల భూమి వివరాలు గల్లంతైనట్టు గుర్తించారు. సర్వే నెంబర్ల వారీగా వాటి వివరాలు తీసి ఇప్పుడు నోటిఫికేషన్లు జారీ చేయటం ప్రారంభించారు. ఇందులో భాగంగా తాజాగా యాదాద్రి, ఆందోల్–జోగిపేట భూసేకరణ అథారిటీ (కాలా)ల పరిధిలోని భూములకు సంబంధించి 3ఏ (క్యాపిటల్ ఏ) నోటిఫికేషన్‌ను ఎన్‌హెచ్ఏఐ జారీ చేసింది. యాదాద్రి కాలాకు సంబంధించి గతేడాది ఏప్రిల్‌లో 185 హెక్టార్ల భూసేకరణకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వగా, ఇప్పుడు గల్లంతైన మరో 19.20 హెక్టార్ల భూమికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. అందోల్–జోగిపేట కాలా పరిధికి సంబంధించి గతేడాది 94.38 హెక్టార్ల భూమికి సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వగా, గల్లంతైన 15.05 హెక్టార్లకు సంబంధించి తాజాగా జారీ చేశారు. వీటిపై అభ్యంతరాలు వెల్లడించేందుకు సంబంధీకులకు గడువు ఇచ్చారు.

పొరపాటు కాదు..

ఇది పొరపాటుగా జరిగింది కాదని అధికారులు చెబుతున్నారు. 'రీజినల్ రింగు రోడ్డు అలైన్‌మెంటును ప్రాథమికంగా గూగుల్ మ్యాపు ఆధారంగా చేశారు. ఈ ప్రక్రియలో కొన్ని వివరాలు గల్లంతయ్యే పరిస్థితి ఉంటుంది. నిజాం కాలం నాటి లెక్కల్లో కొన్ని వివరాలు సరిగా లేకపోవటం కూడా దీనికి కారణం..'అని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

'వైద్యుల సమస్యలు పరిష్కరించాలి'

సాక్షి, హైదరాబాద్: వైద్యుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీని ప్రభుత్వ వైద్యుల సంఘం కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు.

మహిళ వివస్త్ర ఘటనపై గవర్నర్ సీరియస్

- నిందితులపై చర్యలకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్/జవహర్‌నగర్: హైదరాబాద్ నగర శివారులోని జవహర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ యువతిని నడిరోడ్డుపై వివస్త్రను చేసిన ఘటనను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని గవర్నర్ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశించారు.

దాడి చేసి.. దుస్తులు చించి..

జవహర్‌నగర్‌కు చెందిన పెద్ద మారయ్య (30) ఆదివారం రాత్రి 8.30 గంటలకు మద్యం మత్తులో రోడ్డు మీద వెళ్తున్న స్థానిక యువతితో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ప్రతిఘటించడంతో ఆమెపై దాడి చేసి దుస్తులను చించి లాగేశాడు. ఆ సమయంలో నిందితుని తల్లి అక్కడే ఉన్నా అడ్డుకోలేదు. స్థానికులు ఫోన్లతో వీడియోలు తీశారు తప్ప ఎవరూ ఆమెను రక్షించడానికి ముందుకు రాలేదు. దాదాపు 15 నిమిషాల పాటు ఆ యువతి రోడ్డుపై నగ్నంగా రోదిస్తూ కూర్చుండిపోయింది. నిందితుడు వెళ్లిపోయాక స్థానికులు వచ్చి ఆమెను కవర్లతో కప్పి పోలీసులకు సమాచారం అందించారు.

బాధితురాలిని ఆదుకుంటా: మంత్రి మల్లారెడ్డి



బాధితురాలిని పరామర్శిస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

జవహర్‌నగర్ సంఘటన బాధితురాలిని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి బుధవారం మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సంఘటన తనను ఎంతగానో కలచివేసిందన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తానని స్పష్టం చేశారు. బాధిత మహిళ చదువుకు అనుగుణంగా ఉపాధి అవకాశం కల్పిస్తానని, అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో యువతిని వివస్త్రను చేసిన సంఘటనపై నివేదిక పంపాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) తెలంగాణ డీజీపీ అంజనీకుమార్‌ను ఆదేశించింది. ఈ సంఘటనపై ఏడు రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్ కోరింది.

ఈనెల 14 నుంచి 24 వరకు గాంధీ చిత్ర ప్రదర్శన

- 582 స్క్రీన్‌లలో విద్యార్థులకు ఉచితంగా: మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని, ఈ నెల 14 నుంచి 24 వరకు రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో ఉచితంగా గాంధీ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో చిత్ర ప్రదర్శనకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుమార్ కూర్మాచలం, తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, కార్యదర్శి అనుపమ్ రెడ్డి, తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దిల్ రాజు, కార్యదర్శి దామోదర్ ప్రసాద్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఎఫ్‌డీసీ ఎండీ అశోక్ రెడ్డి, న్యాయశాఖ అదనపు కార్యదర్శి మన్నన్, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబు, యూఎఫ్‌వో, క్యూబ్, సెరసెర, పీవీఆర్ ప్రతినిధులు శ్రీనివాస్, సాయి రఘురామ్, ప్రదీప్, సందీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ వేడుకలలో భాగంగా విద్యార్థులలో జాతీయ స్ఫూర్తిని చాటే విధంగా రాష్ట్రంలోని 582 స్క్రీన్‌లలో గాంధీ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. విద్యార్థులను థియేటర్‌ల వద్దకు ఉచితంగా తీసుకొచ్చి, క్షేమంగా వారి గమ్య స్థానాలకు తీసుకెళ్ళే విధంగా అధికారులు థియేటర్‌ల నిర్వాహకులు, విద్యాశాఖ, రవాణా శాఖ వర్గాలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు.



మనిక సూట్‌కేస్ ఇంటికి చేరింది...

పెరూ ఓపెన్ టోర్నీలో ఆడి స్వదేశం చేరుకునే క్రమంలో... డచ్ విమానయాన సంస్థకు చెందిన కేఎల్ఎమ్ ఎయిర్‌లైన్స్‌లో మరిచిపోయిన తన సూట్‌కేస్ బుధవారం ఉదయం ఇంటికి చేరిందని భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనిక బత్రా తెలిపింది. సూట్‌కేస్ కనిపించకుండాపోయిన విషయాన్ని సంబంధిత ఎయిర్‌లైన్స్ దృష్టికి తెచ్చినా ఆశించిన స్పందన లేకపోవడంతో మనిక కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తెచ్చింది. దాంతో పౌరవిమానయాన శాఖ సిబ్బంది చొరవతో సూట్‌కేస్ మనిక ఇంటికి చేరింది. ఈ సందర్భంగా జ్యోతిరాదిత్యకు మనిక ధన్యవాదాలు తెలిపింది.

విజయంతో వొజ్నియాకి పునరాగమనం



ప్రపంచ మహిళల టెన్నిస్ మాజీ నంబర్‌వన్ కరోలైన్ వొజ్నియాకి విజయంతో పునరాగమనం చేసింది. ఈ డెన్మార్క్ స్టార్ 2020లో టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పింది. అనంతరం ఆటపై మక్కువతో మళ్లీ రాకెట్ పట్టాలని 33 ఏళ్ల వొజ్నియాకి నిర్ణయం తీసుకుంది. మాంట్రియల్‌లో జరుగుతున్న నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో జరిగిన తొలి రౌండ్‌లో వొజ్నియాకి 6-3, 6-2తో కింబర్లీ బిరెల్ (ఆస్ట్రేలియా)పై గెలిచింది.



అక్టోబర్ 14న భారత్ X పాకిస్తాన్

ఒకరోజు ముందుకు జరిగిన కీలక సమరం

మొత్తం తొమ్మిది మ్యాచ్‌ల షెడ్యూల్‌లో మార్పులు

ముంబై: వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. మొత్తం 9 మ్యాచ్‌లను రీషెడ్యూల్ చేశారు. అహ్మదాబాద్‌లో నవరాత్రి ఉత్సవాలు... కోల్‌కతాలో కాళీ మాత పూజల కారణంగా తప్పనిసరిగా రెండు మ్యాచ్‌ల తేదీలలో మార్పులు చేయాల్సి వచ్చింది. దీని వల్ల ఇతర మార్పులు కూడా అవసరం కావడంతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మరో ఏడు మ్యాచ్‌ల తేదీలను కూడా మార్చింది. దీని ప్రకారం టోర్నమెంట్‌కే హైలైట్ మ్యాచ్ అయిన భారత్, పాకిస్తాన్ మధ్య అక్టోబర్ 15న జరగాల్సిన పోరును ఒకరోజు ముందుగా అక్టోబర్ 14న నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో కూడా అక్టోబర్ 12న జరగాల్సిన పాకిస్తాన్-శ్రీలంక మ్యాచ్ అక్టోబర్ 10కి మారింది. అక్టోబర్ 10న ఇంగ్లండ్, బంగ్లాదేశ్ జట్ల మధ్య డే అండ్ నైట్‌గా జరగాల్సిన మ్యాచ్‌ను డేగా నిర్వహిస్తారు.

మారిన షెడ్యూల్ వివరాలు

మ్యాచ్	పాత తేదీ	కొత్త తేదీ
ఇంగ్లండ్ x బంగ్లాదేశ్	అక్టోబర్ 10 (డే అండ్ నైట్)	అక్టోబర్ 10 (డే)
పాకిస్తాన్ x శ్రీలంక	అక్టోబర్ 12	అక్టోబర్ 10
ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	అక్టోబర్ 14	అక్టోబర్ 13
భారత్ x పాకిస్తాన్	అక్టోబర్ 15	అక్టోబర్ 14
ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	అక్టోబర్ 14	అక్టోబర్ 15
ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	నవంబర్ 12	నవంబర్ 11
ఇంగ్లండ్ x పాకిస్తాన్	నవంబర్ 12	నవంబర్ 11
భారత్ x నెదర్లాండ్స్	నవంబర్ 11	నవంబర్ 12

పృథ్వీ షా 244

- ఇంగ్లండ్ దేశవాళీ వన్డే కప్ టోర్నీలో భారత బ్యాటర్ డబుల్ సెంచరీ
- 153 బంతుల్లో 28 ఫోర్లు, 11 సిక్స్‌లతో మెరుపు ఇన్నింగ్స్



లండన్: ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో తొలిసారి ఆడుతున్న భారత క్రికెటర్ పృథ్వీ షా దేశవాళీ వన్డే కప్‌లో డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సోమర్‌సెట్‌తో బుధవారం జరిగిన వన్డే మ్యాచ్‌లో నార్తంప్టన్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 23 ఏళ్ల పృథ్వీ షా విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మెరిశాడు. 153 బంతులు ఆడిన పృథ్వీ షా 28 ఫోర్లు, 11 సిక్స్‌లతో 244 పరుగులు సాధించి ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో అవుటయ్యాడు. పృథ్వీ షా అసాధారణ బ్యాటింగ్‌తో మొదట బ్యాటింగ్‌కు దిగిన నార్తంప్టన్‌షైర్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 415 పరుగులు సాధించింది. అనంతరం సోమర్‌సెట్ జట్టు 45.1 ఓవర్లలో 328 పరుగులకు ఆలౌటై 87 పరుగుల తేడాతో ఓడిపోయింది.

నార్తంప్టన్‌షైర్ జట్టు తరఫున మూడో మ్యాచ్ ఆడిన పృథ్వీ షా 81 బంతుల్లో సెంచరీ చేయగా... డబుల్ సెంచరీని 129 బంతుల్లో దాటాడు. ముంబైకి చెందిన పృథ్వీ షాకిది లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో (దేశవాళీ, అంతర్జాతీయ వన్డేలు) రెండో డబుల్ సెంచరీ కావడం విశేషం. 2021లో భారత దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో పుదుచ్చేరిపై పృథ్వీ షా 227 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2021 జూలైలో చివరిసారి శ్రీలంక పర్యటనలో భారత జట్టుకు ఆడిన పృథ్వీ షా ఆ తర్వాత ఫామ్ కోల్పోయి జాతీయ జట్టుకు దూరమయ్యాడు.

6 లిస్ట్ 'ఎ'లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో పృథ్వీ షాది ఆరో స్థానం. ఈ జాబితాలో తమిళనాడు క్రికెటర్ నారాయణ్ జగదీశన్ (277: అరుణాచల్‌ప్రదేశ్‌పై 2022లో) టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.

వన్డే వరల్డ్ కప్ టికెట్లు రెడీ

- ఆగస్టు 25 నుంచి అందుబాటులో
- ఆగస్టు 15 నుంచి రిజిస్ట్రేషన్
- దశల వారీగా భారత మ్యాచ్‌ల టికెట్లు



దుబాయ్: ఎట్టకేలకు వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడాలనుకునే అభిమానులకు తీపి కబురు! టోర్నీ తొలి మ్యాచ్ కంటే కేవలం 41 రోజుల ముందునుంచి ప్రేక్షకుల కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టికెట్లను అమ్మకానికి ఉంచనుంది. మ్యాచ్‌ల తేదీలనే బాగా ఆలస్యంగా (100 రోజుల ముందు) ప్రకటించిన ఐసీసీ ఇప్పుడు వేర్వేరు కారణాలతో వాటిని సవరించి బుధవారం తుది షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో పాటు ఫ్యాన్స్ తమ ప్రణాళికలు రూపొందించుకునేందుకు వీలుగా టికెట్ల అమ్మకాల వివరాలను కూడా ఐసీసీ వెల్లడించింది. 'భారత్ ఆడే వామప్, ప్రధాన మ్యాచ్‌లు'... 'భారత్ ఆడని ఇతర మ్యాచ్‌లు' అంటూ రెండు రకాలుగా టికెట్ల అమ్మకాలను ఐసీసీ విభజించింది. భారత్ ఆడే 9 లీగ్ మ్యాచ్‌ల టికెట్లను కూడా ఆరు వేర్వేరు దశల్లో (వేదికల ప్రకారం) అమ్మకానికి అందుబాటులో ఉంచుతారు. అయితే ఇతర ద్వైపాక్షిక సిరీస్ మ్యాచ్‌ల తరహాలో నేరుగా అమ్మకపు తేదీ నుంచి టికెట్లు కొనేందుకు అవకాశం ఉండదు. వరల్డ్ కప్ టికెట్ల కోసం అభిమానులు ఆన్‌లైన్‌లో ముందుగా వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారమే ఆ తర్వాత కేటాయింపులు జరుగుతాయి. ఆగస్టు 15 నుంచి అభిమానులు https://www.cricketworldcup.com/register లో తమ వివరాలు నమోదు చేయాలి.

టికెట్ల అమ్మకపు తేదీల వివరాలు

25 ఆగస్టు నుంచి: భారత్ మినహా ఇతర జట్ల వామప్ మ్యాచ్‌లు/ప్రధాన మ్యాచ్‌లు
30 ఆగస్టు నుంచి: భారత్ ఆడే రెండు వామప్ మ్యాచ్‌లు (గువహటి, తిరువనంతపురం)
31 ఆగస్టు నుంచి: చెన్నై (ఆస్ట్రేలియాతో), ఢిల్లీ (అఫ్గానిస్తాన్‌తో), పుణే (బంగ్లాదేశ్‌తో)లలో భారత్ ఆడే మ్యాచ్‌లు
1 సెప్టెంబర్ నుంచి: ధర్మశాల (న్యూజిలాండ్‌తో), లక్నో (ఇంగ్లండ్‌తో), ముంబై (శ్రీలంకతో)లలో భారత్ మ్యాచ్‌లు
2 సెప్టెంబర్ నుంచి: బెంగళూరు (నెదర్లాండ్స్‌తో), కోల్‌కతా (దక్షిణాఫ్రికాతో)లలో భారత్ ఆడే మ్యాచ్‌లు
3 సెప్టెంబర్ నుంచి: అహ్మదాబాద్‌లో (పాకిస్తాన్‌తో) భారత్ ఆడే మ్యాచ్
15 సెప్టెంబర్ నుంచి: సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు

భారత్‌దే పైచేయి

పాకిస్తాన్‌పై 4-0తో ఘనవిజయం • ఆసియా చాంపియన్స్ ట్రోఫీ



చెన్నై: గత ఏడేళ్లుగా చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టు చేతిలో ఓటమి ఎరుగని భారత హాకీ జట్టు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా బుధవారం పాకిస్తాన్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-0 గోల్స్‌తో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (15వ, 23వ ని.లో) రెండు గోల్స్ చేయగా... జుగ్‌రాజ్ (36వ ని.లో), ఆకాశ్‌దీప్ (55వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. భారత జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా ఇందులో మూడింటిని గోల్స్‌గా మలిచింది. ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో జపాన్ 2-1తో చైనాపై, మలేసియా 1-0తో కొరియాపై నెగ్గాయి.

పాక్‌పై విజయంతో ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో లీగ్ దశ ముగిశాక భారత్ 13 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. 12 పాయింట్లతో మలేసియా రెండో స్థానంలో, 5 పాయింట్లతో దక్షిణ కొరియా, జపాన్, పాకిస్తాన్ సంయుక్తంగా మూడో స్థానంలో, ఒక పాయింట్‌తో చైనా చివరి స్థానంలో నిలిచాయి. కొరియా, జపాన్, పాక్ ఐదు పాయింట్లతో సమంగా ఉన్నా... మెరుగైన గోల్స్ అంతరంతో కొరియా, జపాన్ జట్లకు సెమీఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. దాంతో మాజీ చాంపియన్ పాకిస్తాన్ సెమీఫైనల్ చేరలేకపోయింది. శుక్రవారం 5-6 స్థానాల కోసం జరిగే వర్గీకరణ మ్యాచ్‌లో చైనాతో పాకిస్తాన్...సెమీఫైనల్స్‌లో కొరియాతో మలేసియా; జపాన్‌తో భారత్ ఆడతాయి.

హంపి ఓటమి... హారిక గేమ్ 'డ్రా'





బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్ తొలి గేమ్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల విభాగంలో కోనేరు హంపి ఓటమి చవిచూడగా... ద్రోణవల్లి హారిక తన గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. జార్జియా గ్రాండ్‌మాస్టర్ బెలా ఖొటెనాష్‌విలితో జరిగిన గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన హంపి 42 ఎత్తుల్లో ఓడిపోయింది. ఈ టోర్నీలో నిలవాలంటే నేడు బెలాతో జరిగే రెండో గేమ్‌లో హంపి తప్పనిసరిగా గెలవాలి. ఎలైన్ రోబర్స్ (నెదర్లాండ్స్)తో జరిగిన గేమ్‌ను హారిక 70 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. నేడు వీరిద్దరి మధ్య జరిగే రెండో గేమ్‌లో గెలిచిన ప్లేయర్‌కు క్వార్టర్ ఫైనల్ బెర్త్ లభిస్తుంది. 'డ్రా'గా ముగిస్తే శుక్రవారం టైబ్రేక్ గేమ్‌ల ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఓపెన్ విభాగంలో ఎటిని బాక్రోట్ (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ 30 ఎత్తుల్లో గెలుపొందాడు. గుకేశ్ (భారత్)-ఎసిపెంకో (రష్యా); అర్జున్ (భారత్)-సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్); నిహాల్ (భారత్)-నెపోమ్నిశి (రష్యా); ప్రజ్ఞానంద (భారత్)-నకముర (అమెరికా) మధ్య జరిగిన గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

సినిమా


• మహేశ్‌బాబు

డబుల్ ట్రీట్


బర్త్ డేకి డబుల్ ట్రీట్ ఇచ్చారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'గుంటూరు కారం'. ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం (ఆగస్టు 9) మహేశ్‌బాబు బర్త్ డే. ఈ సందర్భంగా 'గుంటూరు కారం' సినిమా నుంచి మహేశ్‌బాబుకు చెందిన రెండు పోస్టర్స్‌ను రిలీజ్ చేశారు. ఒక పోస్టర్ ఇంట్లోది, మరొకటి కబడ్డీ గేమ్ ఆడేటప్పుడు అని తెలుస్తోంది. ఇలా డబుల్ పోస్టర్స్‌తో ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్ ఇచ్చారు మహేశ్‌బాబు. జయరాం, జగపతిబాబు, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్ స్వరకర్త. సంక్రాంతి సందర్భంగా 'గుంటూరు కారం'ను జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇక ప్రస్తుతం వెకేషన్‌లో భాగంగా ఫారిన్‌లో ఉన్నారు మహేశ్‌బాబు. ఈ నెల మూడో వారంలో ఇండియా చేరుకుంటారని, నాలుగో వారంలో 'గుంటూరు కారం' సినిమా షూట్‌లో జాయిన్ అవుతారని తెలుస్తోంది.


• రామ్, శ్రీలీల

రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన సినిమా 'స్కంద'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. తాజాగా రామ్, శ్రీలీలపై చిత్రీకరించిన పాటతో 'స్కంద' షూటింగ్ పూర్తయినట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 15న విడుదల కానుంది.

పెళ్లి అనే చాప్టర్‌లోకి అడుగుపెడతా

- విజయ్ దేవరకొండ


• హేషమ్ అబ్దుల్ వాహబ్, శివ నిర్వాణ, విజయ్ దేవరకొండ, రవిశంకర్, నవీన్

''**ఒ**కప్పుడు నా దగ్గర ఎవరూ పెళ్లి మాట ఎత్తేవారు కాదు. కానీ ఇప్పుడు పెళ్లెప్పుడు అని అడుగుతున్నారు. ఈ మధ్య నా ఫ్రెండ్స్ పెళ్లి చేసుకోవడం, వాళ్ల జీవితాలు చూస్తుంటే నాకు పెళ్లి మీద అయిష్టం పోయింది. పెళ్లనేది లైఫ్‌లో ముఖ్యమైన భాగం. నేనూ ఆ చాప్టర్‌లోకి అడుగుపెడతాను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. వై. రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకలో విజయ్ దేవరకొండ మాటాడుతూ- ''ఆ మధ్య ప్రేమ కథలపై నాకు ఆసక్తి తగ్గింది. 'ఖుషి' కథ విన్నాక మళ్లీ ప్రేమ కథల్లో నటించాలనే ఆసక్తి కలిగింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా మన కథలను చూపించే చాన్స్ దక్కుతోంది. ఇలాంటి టైమ్‌లో నేను హీరోగా ఉండటం అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నాను. నేను యాక్టర్ అవుతానని ఊహించి ఉంటే పాన్ ఇండియా లాంగ్వేజెస్ అన్నీ నేర్చుకునేవాణ్ని. సమంత మయోసైటిస్ నుంచి కోలుకుంటే చాలనుకున్నాం. ఆమె కోసం ఆర్నెల్లు కాదు.. పదేళ్లయినా వేచి చూసేవాళ్లం'' అన్నారు. ''ఖుషి'ని ఇంత అందంగా తీర్చిదిద్దిన మా టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు నవీన్ యెర్నేని. ''ఖుషి'లో లవ్, సెలబ్రేషన్ ఉంటాయి'' అన్నారు శివ నిర్వాణ. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: జి. మురళి.



తెలుగమ్మాయి కావడం నాకు ప్లస్

- కావ్య కల్యాణ్ రామ్

''**తె**లుగు పరిశ్రమలో తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావటం లేదని ఎందుకు అంటున్నారో అర్థం కావటం లేదు. సావిత్రి, శ్రీదేవి.. వంటి తెలుగు హీరోయిన్లు పెద్ద సక్సెస్‌ను సాధించారు. ఇండియా వైడ్ వాళ్ల కంటే సక్సెస్‌ను ఎవరూ చూడలేదు. నా విషయానికొస్తే తెలుగు అమ్మాయి కావటం నాకు ప్లస్'' అని కావ్య కల్యాణ్ రామ్ అన్నారు. శ్రీ సింహా కోడూరి, కావ్య జంటగా నటించిన చిత్రం 'ఉస్తాద్'. ఫణిదీప్ దర్శకత్వంలో రజినీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, హిమాంక్ రెడ్డి దువ్వూరు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కావ్య కల్యాణ్ రామ్ మాట్లాడుతూ- ''ఉస్తాద్‌లో సూర్య అనే పాత్రలో శ్రీ సింహా కనిపిస్తారు. తన బైక్‌ను ఉస్తాద్ అని పిలుచుకుంటుంటాడు. ఇందులో సూర్య ప్రేయసి మేఘనగా నటించాను. నా పాత్ర నేటి తరం అమ్మాయిలకు కనెక్ట్ అవుతుంది. ఇవాళ రజనీకాంత్‌గారి 'జైలర్', శుక్రవారం చిరంజీవిగారి 'భోళా శంకర్', శనివారం మా 'ఉస్తాద్' రిలీజవుతున్నాయి. ఆ ఇద్దరు లెజెండ్స్ సినిమాలను చూసే ప్రేక్షకుల్లో సగం మంది అయినా మా సినిమాను చూస్తే చాలు. మా సినిమా హిట్'' అన్నారు.

మలయాళ దర్శకుడు సిద్ధిఖీ కన్నుమూత



మలయాళ ప్రముఖ దర్శక-నిర్మాత-నటుడు-రచయిత సిద్ధిఖీ ఇస్మాయిల్ (63) కన్నుమూశారు. గుండెపోటు కారణంగా కొచ్చిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరిన సిద్ధిఖీ పలు ఆరోగ్య సమస్యల కారణంగా తుదిశ్వాస విడిచారని సమాచారం. 1960 ఆగస్టు 1న కొచ్చిలో జన్మించారు సిద్ధిఖీ. తొలుత మలయాళ దర్శకుడు ఫాజిల్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. కొంత కాలం అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాక మరో అసిస్టెంట్ డైరెక్టర్ లాల్‌తో కలిసి తొలి సినిమా 'రామ్‌జీ రావ్ స్పీకింగ్' (1989)కి దర్శకత్వం వహించారు సిద్ధిఖీ. ఆ చిత్రం ఘనవిజయం సాధించింది. ఆ తర్వాత సిద్ధిఖీ, లాల్ కలిసి పలు సినిమాలను తెరకెక్కించారు. 'కాబూలీవాలా' తర్వాత సిద్ధిఖీ-లాల్ దర్శకులుగా విడిపోయారు. ఆ తర్వాత మమ్ముట్టీతో సిద్ధిఖీ తెరకెక్కించిన 'హిట్లర్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 'హిట్లర్' తెలుగు రీమేక్‌లో చిరంజీవి హీరోగా నటించగా, ముత్యాల సుబ్బయ్య దర్శకత్వం వహించారు. ఇక దర్శకుడిగా పలు తమిళ, మలయాళ చిత్రాలను తెరకెక్కించారు సిద్ధిఖీ. 2010లో దిలీప్, నయనతార హీరో హీరోయిన్లుగా సిద్ధిఖీ దర్శకత్వంలో వచ్చిన 'బాడీగార్డ్' సూపర్‌డూపర్ హిట్ సాధించింది. ఈ సినిమా తెలుగు రీమేక్‌లో వెంకటేశ్, తమిళంలో విజయ్, హిందీలో సల్మాన్ ఖాన్ నటించారు. సిద్ధిఖీ చివరి సినిమా 'బిగ్ బ్రదర్' 2020లో విడుదలైంది. ఇక తెలుగులో నితిన్ హీరోగా సిద్ధిఖీ 'మారో' (2011) చిత్రానికి దర్శకత్వం వహించారు. సిద్ధిఖీ మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆత్మగౌరవం నేపథ్యంలో...


• అమల

లక్ష్మణ్ చిన్నా ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'నచ్చినవాడు'. ఈ సినిమాలోని 'తోడై నువ్వుండక..' పాట లిరికల్ వీడియోను అక్కినేని అమల విడుదల చేసి, సినిమా హిట్ అవ్వాలన్నారు. ''మహిళల ఆత్మగౌరవం నేపథ్యంలో అల్లిన ప్రేమకథా చిత్రం ఇది. కామెడీ, నేటి యువతరానికి కావాల్సిన అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు లక్ష్మణ్. రమేష్, కె. దర్శన్, నాగేంద్ర అరుసు, లలిత నాయక్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు మిజో జోసెఫ్ స్వరకర్త.

రీల్స్

మై హూ డాన్


• రణ్‌వీర్ సింగ్

బాలీవుడ్‌లో కొత్త డాన్ వచ్చాడు. 'మై హూ డాన్' అంటున్నారు రణ్‌వీర్ సింగ్. షారుక్ ఖాన్ హీరోగా 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్', 'డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్' సినిమాలను డైరెక్ట్ చేసిన ఫర్హాన్ అక్తర్ బుధవారం 'డాన్ 3' సినిమాను ప్రకటించారు. ఇందులో డాన్‌గా రణ్‌వీర్ సింగ్ నటించనున్నట్లు వెల్లడించారు. 'నిద్ర పోతున్న సింహం లేచిందని ప్రపంచానికి తెలియాలి.. వెళ్లి చెప్పు.. నేను తిరిగొస్తున్నానని', 'నేనే డాన్‌ని..' అనే డైలాగ్స్ 'డాన్ 3' అనౌన్స్‌మెంట్ వీడియోలో వినిపిస్తాయి. 'డాన్ 3' సినిమా షూటింగ్‌ను ఈ ఏడాది చివర్లో ప్రారంభించి, 2025లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

అనుకున్న ఓపెనింగ్స్ వస్తాయి


• అనిల్ సుంకర


''**మా**స్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సాగే చిత్రం 'భోళా శంకర్'. బ్రదర్-సిస్టర్ ఎమోషన్ అందరికీ కనెక్ట్ అవుతుంది. మేం అనుకున్న ఓపెనింగ్స్ కచ్చితంగా వస్తాయి'' అన్నారు అనిల్ సుంకర. చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'భోళా శంకర్'. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజవుతోంది. అనిల్ సుంకర మాట్లాడుతూ- ''సరిలేరు నీకెవ్వరు' సినిమా వేడుక కోసం చిరంజీవిగారిని ఆహ్వానించడానికి వెళ్లినప్పుడు 'మనం సినిమా చేస్తున్నాం' అన్నారాయన. అలా 'వేదాళం' రీమేక్‌ని ఆయనతో 'భోళా శంకర్'గా రూపొందించాం. ప్రస్తుతం మా 14 రీల్స్‌లో బెల్లంకొండ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేస్తున్నాం'' అన్నారు.

పొల్లాచ్చిలో ఆటా పాటా


• విరాట్, శ్రీకాంత్, ప్రగతి

విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ద కాపు-1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని చివరి పాట చిత్రీకరణ పొల్లాచ్చిలో జరుగుతోంది. హీరో, హీరోయిన్లపై చిత్రీకరిస్తున్న ఈ పాటకు రాజు సుందరం కొరియోగ్రాఫర్. ''అణచివేత, ఘర్షణల నేపథ్యంలో సాగే చిత్రమిది. న్యూ ఏజ్ పొలిటికల్ డ్రామాగా రూపొందుతోంది. పొల్లాచ్చిలో తీస్తున్న పాటతో షూటింగ్ పూర్తవుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

నవ్వించే పార్ట్‌నర్


• హన్సిక, ఆది పినిశెట్టి

ఆది పినిశెట్టి, హన్సిక హీరో హీరోయిన్లుగా మనోజ్ దామోదరన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పార్ట్‌నర్'. ఫ్యాంటసీ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని బీజీ గోవింద్‌రాజు సమర్పణలో ఎంఎస్ మురళీధర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. 'హిలేరియస్ ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్‌గా అందర్నీ అలరించేలా మా సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	149	65,996
నిఫ్టీ ▲	62	19,633

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,793	▽	92
డోజోన్స్	35,247	▽	67
ఎఫ్‌టీఎస్ఈ 100	7,587	▲	60
డాక్స్	15,853	▲	78
షాంఘై	3,244	▽	16
నికాయ్	32,204	▽	173

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	58,901	▲	11
బంగారం (99.5 స్వచ్ఛత)	59,137	▲	11
వెండి (కిలో)	70,127	▽	797

మెర్సిడెస్ కొత్త జీఎల్‌సీ



న్యూఢిల్లీ: లగ్జరీ వాహనాల తయారీలో ఉన్న మెర్సిడెస్–బెంజ్ ప్రీమియం ఎస్‌యూవీ జీఎల్‌సీ కొత్త వెర్షన్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ఈ కారు ప్రారంభ ధర రూ.73.5 లక్షలు. పెట్రోల్, డీజిల్ పవర్‌ట్రెయిన్స్‌తో లభిస్తుంది. ఇప్పటికే 1,500ల పైచిలుకు బుకింగ్స్ నమోదయ్యాయని కంపెనీ ప్రకటించింది. భారత్‌లో మెర్సిడెస్‌కు అత్యధికంగా అమ్ముడవుతున్న ఎస్‌యూవీ ఇదే. తొలిసారిగా మెర్సిడెస్ కార్లలో ఎన్‌టీజీ 7 ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను పొందుపరిచారు. 2 లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో తయారైన జీఎల్‌సీ 300 4మేటిక్ గరిష్ట వేగం గంటకు 240 కిలోమీటర్లు.

జీఎంఆర్ పవర్‌కు రూ. 217 కోట్ల నష్టం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ పవర్, అర్బన్ ఇన్‌ఫ్రా జూన్ త్రైమాసికంలో రూ.217 కోట్ల నష్టం చవిచూసింది. గతేడాది ఇదే కాలంలో కంపెనీ రూ.201 కోట్ల నికరలాభం నమోదు చేసింది. టర్నోవర్ రూ.1,163 కోట్ల నుంచి రూ.1,190 కోట్లకు ఎగసింది. ఫలితాల నేపథ్యంలో జీఎంఆర్ పవర్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో బుధవారం 8.42 శాతం అధికమై రూ.21.38 వద్ద స్థిరపడింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-8-2023	
విశాఖ	455-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	445-00
రిటైల్ ధర (డజను)	72.00
9-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

జీఎస్‌టీ మార్పులకు కేబినెట్ ఓకే

- ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందెం క్లబ్‌లపై 28 శాతం పన్ను
- ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందెం క్లబ్‌లలో బెట్టింగ్‌ల ప్రవేశ స్థాయి పూర్తి ముఖ విలువపై 28 శాతం పన్ను విధించేలా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) చట్టాల్లో మార్పులకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపిందని అత్యున్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ), ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) చట్టాల్లో సవరణలకు ఆగస్టు 2వ తేదీన జరిగిన 51వ జీఎస్‌టీ మండలి భేటీలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. సంబంధిత చట్ట సవరణలను ఆగస్టు 11న ముగియనున్న ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టవచ్చని ఆ వర్గాలు వెల్లడించాయి. ప్రవేశ స్థాయి పందెం పూర్తి ముఖ విలువపై 28% జీఎస్‌టీ విధించడం వల్ల ఈ పన్ను రాబడులు పెరుగుతాయి. రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపు నిబంధనలను పాటించడంలో విఫలమైతే, విదేశాల్లోని ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు యాక్సెస్ నిరోధించడం కూడా సవరణల్లో భాగంగా ఉన్నట్లు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.

అక్టోబర్ నుంచి అమల్లోకి

జీఎస్‌టీ చట్టాలలో సవరించిన నిబంధనలు అక్టోబర్ 1 నుండి అమలులోకి వస్తాయి. ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ మనీ గేమింగ్‌లతోపాటు ఆన్‌లైన్ గేమ్‌లకు చెల్లించడానికి ఉపయోగించే వర్చువల్ డిజిటల్ అసెట్స్ అలాగే ఆన్‌లైన్ గేమింగ్ విషయంలో సప్లయర్ వంటి పదాలకు తాజా సవరణలలో విస్పష్ట నిర్వచనాలు కూడా ఉండడం గమనార్హం. అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ప్రతినిధులతో కూడిన ఆగస్టు 2 మండలి సమావేశం అనంతరం, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సీజీఎస్‌టీ, ఐజీఎస్‌టీ సవరణలు ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఈ నిర్ణయాల విషయంలో రాష్ట్రాలు తమ తమ అసెంబ్లీలలో రాష్ట్ర జీఎస్‌టీ చట్టానికి సవరణలను ఆమోదిస్తాయి.

ప్రస్తుత పన్నుల తీరు

ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ, కొన్ని గుర్రపు పందెం క్లబ్‌లు ప్రస్తుతం ప్లాట్‌ఫారమ్ ఫీజు/కమీషన్ (5–20%) పూర్తి ముఖ విలువలో 18% చొప్పున జీఎస్‌టీని చెల్లిస్తున్నాయి. అయితే కొన్ని గుర్రపు పందెం క్లబ్‌లు పూర్తి ముఖ విలువపై 28% చెల్లిస్తున్నాయి. బెట్టింగ్, జూదం రూపంలో చర్య తీసుకోగల క్లెయిమ్‌లపై విధిస్తున్న ఈ తరహా 28% లెవీపై ఆయా క్లబ్‌లు న్యాయపోరాటం చేస్తున్నాయి. క్యాసినోలూ ప్రస్తుతం స్థూల గేమింగ్ రెవెన్యూ (జీజీఆర్)పై 28% జీఎస్‌టీ చెల్లిస్తున్నాయి. ప్రవేశ స్థాయి పందెం పూర్తి ముఖ విలువపై 28% జీఎస్‌టీ వల్ల ఖజానాకు మరింత మొత్తం సమకూరనుంది.

మూడు రోజుల్లోనే లిస్టింగ్

- సెబీ తాజా నిర్ణయం
- ఐపీవో ఇన్వెస్టర్లకు ప్రయోజనం



న్యూఢిల్లీ: ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)లకు సంబంధించి సెబీ సానుకూల నిర్ణయం తీసుకుంది. ఐపీవో ఇష్యూ ముగిసిన రోజు నుంచి ఆరు పని దినాల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో ప్రస్తుతం లిస్ట్ కావాల్సి ఉండగా, దీన్ని మూడు రోజులకు తగ్గించింది. అంటే ఇకపై ఐపీవో ముగిసిన రోజు తర్వాత నుంచి మూడో పనిదినం రోజున ఆ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కావాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 1, ఆ తర్వాత నుంచి వచ్చే ఐపీవోలకు మూడు రోజుల లిస్టింగ్ నిబంధన ఐచ్ఛికమే. అంటే ఇప్పటి మాదిరే ఆరు రోజులు (టీప్లస్6) లేదంటే మూడు రోజుల గడువు (టీప్లస్3)ను కంపెనీలు అనుసరించొచ్చు. కానీ, డిసెంబర్ 1 నుంచి మాత్రం విధిగా అన్ని ఐపీవోలు మూడు రోజుల లిస్టింగ్ నిబంధననే అమలు చేయాల్సి ఉంటుందని సెబీ తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

అందరికీ అనుకూలమే

సెబీ నిర్ణయం చిన్న ఇన్వెస్టర్ల నుంచి పెద్ద ఇన్వెస్టర్ల వరకు ఎంతో ప్రయోజనం కలిగించనుంది. షేర్ల కేటాయింపు లేకపోతే బ్యాంక్ ఖాతాల్లో బ్లాక్ అయిన నిధులు తొందరగా విడుదల అవుతాయి. రుణం తీసుకుని ఐపీవోల్లో దరఖాస్తు చేసే హెచ్ఎన్ఐలు కూడా ఉంటారు. వీరికి రోజుల వారీగా రుణంపై వడ్డీ భారం పడుతుంది. తొందరగా లిస్ట్ అయితే, తాము తీసుకున్న రుణాన్ని తొందరగా తీర్చేసే వీలుంటుంది. అటు ఐపీవోకు వచ్చిన కంపెనీలకూ ప్రయోజనమే. ఎలా అంటే ఐపీవో నిధులను అవి వేగంగా పొందొచ్చు. ఏఎస్‌బీఏ కింద షేర్లు అలాట్ కాని వారి నిధులను బ్యాంకు ఖాతాల్లో టీప్లస్3 రోజున అన్‌బ్లాక్ చేయాల్సి ఉంటుంది. లేదంటే వారికి చెల్లించే పరిహారం అనేది టీప్లస్3 తర్వాతి రోజు నుంచి అమల్లోకి వస్తుందని సెబీ తెలిపింది.

టాటా పవర్ లాభం అప్



క్యూ1లో రూ. 1,141 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం టాటా పవర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 1,141 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 884 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,639 కోట్ల నుంచి రూ. 15,485 కోట్లకు ఎగసింది. వరుసగా 15వ త్రైమాసికంలోనూ పటిష్ట లాభాలు ఆర్జించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ ప్రవీర్ సిన్హా పేర్కొన్నారు. గ్రీన్‌ఎనర్జీ, ప్రసారం, పంపిణీ బిజినెస్‌లలో ఈ ఏడాది రూ. 12,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించే ప్రణాళికలున్నట్లు చెప్పారు.

టాటా పవర్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం బలపడి రూ. 235 వద్ద ముగిసింది.

తగ్గిన తాజ్ జీవీకే లాభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆతిథ్య రంగంలో ఉన్న తాజ్ జీవీకే హోటల్స్, రిసార్ట్స్ జూన్ త్రైమాసికంలో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.16 కోట్ల నుంచి రూ.13 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా రూ.30.5 కోట్ల నుంచి రూ.26 కోట్లకు పడిపోయింది. టర్నోవర్ రూ.86 కోట్ల నుంచి రూ.92 కోట్లకు ఎగసింది. ఫలితాల నేపథ్యంలో తాజ్ జీవీకే షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో బుధవారం 8.99 శాతం క్షీణించి రూ.251.95 వద్ద స్థిరపడింది.

ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో పతంజలి ఫుడ్స్



హైదరాబాద్: పతంజలి ఫుడ్స్ అస్సాం రాష్ట్రం తిన్‌సుకియా జిల్లాలో అస్సాం వ్యవసాయ శాఖ నిర్వహించిన 'ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్'లో పాల్గొంది. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు అస్సాం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, రాందేవ్ బాబాతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. పామాయిల్ సాగుకు 20 హెక్టార్ల పరిధిలో 2800 మొక్కలను ఎంపిక చేసిన రైతులకు పంపిణీ చేశారు.

నాట్కో రూ. 7 డివిడెండ్

క్యూ1లో లాభం రూ. 420 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఔషధ రంగ సంస్థ నాట్కో ఫార్మా రూ. 420 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో నమోదైన రూ. 320 కోట్లతో పోలిస్తే ఇది 31 శాతం అధికం. మరోవైపు, ఆదాయం రూ. 919 కోట్ల నుంచి సుమారు 26 శాతం వృద్ధి చెంది రూ. 1,160 కోట్లకు చేరింది. రూ. 2 ముఖ విలువ చేసే షేరు ఒక్కంటికి రూ. 7 చొప్పున కంపెనీ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ప్రధానంగా ఫార్ములేషన్ ఎగుమతులు పెరగడం, దేశీయంగా ఫార్మా.. ఆగ్రో వ్యాపార విభాగాలు వృద్ధి చెందడం తదితర అంశాలు మెరుగైన పనితీరుకు దోహదపడినట్లు వెల్లడించింది. పెండింగ్‌లో ఉన్న పేటెంటు ఉల్లంఘన లిటిగేషన్ కేసులకు సంబంధించి రూ. 51 కోట్లు కేటాయించినట్లు, అలాగే క్యూ1లో ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్‌ల కింద రూ. 17 కోట్లు చెల్లించినట్లు సంస్థ తెలిపింది.

ఆదుకున్న ఆఖర్లో కొనుగోళ్లు

- కనిష్ట స్థాయిల నుంచి రికవరీ
- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- 19,600 పాయింట్లపైకి నిఫ్టీ



ముంబై: ట్రేడింగ్ చివర్లో ఐటీ, మెటల్, ఆటో, ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బుధవారం కనిష్ట స్థాయిల నుంచి రికవరీ అయ్యాయి. ఇంట్రాడేలో 402 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 64 పాయింట్ల లాభంతో 65,996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 102 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 61 లాభంతో 19,633 వద్ద ముగిసింది. యూరప్ మార్కెట్ల సానుకూల ప్రభావం, నేడు వెలువడే ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ దేశీయ ఆర్థిక వృద్ధిపై ప్రభావాన్ని చూపదనే ఆశలు సూచీల నష్టాల రికవరీకి కలిసొచ్చాయి. అలాగే అధిక వెయిటేజీ ఐటీసీ, రిలయన్స్ షేర్లు ఒకశాతం వరకు రాణించి తమ వంతు తోడ్పాటు అందించాయి. బ్యాంకులు, ఫైనాన్స్, రియల్టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.57%, 0.39 శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 2,289 కోట్ల విలువైన షేర్లను అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.553 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. ఆసియాలో అధిక మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ సూచీలు లాభపడ్డాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- అదానీ విల్మార్ షేరు 4% నష్టపోయి రూ.378 వద్ద స్థిరపడింది. ప్రమోటర్ గౌతమ్ అదానీ ఈ కంపెనీలో వాటాను విక్రయించనున్నారనే వార్తలు షేరు పతనానికి కారణమయ్యాయి.
- జూన్ క్వార్టర్‌లో నికర లాభం 29.6% వృద్ధి చెందడంతో ఇక్రాన్ ఇంటర్నేషన్ షేరు 7% ర్యాలీ చేసి రూ.106.50 వద్ద నిలిచింది.
- ప్రోత్సాహకర తొలి త్రైమాసిక ఫలితాల ప్రకటనతో కళ్యాణ్ జ్యువెలరీ షేరు 3% లాభపడి రూ.183 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 6% ఎగసి రూ.189 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2023

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)ల్లో.. మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ అడిషన్ టెస్ట్(క్యాట్)-2023 నోటిఫికేషన్ విడుదలైంది.

» **దేశవ్యాప్తంగా ఉన్న ఐఐఎంలు:** అహ్మదాబాద్, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయ, కోల్‌కతా, ఇండోర్, జమ్మూ, కాశీపూర్, కోజికోడ్, లక్నో, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు ఉన్నా అర్హులే). డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** అనంతపురం,చిత్తూరు,గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్. ఈ ఏడాది దేశవ్యాప్తంగా మొత్తం 155 నగరాల్లో పరీక్షను నిర్వహించనున్నారు.

» **పరీక్ష విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్–1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రెహెన్షన్, సెక్షన్–2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్,సెక్షన్–3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగాల్లో ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్,రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 13.09.2023
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** 25.10.2023 నుంచి 26.11.2023 వరకు.
» **పరీక్ష తేది:** 26.11.2023.
» **ఫలితాల ప్రకటన:**2024 జనవరి రెండో వారం
» **వెబ్‌సైట్:** https://iimcat.ac.in

గేట్-2024

ఐఐటీలు, నిట్‌లు వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో పీజీ, డాక్టోరల్ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)–2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్ష స్కోరు ఉన్నత విద్యతోపాటు పలు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల ఎంపికకు ఉపయోగపడుతుంది. ఈసారి గేట్‌ను బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) నిర్వహించనుంది.

» **అర్హత:** ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్, హ్యుమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **వయసు:** గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

» **పరీక్ష విధానం:** అభ్యర్థులను కంప్యూటర్ ఆధారిత పరీక్షలో వచ్చిన స్కోర్ ఆధారంగా ఎంపికచేస్తారు. పరీక్షకు 3 గంటల వ్యవధి ఉంటుంది. అభ్యర్థులు 1 లేదా 2 పేపర్లను ఎంపికచేసుకోవచ్చు. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 24.08.2023
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 29.09.2023.
» **అపరాధ రుసుముతో దరఖాస్తుకు చివరితేది:** 13.10.2023.
» **పరీక్ష తేదీలు:** 03.02.2024, 04.02.2024, 10.02.2024, 11.02.2024.
» **పరీక్ష ఫలితాల విడుదల తేది:** 16.03.2023.
» **వెబ్‌సైట్:** https://gate2024.iisc.ac.in

ఏపీపీఎస్సీ-ఆర్ఐఎంసీలో ఎనిమిదో తరగతిలో ప్రవేశాలు

ఏపీపీఎస్సీ ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ(ఆర్ఐఎంసీ)లో జూలై–2024 టర్మ్ ఎనిమిదో తరగతిలో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2024 జూలై నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.
» **వయసు:** 01.07.2024 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. 02.07.2011 నుంచి 01.01.2013 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వోస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించాలి. ఆర్ఐఎంసీ పంపిన దరఖాస్తు ఫారం నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి అసిస్టెంట్ సెక్రటరీ(ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ కార్యాలయం దగ్గర, ఎంజీ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.10.2023.
» **పరీక్ష తేది:** 02.12.2023.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

» ఫ్రాన్స్‌లో అయిదేళ్లు పోస్ట్ స్టడీ వర్క్ అవకాశం
» చదువు పూర్తి చేసుకుంటూనే కొలువుకు దరఖాస్తు
» అయిదేళ్ల తర్వాత పర్మనెంట్ రెసిడెన్సీకి మార్గం
» ఐదేళ్ల షెన్‌జెన్ వీసాలు ఇవ్వనున్నట్లు వెల్లడి

ఫ్రాన్స్‌లో.. చదువు.. కొలువు!

ఫ్రాన్స్ ప్రభుత్వం భారతీయ విద్యార్థులకు మేలు చేసే నిర్ణయం తీసుకుంది! ఆ దేశంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరిన భారత విద్యార్థులు.. కోర్సు పూర్తయ్యాక అయిదేళ్లపాటు అక్కడే ఉండి ఉద్యోగం చేసుకోవచ్చని పేర్కొంది. అంటే.. పోస్ట్ స్టడీ వర్క్ గడువును అయిదేళ్లకు పెంచింది. దీంతోపాటు తాజాగా భారత విద్యార్థులకు ఐదేళ్ల కాలపరిమితితో షెన్‌జెన్ వీసాలను జారీ చేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో.. ఫ్రాన్స్‌లో ఉన్నత విద్య, పోస్ట్ స్టడీ వర్క్ తాజా నిబంధనలు, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..



ఫ్రాన్స్.. మన దేశ స్టడీ అబ్రాడ్ విద్యార్థులకు టాప్–10 దేశాల జాబితాలో నిలుస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం–2019లో పది వేల మంది భారత విద్యార్థులు ఆ దేశంలోని వివిధ యూనివర్సిటీల్లో చేరారు. కోవిడ్ కారణంగా 2020, 2021లలో మాత్రం ఆ సంఖ్య ఎనిమిది వేలు చొప్పున ఉంది.

ఐదేళ్ల షెన్‌జెన్ వీసా

ఇటీవల కాలంలో భారత విద్యార్థులను ఆకట్టుకునేలా ఫ్రాన్స్ ప్రభుత్వం పలు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా 2030 నాటికి కనీసం 30 వేల మంది భారత విద్యార్థులను ఆకర్షించేలా నిబంధనలను సరళీకృతం చేస్తోంది. అందుకోసం ఇప్పటికే ఐదేళ్ల పోస్ట్ స్టడీ వర్క్‌ను ప్రకటించిన ఆ దేశం.. తాజాగా ఐదేళ్ల కాల పరిమితితో షెన్‌జెన్ వీసాలను జారీ చేసే యోచనలో ఉన్నట్లు తెలిపింది. ఫ్రాన్స్‌లో కనీసం ఒక సెమిస్టర్ చదివి ఉండి.. భారత్, ఫ్రాన్స్ లేదా మరే దేశంలోనైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ స్థాయి కోర్సులు పూర్తిచేసిన భారతీయులు ఈ వీసా పొందేందుకు అర్హులని ఫ్రాన్స్ ఎంబసీ అధికారక ప్రకటనలో వెల్లడించింది.

పోస్ట్ స్టడీ వర్క్

భారత విద్యార్థులను ఆకట్టుకునే చర్యల్లో భాగంగా ఫ్రాన్స్ పోస్ట్ స్టడీ వర్క్ గడువును అయిదేళ్లకు పెంచింది. ప్రస్తుతం ఈ గడువు రెండేళ్లుగా ఉంది. ఈ ఏడాది నుంచి దీన్ని అయిదేళ్లకు పెంచుతూ కొద్దిరోజుల క్రితమే ప్రకటన విడుదలైంది. ఫ్రాన్స్‌లో పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలు కోరుకునే విద్యార్థులు ఏపీఎస్ పేరిట జారీ చేసే టెంపరరీ రెసిడెంట్ పర్మిట్(తాత్కాలిక నివాస అనుమతి)కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతి పొందిన వారు తమ కోర్సు పూర్తయ్యాక ఏడాది కాలం ఫ్రాన్స్‌లోనే ఉండి.. ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఈ సమయంలో వారు వారానికి 20 గంటలు, ఏడాదికి గరిష్టంగా 964 గంటలు పార్ట్ టైమ్ జాబ్ చేసుకుంటూ శాశ్వత కొలువు కోసం అన్వేషణ సాగించొచ్చు.

టెంపరరీ ఎంప్లాయీ పర్మిట్

పోస్ట్ స్టడీ వర్క్ విధానంలో భాగంగా ముందుగా టెంపరరీ ఎంప్లాయీ లేదా టెంపరరీ వర్కర్ రెసిడెంట్ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దీనికి దరఖాస్తు చేసుకునే ముందు అభ్యర్థులు కనీస వేతన నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగం పొందాల్సి ఉంటుంది. టెంపరరీ రెసిడెంట్ ఎంప్లాయి పర్మిట్ పూర్తయ్యాక లేదా ఉద్యోగ గడువు ముగిశాక.. పూర్తి స్థాయి రెసిడెంట్ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తర్వాత అక్కడే శాశ్వత నివాసం ఉంటూ ఉద్యోగం కొనసాగించొచ్చు.

ఈ రంగాల్లో డిమాండ్

ఫ్రాన్స్‌లో మాన్యుఫ్యాక్చరింగ్, మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్, హాస్పిటాలిటీ, టూరిజం సెక్టార్స్ ఉద్యోగాలు కల్పించడంలో ముందంజలో నిలుస్తున్నాయి. వీటిలో.. ఇంజనీర్స్, మేనేజర్స్, ప్రోగ్రామర్స్, అగ్రికల్చరల్ ఇంజనీర్స్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. టూరిజం సెక్టార్‌లోనూ ప్లానర్స్, హోటల్ మేనేజర్స్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు.

ప్రముఖ వర్సిటీలకు కేరాఫ్

ఫ్రాన్స్ పలు ప్రముఖ యూనివర్సిటీలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఎకోల్ నార్మల్ సుపీరియర్; ఎకోల్ పాలిటెక్నిక్; యూనివర్సిటీ పియెర్రె ఎట్ మేరీ క్యూరీ; సెంట్రల్ సుపీలెక్; ఎకోల్ నార్మల్ సుపీరియర్ డె లియన్; యూనివర్సిటీ గ్రెనోబల్; ప్యారిస్ యూనివర్సిటీ; యూనివర్సిటీ డి స్ట్రాస్‌బర్గ్; ప్యారిస్ యూనివర్సిటీ డిడెరట్; యూనివర్సిటీ డి మాంట్‌పెల్లెర్ వంటి పలు ప్రముఖ యూనివర్సిటీలు ఉన్నాయి. పీఎస్ఎల్ రీసెర్చ్ యూనివర్సిటీ, సార్‌బోన్ యూనివర్సిటీలకు క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లోనూ చోటు లభిస్తోంది.

ఫీజులు

ఫ్రాన్స్‌లోని ప్రభుత్వ యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఫీజులు తక్కువగానే ఉంటాయి. ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల వార్షిక ఫీజు 620 యూరోలుగా; మేనేజ్‌మెంట్ కోర్సుల ఫీజు 4,500 యూరోల నుంచి ఏడు వేల యూరోల వరకు ఉంటుంది. హ్యూమానిటీస్,ఆర్ట్స్ తదితర ట్రెడిషనల్ కోర్సులకు సగటున ఏడాదికి 270 యూరోలుగా ఉంటోంది. ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్స్‌లో మాత్రం ఈ ఫీజులు రెట్టింపు స్థాయిలో ఉంటాయి.

నివాస ఖర్చులు

ఆ దేశంలో నివాస ఖర్చులు విద్యార్థులకు అందుబాటులోనే ఉంటాయి. సాధారణ జీవనశైలికి నెలకు 500 నుంచి 600ల యూరోల వరకు ఖర్చు అవుతుంది. ఈ మొత్తంలోనే వసతి, ట్రాన్స్‌పోర్ట్, ఇతర వ్యక్తిగత అవసరాలు తీర్చుకునే అవకాశం ఉంటుంది. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఈ వ్యయం 400ల యూరోల నుంచి 500 యూరోల మధ్యలో ఉంటోంది.

స్కాలర్‌షిప్

ఫ్రాన్స్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు పలు స్కాలర్‌షిప్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.భారత్–ఫ్రాన్స్ మధ్య ప్రత్యేకంగా ఉన్న ఒప్పందం ఫలితంగా అండర్ గ్రాడ్యుయేట్(బ్యాచిలర్ డిగ్రీ), మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ వరకు పలు స్కాలర్‌షిప్‌లు లభిస్తున్నాయి. అవి..

- చర్పక్ ఏఎంఈ స్కాలర్‌షిప్(మాస్టర్స్ ప్రోగ్రామ్): ఈ పథకం ప్రకారం–రెండేళ్ల మాస్టర్ ప్రోగ్రామ్‌లో ఒక విద్యా సంవత్సరానికి(పది నెలల వ్యవధి) గాను ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు, 615 యూరోల నివాస వ్యయ మొత్తం లభిస్తాయి.
- పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన అభ్యర్థులకు భారత శాస్త్ర సాంకేతిక శాఖ, ఫ్రాన్స్ ఎంబసీలు సంయుక్తంగా రామన్ చర్పక్-పీహెచ్‌డీ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. దీని ప్రకారం–గరిష్టంగా ఆరు నెలల వరకు ఫ్రాన్స్‌లో ఉండి ఎలాంటి ఖర్చు లేకుండా పరిశోధనలు కొనసాగించొచ్చు.
- వీటితోపాటు ఈఐఎఫ్ఎఫ్ఈఎల్ స్కాలర్‌షిప్; ఎరాస్‌మస్ ముండస్ స్కాలర్‌షిప్; చర్పక్ ఏఎంఈ స్కాలర్‌షిప్ వంటి కూడా ఉన్నాయి.

పార్ట్ టైమ్ వర్క్

ఫ్రాన్స్‌లో అడుగుపెట్టిన విద్యార్థులు.. స్టడీ ఎట్ వర్క్ విధానంలో పార్ట్ టైమ్ ఉద్యోగం చేసుకునే అవకాశం కూడా ఉంది. వారానికి 20 గంటలు మించకుండా ఏదైనా పార్ట్‌టైమ్ కొలువు చేయొచ్చు. యూనివర్సిటీల్లో రీసెర్చ్ ఫ్యాకల్టీ వద్ద రీసెర్చ్ అసిస్టెంట్‌గా చేరొచ్చు. నాన్–సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు సూపర్ మార్కెట్స్, హాస్పిటల్స్, టూరిజం ఏజెన్సీల్లో పనిచేసే అవకాశం లభిస్తోంది. వారానికి కనీసం 60 యూరోలు ఆదాయం పొందే వీలుంది. దీని ద్వారా నివాస ఖర్చుల భారం నుంచి కొంత ఉపశమనం పొందొచ్చు.

ఇంటర్న్‌షిప్

ఫ్రాన్స్‌లో అడుగుపెట్టిన భారత విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేసే సదుపాయం కూడా అందుబాటులో ఉంది. ఆ దేశంలో గ్రాండ్స్ ఎకోల్స్‌గా పిలిచే ఎలైట్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు.. యూరోపియన్ యూనియన్‌లో స్కెంజెన్ దేశాలుగా పిలిచే 26 దేశాల్లో(ఫ్రాన్స్ సహా) ఇంటర్న్‌షిప్ చేయొచ్చు. ఈ విషయంలో ప్రత్యేకంగా ఎలాంటి వీసాలు పొందక్కర్లేదు. అంటే.. ఫ్రాన్స్‌లోని ఒక ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన విద్యార్థికి తమ అకడమిక్ కోర్సులో భాగంగా జర్మనీలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. దీనిద్వారా విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో ప్రతిభ చూపి.. అదే సంస్థలో శాశ్వత కొలువు పొందొచ్చు.

వేతనాలు ఆకర్షణీయం

ఫ్రాన్స్‌లోని పలు రంగాలకు చెందిన సంస్థలు ఆకర్షణీయ వేతనాలను అందిస్తున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం–సగటు వేతనం నెలకు రూ.3,085 యూరోలుగా ఉంది. కనీస వేతనం నెలకు రూ.1,708 యూరోలు ఉండాలనే నిబంధనను ఫ్రాన్స్ ప్రభుత్వం అమలు చేస్తోంది.

ఇంగ్లిష్, ఫ్రెంచ్

ఫ్రాన్స్‌లో ఉద్యోగం చేయాలనుకుంటున్న భారత విద్యార్థులకు ఇంగ్లిష్, ఫ్రెంచ్ నైపుణ్యాలు దోహదపడతాయి. ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ. అంతర్జాతీయంగా ఉన్న తన ఎంబసీల ద్వారా ఫ్రెంచ్ లాంగ్వేజ్ ట్రెనింగ్ సదుపాయాలను కల్పిస్తోంది. కొన్ని దేశాల్లో నేరుగా, మరికొన్ని దేశాల్లో గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లతో ఒప్పందం ఆధారంగా ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటే.. ఫ్రెంచ్‌లో నైపుణ్యాన్ని పెంచుకుని అక్కడి కంపెనీల్లో కొలువుదీరే అవకాశం పొందొచ్చు.

స్పాన్సర్‌షిప్ లెటర్

పోస్ట్ స్టడీ వర్క్‌లో భాగంగా టెంపరరీ ఎంప్లాయి పర్మిట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు.. తప్పనిసరిగా ఎంప్లాయర్ ఇచ్చే స్పాన్సర్‌షిప్ లెటర్ కలిగుండాలి. దీని ఆధారంగానే టెంపరరీ ఎంప్లాయీ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. సదరు కంపెనీ ఫ్రాన్స్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ అయి ఉండాలనే నిబంధన కూడా ఉంది.

క్లుప్తంగా...

గూడ్స్ షెడ్ల ఆధునీకరణకు రూ.1,000 కోట్లు

సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కేఆర్‌కే రెడ్డి



జనగామ: సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో 100 గూడ్స్ వ్యాగన్ షెడ్ల ఆధునీకరణకు కేంద్రం రూ.1,018 కోట్లు కేటాయించినట్లు సౌత్‌సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కేఆర్‌కే రెడ్డి తెలిపారు. జనగామ రైల్వేస్టేషన్‌లో బుధవారం జనగామ, యాదాద్రి జిల్లాల రైస్ మిల్లర్స్, ఎఫ్‌సీఐ, సివిల్ సప్లైస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ, ఏపీలో ఏటా ధాన్యం దిగుబడులు రికార్డు స్థాయిలో పెరుగుతుండటంతో అంతే మొత్తంలో ఎగుమతి చేస్తున్నామన్నారు. ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో ఒక్క ఆగస్టు నెలలోనే తమిళనాడు, కేరళ, జార్ఖండ్, బిహార్ రాష్ట్రాలకు 139 గూడ్స్ రైళ్ల ద్వారా తెలంగాణ, ఏపీ నుంచి బియ్యం ఎగుమతి చేశామని తెలిపారు. కాకినాడ గూడ్స్ షెడ్డును ఒన్‌క్లాస్‌గా మార్చేందుకు రూ.70 కోట్లు మంజూరు చేసినట్లు కేఆర్‌కే రెడ్డి వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి వరకు ఫేస్–2 లైన్‌కు అనుమతులు రావడంతో గూడ్స్ వ్యాగన్ పాయింట్ ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై మిల్లర్లతో చర్చిస్తున్నట్లు వివరించారు.

పాలమూరు మీదుగా వందేభారత్ పరుగులు

ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరు జిల్లా మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పరుగులు పెట్టింది. కాచిగూడ నుంచి డోన్ వరకు వందేభారత్ రైలు ట్రయల్ రన్‌ను బుధవారం నిర్వహించారు. ఉదయం 11.50 గంటలకు మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలు.. నిమిషం పాటు ఆగింది. అక్కడి నుంచి జోగుళాంబ గద్వాల, కర్నూలు మీదుగా డోన్ వరకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మహబూబ్‌నగర్ స్టేషన్ మీదుగా వందేభారత్ రైలు కాచిగూడకు వెళ్లింది. ట్రయల్‌రన్‌లో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ లోకేశ్ వైష్ణోయ్ పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆగస్టు 28 వరకు ఆంక్షలు



ఎయిర్‌పోర్టులో భద్రతాదళాల బందోబస్తు

శంషాబాద్: పంద్రాగస్టు కారణంగా శంషాబాద్ విమానాశ్రయంలో ఈనెల పదో తేదీ నుంచి 28 వరకు హైఅలర్ట్ కొనసాగుతుందని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమయంలో విమానాశ్రయంలోకి సందర్శకుల అనుమతి ఉండదని, అలాగే ప్రయాణికులకు స్వాగతం, వీడ్కోలుకోసం ఒకరిద్దరే రావాలని సూచించారు. విద్యార్థులు, ఇతరులు విదేశాలకు వెళుతున్న సమయంలో అత్యధిక రద్దీ చోటు చేసుకోవడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, టెర్మినళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండటంతో కొందరు ప్రయాణికులు సమయానికి బోర్డింగ్ కాలేని పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో ఆత్మహత్యలపై కమిటీ వేయాలి

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: ట్రిపుల్ ఐటీల్లో ఆత్మహత్యలపై దర్యాప్తు కమిటీని నియమించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. మరో విద్యార్థి ప్రాణం పోకముందే సర్కారు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉన్నత విద్యకు నిలయాలైన ట్రిపుల్ ఐటీలను కేసీఆర్ ఆత్మహత్యలకు నిలయంగా మార్చారని బుధవారం ఆమె ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. ఇప్పటి వరకు బాసర ట్రిపుల్ ఐటీలో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా.. ఈ విద్యా సంవత్సరంలోనే నలుగురు ప్రాణాలు కోల్పోయినా దొరకు పట్టింపు లేదని మండిపడ్డారు. పేద విద్యార్థులకు పురుగుల అన్నం, మురుగు నీరు పెట్టి ఆత్మహత్యలకు ఉసిగొల్పుతున్నారని షర్మిల ఆరోపించారు. పేద బిడ్డల ఉన్నత విద్యకు వైఎస్సార్ ట్రిపుల్ ఐటీలను స్థాపిస్తే.. కేసీఆర్ వాటిపై నమ్మకమే లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ట్రిపుల్ ఐటీలో సీటు కోసం పోటీ పడిన విద్యార్థులు ఇప్పుడు సీటు కోసం అప్లై చేసుకోవడం కూడా మానేశారని షర్మిల తెలిపారు.

కోటి ఎకరాల మాగాణి

గతేడాది ఈ సమయంతో పోలిస్తే వరి, మొక్కజొన్న సాగు ఎక్కువే

పత్తి సాగులో మాత్రం వెనుకంజ ● సాధారణ సాగు విస్తీర్ణాన్ని మించి సోయాబీన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మాగాణి కోటి ఎకరాలకు చేరువలో ఉంది. భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అధిక వర్షాలతో ఓవైపు పంట నష్టం జరిగినా, మరోవైపు ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సమయానికి ఆయా పంటలవారీగా అధికంగానే సాగైందని చెప్పవచ్చు. ప్రస్తుత సమయానికి 14.66 లక్షల ఎకరాల్లో వరి, మొక్కజొన్న 59 వేల ఎకరాల్లో అధికంగా సాగైంది. అయితే పత్తిసాగులో కాస్త వెనుకబడి ఉన్నారు. గతేడాది ఇదే సమయానికి 47.27 లక్షల ఎకరాల్లో పత్తిసాగు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 44.49 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే సాధారణ సాగుతో పోలిస్తే 87.96 శాతం విస్తీర్ణంలోనే పత్తి సాగైంది. వాస్తవంగా ఈ ఏడాది 65 లక్షల నుంచి 70 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయించాలని వ్యవసాయశాఖ భావించింది. ఆ మేరకు రైతులకు పిలుపునిచ్చింది. కానీ సకాలంలో రుతుపవనాలు రాకపోవడం, కీలకమైన జూన్, జూలై రెండో వారం వరకు వర్షాలు లేకపోవడంతో అదను దాటిపోయింది. దీంతో పత్తి సాగు విస్తీర్ణం అనుకున్నదానికంటే గణనీయంగా తగ్గిందని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా వానాకాలం సాగు ఇలా

సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు

ఇప్పటివరకు సాగైంది 95.78 లక్షల ఎకరాలు

గతేడాది ఇదే సమయానికి 83.43 లక్షల ఎకరాలు


నాలుగు జిల్లాల్లో 100 శాతానికిపైగా సాగు

నాలుగు జిల్లాల్లో సాగు విస్తీర్ణం 100 శాతానికి పైగా పెరిగింది. ఆయా జిల్లాల వారీగా చూస్తే..మెదక్ జిల్లాలో 105.82 శాతం, ఆదిలాబాద్ జిల్లాలో 103.94 శాతం, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 102.19 శాతం, నిజామాబాద్ జిల్లాలో 101.10 శాతం విస్తీర్ణంలో వివిధ పంటలు సాగయ్యాయి. అత్యంత తక్కువగా వనపర్తి జిల్లాలో 24.97 శాతం, ఆ తర్వాత ములుగు జిల్లాలో 32.97 శాతం పంటలు సాగయ్యాయి. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 77.07 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.



37 శాతం అధిక వర్షపాతం

ఇక రాష్ట్రంలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 37 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో 44 శాతం వర్షపాతం కొరత ఉండగా, జూలై నెలలో ఏకంగా 114 శాతం భారీ అధిక వర్షపాతం నమోదైంది. 8 జిల్లాల్లో భారీ అధిక వర్షపాతం, 19 జిల్లాల్లో అధిక వర్షపాతం, ఆరు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు అనేకచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని తేరుకోగా, మరికొన్ని చోట్ల నష్టం సంభవించిందని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆయాచోట్ల తిరిగి పంటలు సాగు చేసుకునేందుకు రైతులు నానాయాతన పడుతున్నారు. ఇసుక మేటలు తీయిస్తున్నారు. పంటలు కొట్టుకుపోయిన చోట్ల మళ్లీ దుక్కులు దున్ని పంటలు సాగు చేస్తున్నారు. మరోవైపు పంటలకు జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



☛ పప్పుధాన్యాల సాధారణ సాగువిస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 5.23 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. సోయాబీన్ సాధారణ సాగువిస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.43 లక్షల ఎకరాల్లో సాగైంది.

ఆయా పంటల వారీగా చూస్తే (ఎకరాల్లో..)

పంట	సాధారణ సాగు విస్తీర్ణం	ప్రస్తుతం సాగైంది	గతేడాది ఇదే సమయానికి
వరి	49.86 లక్షలు	36.06 లక్షలు	21.40 లక్షలు
మొక్కజొన్న	7.13 లక్షలు	5.02 లక్షలు	4.43 లక్షలు
పత్తి	50.59 లక్షలు	44.49 లక్షలు	47.27 లక్షలు

వీఆర్‌ఏల సర్దుబాటు షురూ

అంతర్గత ఉత్తర్వులు జారీచేసిన సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్



సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకుల సర్దుబాటు ప్రక్రియ ఓ కొలిక్కి వస్తోంది. పలు ప్రభుత్వశాఖల్లో వారిని విలీనం చేసేందుకు వీలుగా 14,954 సూపర్ న్యూమరీ పోస్టులు ఏర్పాటు చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెవెన్యూతోపాటు మిషన్ భగీరథలో వారిని ఎలా సర్దుబాటు చేయాలన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్‌మిత్తల్ బుధవారం జిల్లా కలెక్టర్లకు అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిలో ఏ పోస్టులో ఎంతమందిని నియమించాలో ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రెవెన్యూ శాఖలో ఇలా...

రెవెన్యూశాఖ పరిధిలో జూనియర్ అసిస్టెంట్ కేటగిరీలో జిల్లాస్థాయిలో 16, డివిజన్‌లో 7, మండల స్థాయిలో ఐదుగురిని నియమించాలని, రికార్డు అసిస్టెంట్ కేటగిరీలో జిల్లాస్థాయిలో ముగ్గురు, డివిజన్‌లో నలుగురు, మండల స్థాయిలో ముగ్గురిని సర్దుబాటు చేయాలని వెల్లడించారు. ఇక, ఆఫీస్ సబార్డినేట్ కేటగిరీలో జిల్లాస్థాయిలో 12 మంది, డివిజన్‌లో నలుగురిని, మండలస్థాయిలో ముగ్గురిని సర్దుబాటు చేయాలని, చైన్‌మెన్లుగా డివిజన్, మండల స్థాయిలో ఒక్కరు చొప్పున నియమించుకోవాలని సూచించారు.

మిషన్ భగీరథలో...

మిషన్ భగీరథకు సంబంధించి ప్రతి రూరల్ మండలంలో ఆరుగురుని నియమించుకోవాలని జిల్లా కలెక్టర్లకు పంపిన ఉత్తర్వుల్లో సూచించారు.

☛ మున్సిపాలిటీలలో వార్డు ఆఫీసర్లు, సాగునీటి శాఖలో లస్కర్లుగా ఎంత మంది వీఆర్‌ఏలను ఎక్కడెక్కడ సర్దుబాటు చేయాలన్న దానిపై ఆయా శాఖలు త్వరలోనే స్పష్టత ఇస్తాయి.

జూనియర్ అసిస్టెంట్‌లుగా ఎలా నియమిస్తారు?

- వీఆర్‌ఏల నియామకం సమంజసం కాదు
- హైకోర్టుకు ఆఫీస్ సబార్డినేట్లు

సాక్షి, హైదరాబాద్: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్‌ఏ)లను జూనియర్ అసిస్టెంట్లుగా ఎలా నియమిస్తారని..వారి నియామకం సమంజసం కాదంటూ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ముందుగా తమ పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని, ఆ తర్వాతే వీఆర్‌ఏల నియామక అంశాన్ని పరిశీలించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్‌ఏలను జూనియర్ అసిస్టెంట్, ఇతర పోస్టుల్లో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 81 జారీ చేసిన విషయం తెలిసిందే. ఇది చట్టవిరుద్ధమని రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన కురిసెంగ ఆదిత్యతో పాటు మరో 29 మంది పిటిషనర్లు పేర్కొన్నారు. 'ఎన్నోసార్లు మాకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేసినా ఆ ప్రక్రియ చేపట్టకుండానే కేవలం రాజకీయ లబ్ధి కోసమే వీఆర్‌ఏలను ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో నియమించారు. జీవో 81ను వెంటనే కొట్టివేయాలి'అని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది పీవీ కృష్ణయ్య వాదనలకు సిద్ధమైనా..ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ రామచంద్రరావు అందుబాటులో లేకపోవడం విచారణ గురువారానికి వాయిదా వేశారు.

ప్రధానమంత్రి బాల పురస్కారానికి దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కారం (పీఎంఆర్‌బీపీ)–2024 కోసం కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 18 ఏళ్లకు మించని ఏ చిన్నారి అయినా ఈ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేసింది. శౌర్యం, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, ఆవిష్కరణలు తదితర రంగాల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది ఉండాలని వివరించింది. పురస్కారాలకు ఈనెల 31లోపు https://awards.-gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరింది. మరిన్ని వివరాలకు పైన సూచించిన పోర్టల్‌ను చూడాలని సూచించింది.

అక్కడ ఎందుకలా చనిపోతున్నారు?

ఆర్జీయూకేటీలో జూన్‌లోనే ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య | తాజాగా మరో విద్యార్థి బలవన్మరణం | పోతున్న ప్రాణాలు.. తేలని కారణాలు



జూన్‌లో ఆత్మహత్య చేసుకున్న దీపిక



జూన్‌లో చనిపోయిన లిఖిత



మంగళవారం ఆత్మహత్య చేసుకున్న బబ్లూ

నిర్మల్: విద్యార్థుల వరుస ఆత్మహత్య ఘటనలు నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో కలకలం రేపుతున్నాయి. ఇందులో చాలా మరణాలు మిస్టరీగానే మిగిలిపోతున్నాయి. జూన్‌లోనే ఇద్దరు విద్యార్థినులు తనువు చాలించగా, ఇటీవలే వర్సిటీలోకి అడుగుపెట్టిన కొత్త విద్యార్థి బలవన్మరణానికి పాల్పడడం కలచివేస్తోంది. విద్యార్థుల ఆత్మహత్యలపై కమిటీలు వేసినా అసలు కారణాలు మాత్రం బయటకు రావడం లేదు. ఘటనలు జరిగినప్పుడు ఒకటి రెండు రోజులు హడావుడి చర్యలు తీసుకుంటూ ఆ తర్వాత చేతులు దులిపేస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఒకప్పుడు 20 వేల నుంచి 30 వేల మధ్య దరఖాస్తులు వచ్చేవి. వరుస ఘటనలతో ఇప్పుడు 10 వేల నుంచి 12 వేల మధ్యకు దరఖాస్తులు పడిపోవడం గమనార్హం.

బలవన్మరణాలు ఎందుకు?

ఎంత ఒత్తిడి, ఎంత బాధ, భవిష్యత్తుపై ఎంత భయం కలిగి ఉంటే.. ఓ 17ఏళ్ల విద్యార్థిని బాత్రూమ్‌లో.. అదీ ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు తన చున్నీతోనే ఉరేసుకుంటుంది..? జూన్ 13న సంగారెడ్డికి చెందిన వడ్ల దీపిక(17) ఇలానే ప్రాణాలు తీసుకుంది. ఆమె చనిపోయిన రోజే నలుగురు సభ్యుల నిజనిర్ధారణ కమిటీ వేసినా.. ఇప్పటికీ కారణాలు బయటపెట్టలేదు. ఇక దీపిక మృతిచెంది రెండురోజులు కూడా గడవకముందే తనతోపాటే పీయూసీ–1 చదువుతున్న గజ్వేల్‌కు చెందిన బుర్ర లిఖిత జూన్ 15న అర్ధరాత్రి తర్వాత గంగా బ్లాక్ నాలుగో అంతస్తుపై నుంచి పడి చనిపోయింది. లిఖిత మరణంలోనూ ఏదో మిస్టరీ ఉందన్న వాదనలు ఇప్పటికీ ఉన్నాయి. తాజాగా ఈ నెల 8న సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం నాగాపూర్‌కు చెందిన జాదవ్ బబ్లూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



బాసర ఆర్జీయూకేటీ

కౌన్సెలింగ్ చేస్తున్నారా..

విద్యార్థుల మృతిపై ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు అనేక అనుమానాలు లేవనెత్తుతున్నాయి. ఇటీవల బాసర సరస్వతీమాత ఆలయంలో హుండీ లెక్కించగా, అందులో తల్లిదండ్రులు రాసిన లేఖ బయటపడింది. విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏకంగా ముగ్గురు కౌన్సిలర్‌లతో కూడిన డిపార్ట్‌మెంట్ ఉంది. అసలు ఆ విభాగం ఏం చేస్తోంది.. నూతన విద్యార్థులకు తరచూ కౌన్సెలింగ్ ఇవ్వడం లేదా..? అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇక బాసర ఆర్జీయూకేటీలో సమస్యలు, మరణాలపైనా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదంటూ ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే.

ఏం జరుగుతోంది..

అసలు.. బాసర ఆర్జీయూకేటీలో ఏం జరుగుతోంది? విద్యార్థులు ఎందుకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారో ఎవరికీ అంతుపట్టకుండా ఉంది. జూన్‌లో ఇద్దరు విద్యార్థినులు చనిపోయినప్పుడు నలుగురు సభ్యులతో వేసిన కమిటీ ఏం నివేదిక ఇచ్చిందో బయటకు రాలేదు. ఇక కళాశాల విద్యార్థులు చనిపోతే ఆ మృతదేహాలను అనాథ శవాల్లా ఒకరిద్దరు సెక్యూరిటీ గార్డులతో మార్చురీకి తరలించేసి యాజమాన్యం దులిపేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. విద్యార్థులు కొన ఊపిరితో ఉన్నప్పుడే ఆస్పత్రులకు పంపించామని చెబుతున్న అధికారులు, బాసరకు దగ్గరగా ఉన్న నిజామాబాద్‌కు పంపించాలి కానీ.. దూరంగా ఉన్న నిర్మల్‌కు ఎందుకు పంపిస్తున్నారన్న ప్రశ్నలూ తలెత్తుతున్నాయి..

కీలక పరీక్షలకు ఖరారు కాని తేదీలు

డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ, గ్రూప్–3 పరీక్షల కోసం అభ్యర్థుల ఎదురుచూపులు

- ఈ మూడు కేటగిరీల్లో 10 లక్షలకు పైగా దరఖాస్తులు
- హెచ్‌డబ్ల్యూఓ, గ్రూప్–3 పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ ముగిసి ఆర్నెల్లు
- నవంబర్ తర్వాత ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల్లో అయోమయం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ అర్హత పరీక్షలపై అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ఒకవైపు ఎన్నికల సమయం ముంచుకొస్తున్నప్పటికీ పలు రకాల కొలువులకు అర్హత పరీక్షల తేదీలను ఖరారు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ద్వారా విడుదలైన నోటిఫికేషన్లకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తున్నా పరీక్ష తేదీలు ఖరారు చేయకపోవడంతో ఆశావహులంతా అయోమయంలో ఉన్నారు. టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో పలు పరీక్షలు రద్దయ్యాయి. దీంతో రద్దయిన పరీక్షల నిర్వహణ వాయిదాపడుతూ వస్తోంది. ఈ క్రమంలో ప్రకటించిన తేదీల్లో మార్పులు అనివార్యం కావడంతో... మరిన్ని పరీక్షల తేదీలు ఇప్పటికీ ఖరారు కాలేదు. ఫలితంగా ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న 10 లక్షలకుపైగా అభ్యర్థులు పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారా అని ఎదురుచూస్తున్నారు.

రద్దు, వాయిదాలతో గందరగోళం

ప్రశ్నపత్రాల లీకేజీతో టీఎస్‌పీఎస్సీ నాలుగు పరీక్షలను రద్దు చేసింది. మరో రెండు పరీక్షలను చివరి నిమిషంలో వాయిదా వేసి, కొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. దీంతో అభ్యర్థులంతా తీవ్ర అయోమయంలో ఉండిపోయారు. ఈ క్రమంలో ముందుగా రద్దయిన పరీక్షలను నిర్వహిస్తూ... ఆ తర్వాత రీషెడ్యూల్ చేసిన పరీక్షలను టీఎస్‌పీఎస్సీ క్రమంగా నిర్వహిస్తూ వచ్చింది. అయినా రద్దయిన డీఏఓ (డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్) పరీక్ష రీషెడ్యూల్ తేదీని ఖరారు చేయలేదు. దీంతోపాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూఓ), గ్రూప్–3 పరీక్షల తేదీలనూ కమిషన్ ప్రకటించలేదు.

ఎన్నికల షెడ్యూల్‌లోపు నిర్వహిస్తేనే...

సాధారణంగా పరీక్ష తేదీ ప్రకటనకు కనీసం నెలన్నర సమయం తీసుకుంటున్న కమిషన్... డీఏఓ, గ్రూప్–3, హెచ్‌డబ్ల్యూఓ ఉద్యోగ అర్హత పరీక్షలను ఎప్పుడు నిర్వహిస్తుందోనని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పరీక్షలకు సన్నద్ధమైన అభ్యర్థులు ఏ క్షణంలో అయినా హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికలకు సమయం ముంచుకొస్తోంది. గత ఎన్నికలు జరిగిన తీరును పరిశీలిస్తే ఈసారి డిసెంబర్ మొదటివారం నాటికి ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ లెక్కన నవంబర్‌లో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే ఆలోపు పరీక్షలు నిర్వహించాలని, ఎన్నికల సమయంలో అధికారులంతా ఎలక్షన్ డ్యూటీలతో బిజీగా ఉంటే పరీక్షల నిర్వహణ కష్టమనే అభిప్రాయం వస్తోంది. దీంతో ఎన్నికల షెడ్యూల్‌లోపే పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ముగిసిన ఇంజనీరింగ్ మూడో కౌన్సెలింగ్

- ఇప్పటివరకూ 70 వేల సీట్ల భర్తీ
- ఇంకా మిగిలిన సీట్లు 13,149
- 12లోగా రిపోర్టింగ్‌కు అవకాశం
- భారీగా మిగిలిన సివిల్, మెకానికల్ సీట్లు
- 17 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: తుది విడత ఎంసెట్ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. ఈ విడత సీట్ల కేటాయింపును సాంకేతిక విద్యా విభాగం ప్రకటించింది. దీంతో ఇప్పటివరకూ 70,627 సీట్లను ఎంసెట్ అర్హులతో భర్తీ చేశారు. 16 యూనివర్సిటీలు, రెండు ప్రైవేటు వర్సిటీలు, 156 ప్రైవేటు కాలేజీలు కలిపి మొత్తం 174 ఇంజనీరింగ్ కాలేజీల్లో 83,766 సీట్లు అందుబాటులో ఉండగా..తాజా కేటాయింపు అనంతరం ఇంకా 13,139 సీట్లు మిగిలిపోయాయి. ఈ సీట్లను, తుది విడత కౌన్సెలింగ్ తర్వాత విద్యార్థులు చేరకుండా మిగిలిపోయే సీట్లను ఈ నెల 17న ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు. తుది విడతలో 35,757 మంది విద్యార్థులు 3,06,820 ఆప్షన్లు ఇచ్చారు. 30 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 5,400 మందికి ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు కేటాయించారు. సీట్లు వచ్చిన విద్యార్థులు గురువారం ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడం గానీ లేదా 12వ తేదీలోగా కాలేజీకి వెళ్లి అన్ని సర్టిఫికెట్లు, సీటు కేటాయింపు పత్రాన్ని సమర్పించి సీట్లు ఖరారు చేసుకోవాలని అధికారులు సూచించారు.

కంప్యూటర్ సీట్లన్నీ భర్తీ

దాదాపు మూడొంతుల సీట్లు కంప్యూటర్ కోర్సుల్లోనే భర్తీ అయ్యాయి. మొత్తం 83,766 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, ఇందులో 56,811 సీట్లు కంప్యూటర్ బ్రాంచీల్లోనే ఉన్నాయి. ఇప్పటివరకూ భర్తీ చేసిన సీట్లలో కంప్యూటర్ బ్రాంచ్‌ల్లోనే 53,034 సీట్లు ఉన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్క్, సీఎస్ఈ ఆరిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచీల్లో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి. సీఎస్‌సీలో 22,845 సీట్లు భర్తీ కాగా 966 సీట్లు మాత్రమే మిగిలిపోయాయి. ఐటీ బ్రాంచీలో 5,324 సీట్లకు 5,131 సీట్లు మూడో విడత కౌన్సెలింగ్ తర్వాత భర్తీ చేశారు. ఈ బ్రాంచీలో 193 సీట్లు మాత్రమే మిగిలాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వాటి అనుబంధ బ్రాంచీల్లో 17,567 సీట్లు ఉంటే, 13,417 మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 4,150 సీట్లు మిగిలాయి. సివిల్, మెకానికల్ వాటి అనుబంధ బ్రాంచీల్లో భారీగా సీట్లు మిగిలిపోయాయి. 8,187 సీట్లు ఉంటే, 3,457 సీట్లు భర్తీ అయితే, ఇంకా 4,730 సీట్లు మిగిలిపోయాయి.

మూడో విడత కౌన్సెలింగ్ తర్వాత ఇంజనీరింగ్ ప్రధాన బ్రాంచీల్లో సీట్ల భర్తీ ఇలా..

బ్రాంచ్	ఉన్న సీట్లు	భర్తీ చేసినవి	మిగిలినవి	భర్తీ శాతం
కంప్యూటర్ బ్రాంచీలు	56,811	53,034	3,777	93.35
ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్	17,567	13,417	4,150	76.38
సివిల్, మెకానికల్	8,187	3,457	4,730	42.23
ఇతర బ్రాంచీలు	1,209	719	490	59.47
మొత్తం	83,766	70,627	13,139	84.31

మూడు వారాల్లో వివరాలు సమర్పించండి

సరూర్‌నగర్ కాలేజీ టాయిలెట్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సరూర్‌నగర్ కాలేజీలో టాయిలెట్ల నిర్మాణంపై మూడు వారాల్లో వివరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మూడువారాల గడువు కావాలని, నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియజేస్తామని ప్రభుత్వం తరఫు కౌన్సిల్ కోరడంతో, ధర్మాసనం అనుమతించింది. తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో వసతుల లేమిపై ఓ పత్రికలో వచ్చిన వార్త ఆధారంగా కొత్తగూడెం భద్రాద్రి జిల్లాకు చెందిన ఎల్ఎల్‌బీ విద్యార్థి నల్లపు మణిదీప్ గత ఫిబ్రవరిలో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టి.. ప్రభుత్వానికి 3 వారాలు గడువు ఇచ్చింది.

ప్రధానిని కలిసిన ఎల్పీయూ చాన్స్‌లర్

సాక్షి, హైదరాబాద్: లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్పీయూ) చాన్స్‌లర్, రాజ్యసభ సభ్యుడు అశోక్‌కుమార్ మిట్టల్ ప్రధాని నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిశారు. ఈ సందర్భంగా 2019లో భారతీయ సైన్స్ కాంగ్రెస్ సందర్భంగా ప్రధాని ఎల్పీయూ సందర్శించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిని పెంపొందించేందుకు ఉన్నత విద్యలో పరిశోధనలు, ఆవిష్కరణల ప్రాముఖ్యంపై అశోక్ తన ఆలోచనలు పంచుకున్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్‌లో భాగంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తున్నందుకు ప్రధానికి అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని (ఎన్ఈపీ) ప్రశంసించారు.

కేసీఆర్ పాలనలో గిరిజనుల సమస్యలన్నీ పరిష్కారం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో మంత్రి సత్యవతి రాథోడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలనలో గిరిజనుల సమస్యలు దాదాపు పరిష్కారమయ్యాయని మహిళాభివృద్ధి, శిశు, గిరిజన సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు, పోడురైతులకు పట్టాల పంపిణీ అంశాలకు శాశ్వత పరిష్కారం కల్పించి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గిరిజనులకు ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి రాజకీయ చైతన్యాన్ని కల్పించారన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బంజారాహిల్స్‌లోని గిరిజన, ఆదివాసీ భవన్‌లలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల అమల్లో కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ములుగు జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం భూకేటాయింపులు, భవనాల వసతిని కల్పించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తీవ్ర కాలయాపన చేస్తోందన్నారు. పదేళ్లు కావొస్తున్నా వర్సిటీ జాడ లేకపోవడంతో ఎంతోమంది గిరిజన బిడ్డలు ఉన్నత చదువులకు నోచుకోకుండా పోయారని మండిపడ్డారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం గిరిజనుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు కట్టబెడుతూ గిరిజనులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో శాసనసభ్యులు దానం నాగేందర్, శంకర్‌నాయక్, బానోత్ హరిప్రియనాయక్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.